వాసులీ
నీతి నాయకులపై విశ్లేషణ
ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ


తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
epaper.vaartha.com WWW.VAARTHA.COM
రాజమహేంద్రవరం
: fb.com/vaartha Digital

మీ ఆర్థిక అవసరాల ఆశయసాధన
KAPIL GROUP కపిల్ చిట్స్
Visit Us: www.kapilchits.com
కపిల్ చిట్స్ మీ కలలకు సాకారం

Published from Rajahmundry, Vijayawada, Hyderabad, Visakhapatnam, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
9-12-2025 మంగళవారం సంపుటి: 31 సంచిక: 308 పేజీలు: 8 వెల: 6.50

# విధ్వంసం నుండి అభివృద్ధిలోకి

**వ్యవస్థలను మళ్లీ దారిలోకి తెస్తున్నాం**
**కేంద్ర జిడిపి కంటే రాష్ట్రంలో వృద్ధిరేటు అధికం**
**పరిశ్రమల రంగంలో 12.20%, సేవల రంగంలో 11.30% వృద్ధి**
**సుపరిపాలన, సూపర్ సిక్స్‌తో సంక్షేమం: సిఎం చంద్రబాబు**



**విజయవాడ,డిసెంబరు 8,ప్రభాతవార్తప్రతినిధి:** విధ్వంసమైన ఆంధ్రప్రదేశ్ ఆర్థిక వ్యవస్థను మళ్లీ గాడిలో పెడుతున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. టిడిపి అనేక విజయాలను చవిచూసినప్పటికి 2024 విజయం నమ్మకం, విశ్వాసంమీద వచ్చిందనితెలిపారు. సూపర్ సిక్స్‌ను సూపర్ హిట్ చేశామన్నారు. పరీక్ష రాసినప్పుడు పిల్లలు ఎంత టెన్షన్‌గా ఉంటారో తాము అంతే టెన్షన్‌గా ఉంటామని చెప్పుకొచ్చారు. జిఎస్డీపీ విషయంలో ఎప్పటికప్పుడు సమీక్షించుకుంటున్నామని తెలిపారు. రాష్ట్రంలో గత ప్రభుత్వ నిర్వాకంతో ఐదేళ్లపాటు అభివృద్ధి ఆగిపోయిందని, ఆదాయం తగ్గిపోయిందని సిఎం చంద్రబాబు అన్నారు. ప్రస్తుతం ఓ వైపు రాష్ట్రాన్ని అభివృద్ధి బాటలో నడిపిస్తూ ప్రజలకు సంక్షేమ పథకాలు అందిస్తున్నామన్నారు. సోమవారం సచివాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. పలు అంశాలను ఆయన పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. గత ప్రభుత్వం కేంద్ర పథకాల్లో అవకతవకలకు పాల్పడిందని, కేంద్ర నిధులను ఇతర పథకాలకు మళ్లించిందని అన్నారు. అదేవిధంగా కక్షపూరిత రాజకీయాలతో గత పాలకులు ప్రజాధనాన్ని నష్టం చేశారని చంద్రబాబు ధ్వజమెత్తారు.

2024-19 మధ్య 13.5 శాతంగా ఉన్న వృద్ధిరేటు 2019-24 మధ్య కాలంలో 10.32 శాతానికి పడిపోయిందని తెలిపారు. గత ప్రభుత్వం వారసత్వంగా ఇచ్చి వెళ్లిన 85 లక్షల మెట్రిక్ టన్నుల చెత్తను తొలగించడానికే ఎక్కువ సమయం పడుతోందన్నారు. జనవరి 1 నాటికి ఎక్కడా చెత్త లేకుండా చేయాలని లక్ష్యంతో పనిచేస్తున్నామని తెలిపారు. ప్రతీ త్రైమాసికం, ఆర్థిక సంవత్సరంలో సాధిస్తున్న రాష్ట్రస్థూల ఉత్పత్తిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నామన్నారు. ప్రజల కోసం ఎంత కష్టమైనా సరే బాధ్యత తీసుకుని అభివృద్ధి చేస్తామని సిఎం చంద్రబాబు స్పష్టంచేశారు. ఆస్తులను, భవిష్యత్ ఆదాయాన్ని కూడా తాకట్టు పెట్టి గతంలో అప్పులు తెచ్చారన్న ఆయన, మూలధన వ్యయం చేయకపోవటంతో గతంలో ఎక్కడా ప్రాజెక్టులు ముందుకు వెళ్లలేదని విమర్శించారు. కూటమి అధికారంలోకి వచ్చాకే వాటిని ముందుకు తీసుకు వెళ్లగలిగామన్నారు. స్వల్ప,మధ్య, దీర్ఘకాలిక ప్రాజెక్టులపై మూల ధన వ్యయాన్ని గణనీయంగా పెంచి ప్రాజెక్టులు చేపట్టామని చంద్రబాబు తెలిపారు.

**తొలి, రెండో త్రైమాసికం ఫలితాలు విడుదల**

అలాగే 2025-26 తొలి అర్ధ సంవత్సరం (ఏప్రిల్ నుంచి సెప్టెంబర్), 2వ త్రైమాసికం (జూలై నుంచి సెప్టెంబర్) ఫలితాలను సిఎం చంద్రబాబు విడుదల చేశారు. రెండోత్రైమాసికం ప్రస్తుత ధరల్లో రాష్ట్ర జిఎస్డీపీ మొత్తంగా 11.28 శాతం >>2



## వందేమాతరం.. భారత్ వికాస మంత్రం

- స్వాతంత్ర్య ఉద్యమానికి ఆ గీతమే ప్రేరణ
- నేటి తరానికి అదే నిరంతర స్ఫూర్తి
- లోక్‌సభ ప్రత్యేక చర్చలో ప్రధాని మోడీ
- జాతీయగీతాన్ని నెహ్రూ ముక్కలు చేశారని విమర్శ
- ఎమర్జెన్సీని చీకటి అధ్యాయమన్న ప్రధాని
- కాంగ్రెస్ సభ్యుల తీవ్ర అభ్యంతరం
- ఆందోళనల మధ్యే కొనసాగిన ప్రధాని ప్రసంగం

**న్యూఢిల్లీ, డిసెంబరు 8:** వందేమాతర మంత్రం స్వాతంత్ర్య సమరోత్సాహ సమయంలో యావత్ దేశ ప్రజలకు శక్తిని, ప్రేరణను ఇచ్చింది. వందేమాతరం కేవలం రాజకీయ స్వేచ్ఛ కోసం జపించిన మంత్రం కాదని, భరత మాతను వలసవాద అవశేషాల నుంచి విముక్తి చేయడానికి రూపొందించిన పవిత్ర యుద్ధ నినాదమని ప్రధాని మోడీ అన్నారు. వందేమాతరం 150 ఏళ్ల ఉత్సవాలపై లోక్‌సభలో ప్రధాని మోడీ ప్రత్యేక చర్చ ప్రారంభించిన ఆయన, యేడాది పొడవునా వందేమాతరం వేడుకలు జరుపుకొంటున్నట్లు వివరించారు. ఇవాళ్టి చర్చలు భవిష్యత్తు తరానికి స్ఫూర్తిగా నిలుస్తాయన్న ప్రధాని, స్వాతంత్ర్య ఉద్యమానికి శక్తి, ప్రేరణనను ఇచ్చిన వందేమాతరం 150 ఏళ్ల వేడుకల్లో మనం భాగం కావడం గర్వకారణమన్నారు. వందేమాతరం.. ఆజాద్ భారత్‌కు విజన్‌గా మారిందని వెల్లడించారు. >>2

# సంక్రాంతినుంచి అన్ని సేవలు ఆన్‌లైన్

### డ్రోన్ సేవలు మరింత విస్తృత పరచాలి: ఆర్టీజిఎస్ సమీక్షలో సిఎం చంద్రబాబు

**విజయవాడ,డిసెంబరు 8,ప్రభాతవార్తప్రతినిధి:** వచ్చే సంక్రాంతి నుంచి రాష్ట్రంలో పౌరులకు అన్ని సేవలూ ఆన్‌లైన్‌లోనే అందించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. ఈ దిశగా ఆయా శాఖలన్నీ చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆర్టీజీఎస్‌పై సిఎం సోమవారం సమీక్ష నిర్వహించారు. సంక్రాంతి నుంచి ప్రజలకు అన్ని సేవలు ఆన్ లైన్‌లోనే అందజేయాలన్నారు. ఆన్‌లైన్‌లో సేవలు అందించడం ద్వారా ప్రజలకు సేవలు పారదర్శకంగా అందడంతో పాటు వారిలో ప్రభుత్వ పని తీరు పట్ల సంతృప్త స్థాయి పెరుగుతుందన్నారు.

ఇప్పటికీ కొన్ని శాఖలు భౌతికంగానే సేవలందిస్తున్నాయని అలాంటి శాఖలు వెంటనే తమ పంథా మార్చుకుని ప్రజలకు ఆన్‌లైన్‌లో సేవలందించేలా ఏర్పాట్లు చేసుకోవాలని ముఖ్యమంత్రి అన్నారు. ప్రజలకు కావాల్సిన ప్రభుత్వ సేవలన్నీ, ప్రభుత్వ కార్యాలయాలకు తిరగనవసరం లేకుండా మనమిత్ర వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా అందజేస్తున్నామని, దీనిపై ప్రజల్లో విస్తృతంగా అవగాహన కల్పించాలని ముఖ్యమంత్రి చెప్పారు. రిజిస్ట్రేషన్ల అనంతరం డాక్యుమెంట్లు కొరియర్ ద్వారా నేరుగా సంబంధిత వ్యక్తుల ఇళ్లకే పంపే ఏర్పాట్లు చేయాలన్నారు. ఆర్టీసీ సేవలు మరింత మెరుగయ్యేలా చూడాలన్నారు. బస్టాండు ప్రాంగణం, పరిసరాలు, టాయ్‌లెట్ల వద్ద పరిశుభ్రత పాటించే విధంగా చర్యలు ఉండాలని సీఎం అన్నారు. డ్రోన్ సేవలు మరింత విస్తృత పరిచాలని, ఇందుకోసం ప్రత్యేకంగా ఒక మాస్టర్ ప్లాన్ రూపొందించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు.

భవిష్యత్తులో డ్రోన్ల ఉపయోగం గణనీయంగా పెరుగుతుందన్నారు. పురుగు మందుల వినియోగం తగ్గించేందుకు డ్రోన్లను ఎలా వాడుకోవచ్చోననే అంశంపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. పారిశుధ్యం నిర్వహణ ద్వారా వ్యాధుల వ్యాప్తి లేకుండా చేయవచ్చని తెలిపారు. కొన్ని జిల్లాల్లో కొంతమంది అధికారులు మంచి కార్యక్రమాలు అమలు చేస్తున్నారని... అలాగే కొందరు అవలంభించే మంచి పద్ధతులను గుర్తించి మిగిలిన జిల్లాల్లో కూడా అమలయ్యేలా చూడాలని సీఎం సూచించారు. ఈ సమీక్షలో సీఎస్ విజయానంద్ సహా వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

**పి4 జీరో పావర్టీపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సమీక్ష..**

పి4జీరో పావర్టీపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సమీక్ష అధికారులతో సమీక్షను నిర్వహించారు.పి4 అమల్లో బంగారు కుటుంబాలకు అవసరమైన సాయంపై నిర్వహించిన సర్వేపై అధికారులతో సిఎం సమీక్షలో పలు అంశాలపై మార్గదర్శకాలు చేసారు. మార్గదర్శకులు ఈ కార్యక్రమంలో మనింతగా ముందుకు వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు.పీ4 సర్వేలో వైద్యసాయం, ఉద్యోగం, చిరు వ్యాపారాల విస్తరణ, వ్యవసాయం, నూతన ఆవిష్కరణలు, ఉన్నత విద్య, నైపుణ్యాల పెంపుపై సాయం >>2

## ఇండిగోదే తప్పు : సిఎం చంద్రబాబు నాయుడు 2లో

# నిరుపయోగ స్థలాలు ఇక వాడకం

### వాటినుంచి ఆదాయం పొందేలా ప్రణాళికలు: ప్రభుత్వం

**విజయవాడ, డిసెంబరు 8,ప్రభాతవార్తప్రతినిధి:** ఎపి ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది.ఈ నిర్ణయాన్ని అనుసరించి రాష్ట్రంలో నిరుపయోగంగా ఉన్న పట్టణ. నగరపాలక సంస్థలకు చెందిన విలువైన భూములు, స్థలాలు వినియోగంలోకి రానున్నాయి. వీటి ద్వారా ఆదాయం పొందేలా పట్టణ .నగర అభివృద్ధిశాఖ ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యం (పిపిపి)లో వీటిని నివాస, వాణిజ్య అవసరాలకు కేటాయించనున్నారు.

రాష్ట్రంలో 123 పట్టణ స్థానిక సంస్థలు, 17 పట్టణ అభివృద్ధి సంస్థలకు వేల ఎకరాల్లో భూములు, భవనాలు ఉన్నాయి. ఇవి ఆక్రమణలకు గురవుతున్నాయి. భవనాలు నిర్వహణ లేక శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. వీటిని గుర్తించి పిపిపి విధానంలోనే కేటాయించనున్నారు. ఇప్పటికే ఆరు పట్టణాభివృద్ధి సంస్థల్లో 685.81 ఎకరాల భూములను అధికారులు గుర్తించారు. వీటిలో వివిధ వ్యాపారాల నిర్వహణ జరిగే విధంగా ఏర్పాట్లు చేయనున్నారు. ఇందుకుగానూ ఆసక్తి గల సంస్థల నుంచి ప్రతిపాదనలు ఆహ్వానిస్తున్నారు. దీనికి సంబంధించి నెలాఖరుకు మరో 10 పట్టణాభివృద్ధి సంస్థల్లో భూములు సిద్ధం చేయనున్నారు.

**ఖాళీ స్థలాల గుర్తింపు:**

పట్టణ స్థానిక సంస్థలు ప్రభుత్వంపై ఆధారపడకుండా ఉన్న వనరుల సద్వినియోగం చేసుకోవాలి. తద్వారా ఆదాయం సాధించాలి. దీనికి సంబంధించి సిఎం చంద్రబాబు ఆదేశాలు జారీచేశారు. పురపాలక, పట్టణాభి >>2




### గూడ్స్ రవాణా బంద్! నేటి నుంచి లారీ యజమానుల ఆందోళన

**విజయవాడ,డిసెంబరు 8,ప్రభాతవార్తప్రతినిధి:** ఎపి లారీ యజమానుల సంఘం ఆందోళన బాట పట్టింది. వాహనాల టెస్టింగ్, ఫిట్‌నెస్ ఫీజులకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం నిర్ణయానికి నిరసనగా.. డిసెంబరు 9 నుంచి షిప్ యార్డులు, రైల్వే షెడ్లలో గూడ్స్ రవాణా నిలిపివేస్తామని ఎపి లారీఓనర్ల సంఘం హెచ్చరించింది. 13 ఏళ్ల దాటిన వాహనాల టెస్టింగ్, ఫిట్‌నెస్ ఫీజులను కేంద్రం ఇటీవల పెంచింది. ఆ మేరకు నోటిఫికేషన్ విడుదల చేసింది. అయితే ఈ ఫీజులను తగ్గించాలని లారీ యజమానులు కోరుతున్నారు. కేంద్రం జారీ చేసిన నోటిఫికేషన్ వెంటనే నిలుపుదల చేయాలని కోరుతున్నారు. నోటిఫికేషన్ నిలుపుదల చేయకపోతే మంగళవారం అర్ధరాత్రినుంచి షిప్ యార్డులు, రైల్వేషెడ్లలో గూడ్స్ రవాణా నిలిపివేస్తామని హెచ్చరించారు. మరోవైపు వాహనాల టెస్టింగ్, ఫిట్‌నెస్ ఫీజులపై కేంద్రం విడుదల చేసిన నోటిఫికేషన్ నిలిపి >>2

### నకిలీ మద్యం కేసు నలుగురు నిందితులు అబ్కారీ కస్టడీకి

**విజయవాడ, డిసెంబరు 8, ప్రభాతవార్త ప్రతినిధి:** నకిలీ మద్యం కేసులో నలుగురు నిందితులను కస్టడీకి అప్పగిస్తూ విజయవాడ కోర్టుఆదేశాలు జారీ చేసింది. అబ్కారీ అధికారులు నిందితులను పదిరోజులు తమ కస్టడీకి పంపాలని కోర్టును అభ్యర్థించగా.. న్యాయస్థానం అంగీకరించింది. కోర్టు ఆదేశాల మేరకు నిందితులు.. కట్టా రాజు, సయ్యజ్ హాజీ, అంథా దాస్, మిథున్ దాస్‌లను ఈ నెల 11 >>2



సోమవారం ఆలయ దోపిడి వివరాలను మీడియాకు వివరిస్తున్న డిఎస్పీ శివనారాయణ స్వామి

# ఇఒ చోరీ ఘటనపై సిఎం సీరియస్

### సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు

### మురళీకృష్ణను అరెస్టు చేసిన పోలీసులు

**కదిరి, డిసెంబరు 8 ప్రభాతవార్త:** కదిరి రూరల్ పరిధిలోని గంగమ్మ గుడిలో విలువైన వస్తువులను ఇఒనే చోరీ చేసిన ఘటనపై ప్రభుత్వం చర్యలు చేపట్టింది. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశాలతో ఇఒ మురళీకృష్ణను సస్పెన్షన్ చేస్తూ దేవాదాయ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఆలయంలోని వెండి ఆభరణాలు, విలువైన చీరలతో సహా ఇతరాత్ర విలువైన వస్తువులను అదే దేవాలయంలో ఎగ్జిక్యూటివ్ అధికారిగా విధులు నిర్వహించే మురళీకృష్ణ, కుటుంబ సభ్యులతో కలిసి ఆటోలో తీసుకెళ్తూ రెడ్ హ్యాండెడ్‌గా గ్రామస్తులకు దొరికిపోయాడు. ఆలయ ఇఒ ఇలాంటిఘటనకు పాల్పడటంపై సిఎం చంద్రబాబునాయుడు >>2

## జనవరి 19న దావోస్‌కు సిఎం చంద్రబాబు 2లో

### ముఖ్యమంత్రి పర్యటన షెడ్యూలు ఖరారు



సోమవారం న్యూఢిల్లీలోని ఇందిరాగాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో ఇండిగో ప్రయాణికుల లగేజ్ బ్యాగులు

# ఇండిగోదే తప్పు: సిఎం చంద్రబాబు

**విజయవాడ,డిసెంబరు 8,ప్రభాతవార్తప్రతినిధి:** డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ నిబంధనలు పాటించకపోవడం వల్ల విమానాల రద్దు, ప్రయాణికుల ఇబ్బందులు ఏర్పడ్డాయని, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి ఎన్. చంద్రబాబు నాయుడు అన్నారు. ఇది ఎయిర్‌లైన్ మేనేజ్‌మెంట్ లోపమని స్పష్టం చేశారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి ఎన్. చంద్రబాబు నాయుడు ఏపి సెక్రటేరియేట్‌లో జరిగిన ప్రెస్ మీట్‌లో ఇండిగో ఎయిర్‌లైన్స్ సంక్షోభంపై స్పందించారు. డిజిసిఎ వ్యవధి ఇచ్చినా ప్రమాణాలను ఇండిగో పాటించలేదు. దీంతో విమానాలు రద్దు అయ్యాయి, ఇబ్బందులు వచ్చాయి. క్షమాపణలు చెప్పినా ప్రయాణికులకు అసౌకర్యం కలిగిందని అని చంద్రబాబు వ్యాఖ్యానించారు. నా హెలికాప్టర్ కూడా నిబంధనల మేరకు కొన్ని గంటలే ప్రయాణం చేస్తుందని గుర్తుచేశారు. తాము ఈ వ్యవహారాన్ని పర్యవేక్షించడం లేదని చంద్రబాబు స్పష్టం చేశారు. జాతీయ మీడియాతో మాట్లాడిన ఓ టిడిపి నేత.. నారా లోకేష్ కూడా మానిటర్ చేస్తున్నారని చెప్పడం వివాదాస్పదమయింది. ఈ అంశంపై చంద్రబాబు క్లారిటీ ఇచ్చారు. తాము మానిటర్ చేయడం లేదన్నారు. కేంద్ర ప్రభుత్వం ఈ సంక్షోభాన్ని త్వరలోనే పరిష్కరిస్తున్నారు.



ఇఒ నుంచి స్వాధీనం చేసుకున్న వెండి, బంగారు, చీరెలు

# రూ.827 కోట్లు రిఫండ్

## ఖచ్చితమైన కారణాలు ఇప్పుడే చెప్పలేం: ఇండిగో

## అంతర్గత సమస్యలతోనే సంక్షోభం: కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు

**న్యూఢిల్లీ, డిసెంబరు 8:** ఇండిగో విమానాల టికెట్ల రీఫండ్‌కు సంబంధించి కేంద్ర విమానయాన మంత్రిత్వ శాఖ కీలక వివరాలు వెల్లడించింది. సంక్షోభం కారణంగా రద్దైన, ఆలస్యమైన విమానాల టికెట్ల రిఫండ్‌కు సంబంధించి ఇప్పటి వరకూ రూ.827 కోట్లను ఇండిగో చెల్లించినట్లు ప్రకటించింది. రెండు వారాల్లోనే ఈ మొత్తం రిఫండ్ చేసినట్లు తెలిపింది. నవంబర్ 21 నుంచి డిసెంబర్ 7 మధ్య రెండువారాల్లో మొత్తం 9,55,591 టికెట్ల రద్దుకు సంబంధించి రూ.827 కోట్లను తిరిగి చెల్లించినట్లు సంబంధిత వర్గాలు తాజాగా వెల్లడించాయి. డిసెంబర్ 1 నుంచి డిసెంబర్ 7 మధ్య ఆరు లక్షల టిక్కెట్ల రద్దుకు సంబంధించి రూ.569 కోట్లను తిరిగి రీఫండ్ చేసినట్లు తెలిపాయి. 9,000 బ్యాగుల్లో ప్రభావిత ప్రయాణికులకు ఇప్పటి వరకూ 4,500 సామగ్రిని ఇండిగో తిరిగి ఇచ్చినట్లు పేర్కొన్నాయి. రాబోయే 36 గంటల్లో బ్యాలెన్స్ బ్యాగులను డెలివరీ చేయడమే లక్ష్యంగా ఉన్నట్లు ఎయిర్‌లైన్స్ వర్గాలు వెల్లడించాయి.

**మరికొంత గడువు కావాలి....**

విమానసర్వీసుల అంతరాయంపూ వివరణ ఇవ్వాలని డిజిసిఎ జారీచేసిన షోకాజ్‌నోటీసులకు ఇండిగో స్పందించింది. తాముచేసిన పొరపాటుకు క్షమాపణలుచెపుతున్నామని వివరించింది. ఖచ్చితమైన కారణాలు గుర్తించేందుకు మరికొంత సమయం కావాలనికోరింది. కొన్ని ప్రాథమిక కారణాలను అదిస్తున్నట్లు డిజిసిఎకువివరించింది. సిఇఒ, సిఒఒ సంతకాలతో కూడిన వివరణ సోమవారం డిజిసిఎకు అందించింది. పరిస్థితి సంక్లిష్టత, కార్యకలాపాలను విస్తరించిన దృష్ట్యా కచ్చితమైన కారణాలను స్పష్టంగా చెప్పలేమని తెలిపింద.ఇ మూల కారణాలు విశ్లేషించేందుకు తమకు మరింత గడువుకావాలని కోరింది. మాన్యువల్‌లో షోకాజ్ నోటీసుకు 15 రోజుల గడువు ఉందని గుర్తుచేసింది. ఆర్‌సిఎ పూర్తి అయిన వెంటనే వివరాలు అందచేస్తామని ఇండిగో తెలిపింది.

**అంతర్గత సమస్యలతోనే ఇండిగో సంక్షోభం**

అంతర్గత సమస్యలతోనే ఈ ఇండిగో సంక్షోభం తలెత్తినట్లు కేంద్ర పౌర విమానయాన మంత్రి రామ్మోహన్ నాయుడు చెప్పారు. పార్లమెంట్ శీతాకాలసమావేశాల సందర్భంగా రాజ్యసభలో ఎంపీ ప్రమోద్ తివారీ లేవనెత్తిన ప్రశ్నకు రామ్మోహన్ నాయుడు సమాధానమిచ్చారు. ఇండిగో సంక్షోభాన్ని తేలిగ్గా తీసుకోవడంలేదు. దీనిపై ఎప్పటికప్పుడు పరిస్థితులను సమీక్షించాం. పరిస్థితులకు అనుగుణంగా చర్యలు తీసుకున్నాం. సమస్య పరిష్కారానికి వెంటనే అప్రమత్తం చేశాం. ఇండిగో సంక్షోభానికి దాని సిబ్బంది రోస్టరింగ్, అంతర్గత ప్రణాళిక వ్యవస్థలోని సమస్యలే కారణం. ఫ్లైట్ డ్యూటీ టైమ్ లిమిటేషన్ నియమాలతో ఎలాంటి సమస్యలూ లేవు. అందరితో చర్చించాకే ఎఫ్‌డీటీఎల్ నిబంధనలను రూపొందించాం. నెలవరకూ సజావుగానే విమాన సర్వీసులు నడిచాయి. ఈనెల 1న జరిగిన సమావేశంలోనూ ఇండిగో ఎలాంటి సమస్యనూ లేవనెత్తలేదు. మూడవతేదీనుంచే సమస్య మొదలైంది. ఇండిగో విమానాలరద్దు, ఆలస్యం కారణంగా లక్షలాది మంది ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ప్రయాణికులకు కలిగిన ఈ అసౌకర్యానికి చింతిస్తున్నాం అని అన్నారు. అదేవిధంగా ప్రస్తుత సంక్షోభం నేపథ్యంలో టికెట్ ధరలు పెంచకుండా పరిమితి విధించినట్లు ఆయన తెలిపారు.

# అన్ని సేవలు ఆన్‌లైన్

>> కోరిన బంగారు కుటుంబాలకు ఆ దిశలో మార్గదర్శకుల నుంచి సాయం అందే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. పేదరిక నిర్మూలన దిశలో మనం చేపట్టిన ఈ కార్యక్రమం ఇప్పటికే మంచి ఫలితాలను ఇస్తుందన్నారు. 10లక్షలకు పైగా మార్గదర్శకులు ఈ కార్యక్రమంలోకి రావాలనే లక్ష్యదిశను అధిగమించడంతో పాటు ఇప్పటికే ఉన్న బంగారు కుటుంబాలతో పాటు రెట్టింపు సంఖ్యలో కుటుంబాల అవసరతల తీరాలన్నారు.

# జనవరి 19న దావోస్‌కు సిఎం చంద్రబాబు

**విజయవాడ, డిసెంబరు 8 ప్రభాతవార్త ప్రతినిధి:** ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దావోస్ పర్యటన షెడ్యూల్ ఖరారైంది. వచ్చే ఏడాది జనవరి 19వ తేదీ నుంచి 23వ తేదీ వరకు దావోస్‌లో సిఎం చంద్రబాబు పర్యటించ నున్నారు. ఈ టూర్‌లో దావోస్ ఎకనామిక్ ఫోరం సదస్సుకు సిఎం హాజరుకానున్నారు. చంద్రబాబుబృందంలో మంత్రులు నారా లోకేశ్, టిజి భరత్ ఉన్నారు. ఈ మేరకు సిఎం దావోస్ పర్యటన షెడ్యూల్‌ను ఖరారైనట్లు అధికారికంగా ప్రభుత్వం ప్రకటన విడుదల చేసింది. దావోస్ పర్యటనలో పలువురు పారిశ్రామికవేత్తలను సిఎం చంద్రబాబు కలిసే అవకాశాలు ఉన్నాయి. ఎపిలో పెట్టుబడులపై పారిశ్రామిక వేత్తలతో చంద్రబాబు చర్చించే అవకాశముంది.

# అబ్కారీ కస్టడీకి

>> నుంచి 15 వరకు కస్టడీలోకి తీసుకోనున్నారు ఎక్సైజ్ అధికారులు. నకిలీ మద్యం తయారీ, పంపిణీకి సంబంధించి లోతైన సమాచారాన్ని రాబట్టే దిశగా అధికారులు దర్యాప్తు చేపట్టను న్నారు. రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం రేపిన ఈ నకిలీ మద్యం కేసులో.. అన్నమయ్య జిల్లా సహా పలు ప్రాంతాల్లో నకిలీ మద్యం తయారీ కేంద్రాలు బయటపడటంతో ప్రభుత్వం దీనిపై విచారణకు సిట్‌ను ఏర్పాటుచేసింది. ఈకేసులో ఇప్పటికే పలువురు నిందితులు అరెస్ట్ అయ్యారు. వారిలో జోగి రమేశ్, జోగిరాము సోదరులూఉన్నారు. తాజాగా.. మరో నలుగురు నిందితుల కస్టడీద్వారా ఈ కేసుపై మరింతలోతైన విచారణజరిగి కీలక అంశాలు బయటపడే అవకాశమున్నట్టు తెలుస్తోంది.

# సిఎం సీరియస్

>> సీరియస్‌గా తీసుకున్నారు. ఘటనకు పాల్పడిన ఇఒ మురళీకృష్ణను సస్పెండ్ చేయాలని దేవాదాయ శాఖ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు ఇఒను సస్పెన్షన్ చేస్తూ దేవాదాయ శాఖ ఉన్నతాధికారులు ఉత్తర్వులు ఇచ్చారు. దేవాదాయ శాఖ ఇనస్పెక్టర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఇఒపై కేసు నమోదు చేశారు.

**ఇఒ అరెస్టు రూ.6,23,600 విలువ చేసే వస్తువులు స్వాధీనం : డిఎస్పీ శివనారాయణస్వామి**

కదిరి రూరల్ పరిధిలోని ఎర్రదొడ్డి గంగమ్మ ఆలయ ఇఒ మురళీకృష్ణను అరెస్టు చేసి అతని నుంచి రూ.6,23,600 విలువ చేసే వెండి, విలువైన చీరలు స్వాధీనం చేసుకున్నట్లు డిఎస్పీ శివనారాయణస్వామి తెలిపారు. సోమవారం స్థానిక రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఇందుకు సంబంధించిన వివరాలను డిఎస్పీ వెల్లడించారు. ఎర్రదొడ్డి గంగమ్మ ఆలయంలో ఉన్నతాధికారుల ఆదేశాలు లేకుండా భక్తులు కానుకల రూపంలో ఇచ్చిన వెండి, బంగారు, చీరలను కుటుంబ సభ్యులతో కలిసి ఆలయ ఇఒ ఆటోలో తీసుకెళ్తుండగా గ్రామస్తులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకుని పోలీసులకు అప్పగించారు. ఈ విషయంపై దేవాదాయ శాఖ ఇన్స్‌పెక్టర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి ఆలయ ఇఒను అదుపులోకి తీసుకుని పూర్తిస్థాయిలో విచారించి ఆలయ ఇఒ చోరీకి పాల్పడినట్లు తమ విచారణలో వెల్లడైంద న్నారు. ఇఒపై కేసు నమోదు చేసి ఐదు కెజిల వెండి రెండు గ్రాముల బంగారం, 15 చీరలు స్వాధీనం చేసుకున్నట్లు డిఎస్పీ తెలిపారు. ఆలయ ఇఒ మురళీకృష్ణ గతంలోకూడా తాను విధులు నిర్వహించిన తాడిపత్రిలో ఇలాంటి అక్రమాలకు పాల్పడినట్లు తెలిసిందని, ప్రస్తుతం పాలపాటిదిన్నె ఆంజినేయస్వామి, ఎర్రబదొడ్డి గంగమ్మ ఆలయంలో గతంలో హుండీ చోరీ జరిగిందని, ఇందులో కూడా అతని పాత్ర ఉన్నట్లు అనుమానాలు ఉన్నాయన్నారు. ఆలయ ఇఒ అవినీతి ఆరోపణలపై పూర్తి స్థాయిలో విచారణ చేపట్టి తగు చర్యలు తీసుకుంటామని డిఎస్పీ తెలిపారు. సమావేశంలో రూరల్ సిఐ నిరంజన్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

# గూడ్స్ రవాణా బంద్!

వేసే అధికారం రాష్ట్రాలకు ఉందని.. లారీ ఓనర్ల సంఘం చెప్తోంది. 13 ఏళ్ల దాటిన పాత వాహనాలపై ఫీజులను భారీగా పెంచడం సరికాదని.. దీనివలన గూడ్స్ రవాణా చేసే వాహనాల యజమానులపై పెనుభారం పడుతుందని లారీ ఓనర్ల సంఘం వాదిస్తోంది. నోటిఫికేషన్ నిలిపివేసే అధికారం రాష్ట్రాలకు ఉన్న నేపథ్యంలో సీఎం చంద్రబాబు నాయుడు.. దీనిపై నిర్ణయం తీసుకోవాలని లారీ ఓనర్ల సంఘం కోరింది. లేని పక్షంలో రాష్ట్రంలోని 10వేల గూడ్స్ లారీలు నిలిపివేస్తామని హెచ్చరించింది. తమపై భారం పడకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చూడాలని లారీ ఓనర్ల సంఘం కోరింది.

ఏపీ లారీ ఓనర్స్ అసోసియేషన్ తీసుకున్న ఈ నిర్ణయం రాష్ట్ర రవాణా వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపనుంది. అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వై.వి. ఈశ్వరరావు ప్రకటించిన వివరాల ప్రకారం, ఈ నెల 9వ తేదీ అర్ధరాత్రి నుంచి రాష్ట్రవ్యాప్తంగా రైల్వే గూడ్స్ షెడ్లు, షిప్ యార్డుల నుంచి నడిచే సుమారు 10 వేలకు పైగా గూడ్స్ రవాణా వాహనాలను ఎక్కడికక్కడ నిలిపివేయనున్నారు. లారీలు రోడ్డెక్కకపోతే ఎగుమతులు, దిగుమతులు పూర్తిగా స్తంభించిపోయి వ్యాపార వర్గాలకు, సామాన్య ప్రజలకు ఇబ్బందులు తప్పేలా లేవు. బీఎస్2, బీఎస్3 వంటి పాత వాహనాలు ఉంటే, వాటి స్పేర్ పార్ట్స్ దొరక్క ఆటోమేటిక్‌గా మేమే ఆపేస్తుంటాం. ఇప్పుడు 15 ఏళ్ల క్రితం నాటి వాహనాలు కూడా రోడ్డు ప్రమాదాలకు గురై స్క్రాప్ కిందకు వెళ్లిపోతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో పాత వాహనాలపై అదనపు భారం వేయడం తగదు. ప్రభుత్వం ఈ నిర్ణయాన్ని మార్చుకోవాలి. లేకపోతే 9వ తేదీ అర్ధరాత్రి నుంచి దాదాపు పది వేల వాహనాల కార్యకలాపాలు నిలిపివేస్తామని లారీ యాజమానుల సంఘం నాయకుడు ఈశ్వరరావు స్పష్టం చేసారు.

# విధ్వంసం నుండి అభివృద్ధిలోకి

>> వృద్ధి సాధించామని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. రూ. 4లక్షల 377 కోట్ల విలువైన జిఎస్డీపీ నమోదు అయ్యిందని వెల్లడించారు. ఇదే సమయానికి భారతదేశ జిడిపి 8.7 శాతంగా ఉందని గుర్తుచేశారు. ఈ త్రైమాసికంలో జిఎస్డీపీ గత యేడాదితో పోల్చుకుంటే 1.11 శాతం పెరిగిందన్నారు. రాష్ట్రంలో వ్యవసాయ అనుబంధ రంగాల జివిఎ 10.70 శాతం, పరిశ్రమల రంగం 12.20 శాతం, సేవల రంగం 11.30 శాతం వృద్ధి నమోదైందని తెలిపారు. గత పాలకుల విధ్వంస పాలన వల్ల గ్రోత్ రేట్ తగ్గి రూ.7 లక్షల కోట్ల జిఎస్డీపీ కోల్పోయామని ఆగ్రహం వ్యక్తంచేశారు. గ్రోత్ రేట్ లేకపోవటం వల్ల రూ. 76,195 కోట్ల ఆదాయం కోల్పోయామన్నారు. గత ప్రభుత్వంలో ఎక్కువ వడ్డీలకు అప్పులు తేవటం వల్ల ప్రజాధనానికి నష్టం కలుగుతోందని ఆక్షేపించారు. రుణాల రీషెడ్యూలింగ్ చేసుకోవాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. బ్రాండ్ తగ్గి, వడ్డీ రేటు పెరిగటం వల్ల రెవెన్యూ జీఎస్డీపీలో రాష్ట్రం చాలా నష్టపోయిందని చంద్రబాబు తెలిపారు.

**ప్రజల చేతుల్లోకి పాలన :**

సుపరిపాలన ద్వారా ప్రజల వద్దకు వెళ్లామని, వాట్సప్ గవర్నెన్సు ద్వారా ప్రజల చేతుల్లోకి పాలనను తీసుకెళ్లామని గుర్తుచేశారు. గత ప్రభుత్వం పిపిఎలు రద్దు చేయడం వల్ల ఎలాంటి విద్యుత్ వాడుకోకుండా రూ.9 వేల కోట్లు చెల్లించాల్సి వచ్చిందని ఆరోపించారు. 950 టిఎంసిల నీరు నేటికి రిజర్వాయర్లలో నిల్వఉందన్నారు. ఎస్ఐపిబిల ద్వారా రూ.8 లక్షల కోట్ల పెట్టుబడులకు పైగా ఆమోదం తెలిపామన్నారు. అస్తవ్యస్తం చేసిన విద్యా వ్యవస్థను గాడిలో పెట్టేందుకు సంస్కరణలు తీసుకువచ్చామన్నారు. గత పాలకులు విద్య శాఖలోనూ బిల్స్ పెండింగ్ పెట్టారని మండిపడ్డారు. పల్లెపండుగ ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు వెల్లడించారు. 25 ఏళ్ల క్రితం రూపొందించిన పాలసీల కారణంగా తెలంగాణ రాష్ట్రం ఇప్పుడు ఆదాయం సాధిస్తోంది. విభజన తర్వాత వ్యవస్థీకృతంగా ఎపికి వచ్చిన ఇబ్బందులను సరి చేసే సమయంలో వైఎస్సార్సీ వచ్చి రాష్ట్రాన్ని విధ్వంసం చేసింది. తెలుగు రాష్ట్రాలు ఎప్పుడూ అభివృద్ధి సాధించాలని ఇవాళ కూడా ట్వీట్ చేశాను. ఎక్కువ వడ్డీకి అప్పులు తెచ్చి ప్రజాధనాన్ని దుర్వినియోగం చేశారు. ఇప్పుడు రీషెడ్యూలు చేస్తున్నాం. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్, విద్యుత్ సహా వివిధ మౌలిక సదుపాయాలు కల్పించటం వల్ల పరిశ్రమల రంగంలో వృద్ధి నమోదైంది. రాష్ట్రంలో నీటి భద్రత, అగ్రిటెక్, లాజిస్టిక్స్ వ్యయం తగ్గింపు, ప్రాడెక్టు పర్ఫెక్షన్, డీప్ టెక్ లాంటి 10 సూత్రాలను సమర్ధంగా అమలు చేస్తున్నామని అన్నారు.

**ఎపి బ్రాండ్ పునరుద్ధరణ**

వచ్చే ఏడాది కూడా విద్యుత్ చార్జీలు పెంచకుండా సమర్థత పెంచుకుంటామని ముఖ్యమంత్రి చంద్రబాబు వెల్లడించారు. భూమినే జలాశయంగా మార్చుకుని భూగర్భజలాలు పెంచుతున్నామన్నారు. ఎపి బ్రాండ్ పునరుద్ధరించి తిరిగి పెట్టుబడులు రాబడుతున్నట్లు వివరించారు. గత ప్రభుత్వం విధ్వంసం చేసిన ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టే యత్నం చేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర విభజన తరువాత టిడిపి అయిదేళ్లు అధికారంలో ఉందన్నారు. ఇక్కడ సరాసరి జీఎస్టీ 13.5 శాతం సాధించామని... కేంద్ర జిఎస్డీపీ కన్నా ఎక్కువ సాధించామని తెలిపారు. తాము అధికారంలోకి వచ్చాక 12.02 శాతం వృద్ధి సాధించామని.. ఆల్ ఇండియా లెవల్‌లో 9.8 శాతంగా ఉందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు.

**సుపరిపాలన, సూపర్ సిక్స్ సమన్వయం**

ఈ ఆర్థిక సంవత్సరం రెండో క్వార్టర్ జూలైసెప్టెంబర్ మధ్య జిఎస్డీపీ ఫలితాలు వచ్చాయని, రాష్ట్ర ఆర్థిక పరిస్థితి గాడిన పడుతుందా అని ఎందరో అనుమానం వ్యక్తం చేశారని గుర్తుచేశారు. చేయలేమని పారిపోమని మాత్రం హామీ ఇచ్చి నిరంతరం కష్టపడ్డామని చెప్పారు. సుపరిపాలన, సూపర్6 రెండింటినీ సమన్వయం చేసుకుంటూ ముందుకెళ్తున్నామని వెల్లడించారు. వ్యక్తులు చేసిన తప్పులకు వ్యవస్థల్లో మార్పులకు కేంద్రం శ్రీకారం చుట్టిందన్నారు. నిరుపయోగం చేసిన 93 కేంద్ర ప్రభుత్వ పథకాలను తిరిగి పునరుద్ధరించామని సిఎం చంద్రబాబు తెలిపారు.

**రాజకీయ ముసుగులో నేరాలు**

బురద చల్లితే కడుక్కునే పరిస్థితుల్లో లేమని, ప్రక్షాళన చేసేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టంచేశారు. రాజకీయ ముసుగులో నేరాలు చేసిన వ్యక్తుల పై కఠినంగా వ్యవహరిస్తామన్నారు. పరకామని చోరీని ఎవ్వరూ సమర్థించరని తేల్చిచెప్పారు.

దేవుడి డబ్బుల కాపలా దారులు తప్పులు చేస్తే ఎలా అని ప్రశ్నించారు. దేవుడి మీద నమ్మకం ఉంది కాబట్టే ఒక వ్యాపారి రూ.122 కోట్లు బంగారం వెంకటేశ్వర స్వామికి ఇచ్చారని గుర్తుచేశారు. ఓ దేవాలయంలో ఇఒ చోరీ చేస్తే తక్షణం సస్పెండ్ చేశామని చంద్రబాబు తేల్చిచెప్పారు. కలియుగ దైవం వేంకటేశ్వర స్వామి ఆలయంలోనే చోరీ జరిగితే అది చిన్నదని ఎలా సమర్థిస్తారని ఆగ్రహం వ్యక్తంచేశారు.

నాసిరకం ప్రసాదాన్ని భక్తులకు ఇచ్చిన దానిని కూడా సమర్ధిస్తారా అని నిలదీశారు. ఇలాంటి వాటినా సమర్థిస్తున్న వ్యక్తులు ప్రతిపక్షంలో ఉన్నారని ఆక్షేపించారు. ఇలాంటి వారితో రాజకీయం చేయడానికి సిగ్గు అనిపిస్తోందని ఆవేదన వ్యక్తంచేశారు. హైదరాబాద్ నుంచి మద్యం సేవిస్తూ వచ్చి ప్రమాదంలో మరణిస్తే, ఆ ఘటనను కూడా హత్యకింద చిత్రీకరించే ప్రయత్నం చేశారని దుయ్యబట్టారు. వైఎస్సార్సీ తలాతోకలేని పార్టీ అన్నారు.జగన్ కేవలం అభివృద్దిని చూసి దుగ్ధతో మాట్లాడుతున్నారన్నారు.

# నిరుపయోగ స్థలాలు ఇక వాడకం

>> వృద్ధిశాఖ కార్యాచరణ సిద్ధం చేసింది. ఈ మేరకు పుర, నగరపాలక, పట్టణాభివృద్ధి సంస్థలకు చెందిన వినియోగంలోని ఖాళీ స్థలాలు, భూములను సంబంధిత అధికారులు గుర్తిస్తున్నారు. పట్టణ నగరపాలక సంస్థల స్థలాలు, భూములను వివిధ వ్యాపారాల నిర్వహణకు కేటాయించనున్నారు. ప్రత్యేకించి శివారు ప్రాంత భూముల్లో రెసిడెన్షియల్ లేఔట్ల ఏర్పాటుకు అనుమతులు ఇవ్వనున్నారు. గోదాములు, లాజిస్టిక్ హబ్‌లు, పరిశ్రమలు, సోలార్ ప్లాంట్లు కూడా ఏర్పాటుచేసే అవకాశం ఉంది. నగరాలు, పట్టణాల మధ్యలోని విలువైన స్థలాల్లో పెట్రోలు బంకులు, దుకాణాలు, షాపింగ్ మాళ్లు, హోటళ్ల అభివృద్ధి చేసేందుకు భూములను కేటాయించనున్నారు.ఆ విధంగా పట్టణ స్థానిక సంస్థలకు తగిన ఆదాయం రానుందని అధికారులు చెబుతున్నారు. తిరుపతి, అనంతపురం, కడప, కాకినాడలో గుర్తించిన స్థలాలకు మంచి డిమాండ్ ఉంది. వీటిలో వ్యాపారాల నిర్వహణకు ఎక్కువ మంది ఆసక్తి చూపుతున్నారు. విశాఖ, విజయవాడ, కర్నూలు, నెల్లూరు, గుంటూరు తదితర నగరాల్లో రెండో విడతలో వివిధ ప్రాజెక్టుల ఏర్పాటుకు టెండర్లు సైతం పిలవనున్నారు.

# భారత్ వికాస మంత్రం

>> జననీ జన్మభూమిశ్చ అన్న రాముడి మాటలకు మరోరూపం వందేమాతరం అంటూ భావోద్వేగానికి గురయ్యారు. 1875లో బంకించంద్ర చటోపాధ్యాయ రాసిన ఈ పాట ప్రయాణాన్ని స్వాతంత్ర్య పోరాటంలో దాని పాత్ర, వందేమాతరం దేశాన్ని ఐక్యంగా బంధించే భావోద్వేగ ప్రవాహంగా మారిందని మోడీ వివరించారు. వందేమాతరంకు 50 ఏళ్లు నిండిన సమయంలో దేశంలో అప్పుడు బ్రిటీషు పాలనలో ఉందని, ఇక వందేళ్లు నిండిన సమయంలో అప్పుడు దేశంలో ఎమర్జెన్సీ ఉందని ప్రధాని పేర్కొన్నారు. ఇవాళ మనం ఇక్కడ కూర్చున్నామంటే, లక్షలాది మంది వందేమాతం ఆలపించడం వల్లే అని, వాళ్లంతా స్వాతంత్ర్యం కోసం పోరాడారని తెలిపారు. బ్రిటీష్ పాలకులు గాడ్ సేవ్ ద క్వీన్ అన్నగీతాన్ని ప్రతిఇంటికి తీసుకెళ్తున్న సమయంలో వందేమాతరం గీతాన్ని రాసినట్లు ప్రధాని మోడీ తెలిపారు. వందేమాతరం కేవలం రాజకీయ స్వేచ్ఛా మంత్రం కాదు అని, బ్రిటీష్ పాలకుల ఆధీనం నుంచి భరతమాత స్వేచ్ఛ కోసం జరిగిన పవిత్ర యుద్ధం అన్నారు. వందేమాతరం రచించిన సమయంలో భారతదేశంలోని ప్రతీ ఇంట్లో బ్రిటిష్ జాతీయ గీతమైన "గాడ్ సేవ్ ద క్వీన్"ను ఆలపించేలా చేయాలని యత్నించారని మోడీ గుర్తుచేశారు. వందేమాతరానికి 50 ఏళ్లప్పుడు దేశం బ్రిటిష్ పాలనలో ఉందని, అది వందేళ్లు పూర్తిచేసుకున్నప్పుడు దేశం ఎమర్జెన్సీలో ఉందని వివరించారు. ఆ విధంగా బెంగాల్ మేధో సంపత్తి దేశానికి ప్రేరణనిచ్చిందన్న మోడీ, బ్రిటిష్ దాన్ని విచ్ఛిన్నం చేయాలనే కుట్రతో విభజించు పాలించు విధానాన్ని తీసుకువచ్చారని తెలిపారు. 1905లో వారు బెంగాల్‌నైతే విభజించారు, కానీ వందేమాతరం ఒక ధృడమైన రాయిలా నిలిచి దేశ ఐక్యతకు స్ఫూర్తినిచ్చిందని పేర్కొన్నారు. ఈ క్రమంలోనే వందేమాతరం గేయంపై కవితలు చదివి వినిపించారు.

**కాంగ్రెస్‌పైనా, నెహ్రూపైనా ఆరోపణలు**

వందేమాతర జాతీయ గీతంపైనా కాంగ్రెస్, జవహర్ లాల్ నెహ్రూ దాడి చేశారని మోడీ ఆరోపించారు. వందేమాతరం ముస్లింలను రెచ్చగొట్టేలా ఉందని జవహర్ లాల్ నెహ్రూ భావించారని ప్రధాని అన్నారు. జాతీయ గేయం వందేమాతరాన్ని కాంగ్రెస్ ముక్కలుముక్కలు చేసిందని, ఎందుకంటే ముస్లింలను రెచ్చగొడుతుందన్న ఉద్దేశంతో ఆ గేయాన్ని ముక్కలు చేశారని మోడీ అన్నారు.

ప్రధాని వ్యాఖ్యలపై కాంగ్రెస్ సభ్యులు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఆందోళనల మధ్యే ప్రధాని మోడీ తన ప్రసంగాన్ని కొనసాగించారు. జాతీయ గేయాన్ని ముక్కలు చేసిందెవరన్న విషయాన్ని రాబోయే తరాలకు తెలియజేయాలని, మొహమ్మద్ అలీ జిన్నా నేతృత్వంలోని ముస్లిం లీగ్ 1937లో వందేమాతరం గేయానికి వ్యతిరేకంగా ఆందోళన చేపట్టిందని, కానీ కాంగ్రెస్ పార్టీ, నెహ్రూ ఆ ఉద్యమాన్ని వ్యతిరేకించలేదని, బదులుగా వందేమాతరం గీతాన్ని ముక్కలు చేశారని ఆరోపించారు. గేయంలో ఉన్న హిందూ దేవతల ప్రస్తావన ముస్లింలకు నచ్చడం లేదని, అందుకే పూర్తిగేయాన్ని వాడవద్దు అని అప్పట్లో నెహ్రూ పేర్కొన్నట్లు తెలుస్తోంది. వందేమాతరం గీతంతో విభజన చేపట్టిన కాంగ్రెస్ పార్టీ.. ఎప్పుడో దేశవిభజనకు బీజం వేసిందని మోడీ తన ప్రసంగంలో అన్నారు. వందేమాతరం రాసిన వేళ భారతదేశం బానిసత్వంలో ఉందని, 100 ఏళ్లు పూర్తయిన వేళ భారత్ రాజ్యాంగం గొంతు నొక్కేశారని, 1975లో ఇందిరాగాంధీ ఎమర్జెన్సీ విధించారని మోడీ గుర్తుచేశారు. వందేమాతర గీతం గొప్పతనాన్ని పునరుద్ధించుకునే గొప్ప అవకాశం ఇప్పుడు వచ్చిందని చెప్పారు. ఈ అవకాశాన్ని వదులుకోరాదని సూచించారు. దేశాన్ని ఏకతాటిపై నడిపించిన వందేమాతర గీతానికి పునర్వైభవం రావాలని, ఇవాల్టి చర్చలు భవిష్యత్ తరానికి స్ఫూర్తి కావాలని, 2047 వికసిత్ భారత్ నెరవేరాలంటే వందేమాతరం స్ఫూర్తి అవసరమని ప్రధాని ఉద్బోధించారు.

**బంకిమ్ దా కాదు.. బంకిమ్ బాబు..**

ప్రధాని ప్రసంగంలో బంకిమ్ గురించి ప్రస్తావిస్తూ.. బంకిమ్ దా అని మోడీ అనగా, బెంగాలీ ప్రఖ్యాత కవి, కంపోజర్‌ను బంకిమ్ దా అని పిలవడాన్ని.. తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ సౌగత రాయ్ తప్పుపట్టారు. బంకిమ్‌ను దాతో సంబోధించడాన్ని ఆయన వ్యతిరేకించారు. దా అంటే బెంగాలీలు దాదా అని అంటే సోదరులను, స్నేహితులను సంబోధించేందుకు ఆ పదాన్ని వాడుతుంటారు. ప్రధాని మోడీ తనప్రసంగంలో బంకిమ్ దా అనడడం అగౌరవపరచడమే అవుతుందని, బంకిమ్ దా అనడంకాదు, బంకిమ్ బాబు అని పిలవాలని తృణమూల్ ఎంపి సూచించారు. ఎంపి సౌగత్‌రాయ్ చేసిన సూచనకు ప్రధాని మోడీ తక్షణమేస్పందించారు. సరే బంకిమ్ బాబు అనిపిలుస్తానని, థ్యాంకూ.. మీ మనో భావాలను గౌరవిస్తానని ప్రధాని మోడీఅన్నారు. ఆ తర్వాత తన ప్రసంగంలో టిఎంసి ఎంపిపై వ్యంగ్యాస్త్రం వేశారు. మిమ్మల్ని దాదా అని పిలవవచ్చా అన్నారు. దీనికేమైనా అభ్యంతరాలు ఉన్నాయా అని ప్రధాని అన్నారు.

## వారం - వర్జ్యం

09-12-2025, మంగళవారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
మార్గశిరమాసం, దక్షిణాయణం
హేమంత ఋతువు, కృష్ణపక్షం
పంచమి మ.2.35,
ఆశ్లేష రా.2.26, జ్యేష్ఠ కార్తె
వర్జ్యం : మ.2.37-4.14
దు.ఉ.8.40-9.25, 2) రా.10.04-10.49
శుభసమయం : ఉ.10.15-11.00
రాహుకాలం - మ.3.00-4.30

## వార్తాఫలం

**మేషం:** దీర్ఘకాలిక సమస్యలు తీరి ఊరట చెందుతారు. అనుకున్న పనులలో విజయం సాధిస్తారు. భూ వివాదాలు పరిష్కార దశకు చేరుకుంటాయి.

**వృషభం:** దూరప్రాంతాల నుండి ఆహ్వానాలు అందుకుంటారు. సాంకేతిక విద్యలపై ఆసక్తి చూపుతారు. ఉద్యోగులకు పదోన్నతులు.

**మిథునం:** శత్రువులు సైతం మిత్రులుగా మారతారు. తనఖాలు విడిపిస్తారు. వివాహాది కార్యక్రమాలలో పాల్గొంటారు.

**కర్కాటకం :** కొత్త ఋణాలు చేస్తారు. పాత ఋణాలు తీరుస్తారు. ఇంటా బయట అనుకూలంగా ఉంటుంది. ధన లాభం.

**సింహం:** స్వజనుల వలన కొన్ని ఇబ్బందులను ఎదుర్కొనవలసి వస్తుంది. పనులు నిదానంగా పూర్తి చేస్తారు. నూతన విద్యావకాశాలు లభిస్తాయి.

**కన్య:** ఎవ్వరినీ ఎదిరించకుండా సర్దుకు పోవటానికే ప్రయత్నించండి. ఆరోగ్య సమస్యలు ఎదురై అధిగమిస్తారు. స్థిరాస్తి విలువ పెరుగుతుంది.

**తుల :** వృత్తి ఉద్యోగ వ్యాపార విద్యారంగంలో ఫలితాలు సానుకూలంగానే ఉంటాయి. వస్తువులు కొనుగోలు చేస్తారు.

**వృశ్చికం:** మన పని మనం చేసుకుపోతే విఘాతికలైనా అనుకూల ఫలితాలు వస్తాయని భావిస్తారు. విదేశీయాన అవకాశాలు కలిసివస్తాయి.

**ధనుస్సు:** ఇష్టం లేకపోయినా తాత్కాలి ప్రయోజనాల కొరకు కొందరితో కలసి పనిచేయక తప్పనిసరి పరిస్థితులు ఏర్పడుతాయి.

**మకరం:** పనులలో ఆటంకాలు ఎదురై చికాకు కలిగించవచ్చును. కుటుంబ సమస్యలు ఎదురౌతాయి. ప్రముఖులతో పరిచయాలు ఏర్పడుతాయి.

**కుంభం:** పట్టుదలతో ముఖ్యమైన వ్యవహారాలు పూర్తి చేస్తారు. ఆలోచనలు మాత్రం స్థిరంగా వుండవు. వివాదాలకు దూరంగా వుండండి.

**మీనం :** కొత్త వస్త్రాలు, గృహం, స్థలం కొనుగోలు యత్నాలు వాయిదా వేస్తారు. ఋణ వత్తిడులు ఉంటాయి. ధనలాభం.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# 'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ 2025'కు సిఎం చంద్రబాబు శుభాకాంక్షలు

**విజయవాడ, డిసెంబరు 8, ప్రభాతవార్తప్రతినిధి:** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న "తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ 2025కు సిఎం చంద్రబాబు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సదస్సు విజయవంతం కావాలని ఆయన మనస్ఫూర్తిగా ఆకాంక్షించారు. ఈ మేరకు ఎక్స్ (ట్విట్టర్) వేదికగా ప్రత్యేక పోస్టు పెట్టారు. "తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ 2025కు నా హృదయపూర్వక శుభాకాంక్షలు. ఈ వేదిక తెలంగాణ రాష్ట్రంలో వృద్ధి, ఆవిష్కరణలు, పురోగతికి సరికొత్త మార్గాలను తెరుస్తుందని ఆశిస్తున్నాను" అని ట్వీట్ చేశారు. పొరుగు రాష్ట్రంలో జరుగుతున్న కీలకమైన సదస్సుకు ఏపీ ముఖ్యమంత్రి అభినందనలు తెలపడం రాజకీయ వర్గాల్లో సానుకూల వాతావరణాన్ని సూచిస్తోంది. ఇరు రాష్ట్రాల మధ్య సత్సంబంధాలకు ఇటువంటి సంకేతాలు దోహదం చేస్తాయని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

## ఇసుక కుంభకోణం కేసుకు సంబంధించి సుప్రీంకోర్టులో కీలక పరిణామం

**విజయవాడ,డిసెంబరు 8,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీలో గత ప్రభుత్వం హయాంలో జరిగిన ఇసుక కుంభకోణం కేసుకు సంబంధించి సుప్రీంకోర్టులో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఎన్జీటీ విధించిన రూ.18 కోట్ల జరిమానాపై జేపీ వెంచర్స్ సోమవారం సుప్రీంలో ఐఏ దాఖలు చేసింది. ఎన్జీటీ విధించిన జరిమానాను తాము చెల్లించాల్సిన అవసరం లేదంటూ సుప్రీంలో జేపీ వెంచర్స్ వాదనలు వినిపించింది. ఇసుక తవ్వకాలకు పర్యావరణ అనుమతులు తీసుకున్నది ప్రభుత్వమే కాబట్టి తాము జరిమానా ఎందుకు చెల్లించాలని వాదించింది. చిత్తూరు జిల్లాలోని ఆరణీయార్ నదీ పరీవాహక ప్రాంతాల్లో బి2 కేటగిరీలో 18 రీచ్‌లలో అక్రమంగా ఇసుక తవ్వకాలు జరిపినందుకు జేపీ వెంచర్స్‌కు ఎన్జీటీ రూ.18కోట్లు జరిమానా విధించింది. ఈ క్రమంలో ఎన్జీటీ తీర్పుపై సుప్రీంను జేపీ వెంచర్స్ ఆశ్రయించింది. ఎన్జీటీ విధించిన జరిమానాను సుప్రీంకోర్టులో డిపాజిట్ చేయాలని జేపీ వెంచర్స్‌కు ఉన్నత న్యాయస్థానం ఆదేశించింది. అయితే సుప్రీం ఆదేశాలలో సవరణ కోరుతూ తాజాగా జేపీ వెంచర్స్ ఐఏను దాఖలు చేసింది.

# జాతీయ సంస్కృత వర్సిటీ వివాదంపై హోంమంత్రి ఆగ్రహం

## ఒడిశాకు ప్రత్యేక పోలీసు బృందం

**తిరుపతి,డిసెంబర్ 8ప్రభాతవార్తప్రతినిధి:** తిరుపతిలోని జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయంలో మొదటి సంవత్సరం విద్యార్థినిపై అసోసియేట్ ప్రొఫెసర్ లైంగిక వేధింపులపై హోంమంత్రి వంగలపూడి అనిత తీవ్రంగా పరిగణించారు. ఈ ఘటనకుదారితీసిన పరిస్థితులు, విద్యార్థిని ఫిర్యాదు, తదుపరి పోలీసు కేసు నమోదు విషయాలను తిరుపతి జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడుని అడిగి తెలుసుకున్నారు. సోమవారం ఉదయం ఆమె ఎస్పీతో ఫోన్‌లో మాట్లాడారు. లైంగిక వేధింపుల ఘటనపై ఆమె తీవ్రంగా స్పందించారు. దీంతో ఓ ప్రత్యేక పోలీసుబృందాన్ని ఒడిశాకుపంపి బాధితవిద్యార్థినితో మాట్లాడి మరిన్ని వివరాలు తెలుసుకోవాలని ఆదేశించారు. ఈ బృందం వచ్చిన తరువాత జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయంలో వేధింపులకు గురిచేసిన అసోసియేట్ ప్రొఫెసర్‌పై చర్యలకు ఉపక్రమించాలని ఆదేశించారు. ప్రాథమిక దర్యాప్తులో బాగంగా సాక్ష్యాధారాలు, కీలక సమాచారం సేకరించాలని ఎస్పీని ఆదేశించారు.



# అలిపిరి నుండి ఆనందనిలయం వరకు
# సంతృప్తికర సేవల దిశగా అడుగులు

- త్వరితగతిన శ్రీవారి దర్శనాలపై వేగంగా అడుగులు!
- రద్దీకి అనుగుణంగా క్యూలైన్ల క్రమబద్ధీకరణపై అధ్యయనం
- ఆలయం వెలుపల క్యూలైన్లనూ నియంత్రించేలా ప్రణాళికలు

**తిరుమల,డిసెంబర్ 8(ప్రభాతవార్తప్రతినిధి:** కలియుగ ప్రత్యక్షదైవం శ్రీవేంకటేశ్వరస్వామి దర్శనార్థం దేశవిదేశాల నుండి తిరుమలకు వస్తున్న భక్తులకు మరింత సంతృప్తికరంగా స్వామివారి దర్శనం చేయించే విధానం, అలిపిరినుండిఆనందనిలయంలోనికి చేరుకునే వరకు పూర్తిస్థాయిలో భక్తుల సౌకర్యాలపై టిటిడి దృష్టి సారించింది. సామాన్యభక్తులు నేరుగా తిరుమలకు చేరుకున్నా వారికి సాధ్యమైనంతవరకు ఎన్నిగంటల్లోపే దర్శనం చేయించవచ్చనే కోణంలో ప్రయోగాత్మక పరిశీలనలు మొదలయ్యాయి. వారాంతం రోజుల్లో, ప్రత్యేక పర్వదినాల్లో, విశేషమైన రోజుల్లో 1.30లక్షలమందివరకు భక్తులు చేరుకుంటే శిలాతోరణం, పాపవినాశనంమార్గం, కృష్ణతేజ విశ్రాంతి గృహం, సేవాసదన్ ప్రాంతాల్లో వెలుపల క్యూలైన్లలో ప్రవేశించే భక్తులను వీలైనంత వరకు దగ్గరగా అనుమతించేలా కూడా ఈ కసరత్తు చేస్తున్నారు. తిరుమలకు ప్రతిరోజూ లక్షమందివరకు సామాన్యభక్తులు వస్తున్నారు. రోజుకు 15వేలనుండి 20వేలమంది వరకు సర్వదర్శనం టైమ్‌స్లాట్ భక్తులు, మరో 25వేలమంది వరకు ప్రత్యేక ప్రవేశదర్శనాలు భక్తులు, వీరేగాక మరో మూడువేలమంది వరకు విఐపి బ్రేక్ దర్శనాలు, 30వేలమందినుండి 40వేలమందిపైగా సామాన్యభక్తులు కొండకు చేరుకుంటున్నారు. గంటల తరబడి క్యూలైన్లలో, కంపార్టుమెంట్లలో నిరీక్షణ తప్పడంలేదు. పైగా సాధారణరోజుల్లో శ్రీవారి దర్శనానికి 10నుండి 12గంటలు సాధారణ సర్వదర్శనం నిరీక్షించాల్సి వస్తుండగా టైమ్ స్లాట్ భక్తులు ఆరేడుగంటలు సమయం పడుతోంది. వీటన్నిటి వల్ల భక్తులు దర్శన కష్టాలు తప్పడంలేదు. సామాన్యభక్తుల దర్శన సమస్యలను పరిష్కరించేందుకు కృత్రిమ మేధస్సు(ఏఐ)ను వినియోగించుకోవాలని టిటిడి కసరత్తు వేగవంతం చేసింది. ఇందుకోసం దేశంలోనే తొలిగా వైకుంఠం క్యూకాంప్లెక్స్- 1లో 25వ కంపార్టుమెంట్‌లో ఏఐ ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్(ఐసిసిసి) కేంద్రీకృతం చేసి నిరంతరం విజిలెన్స్ విభాగం పర్యవేక్షిస్తోంది. అక్కడ నుండే తిరుమలకు భక్తులు వస్తున్న వాహనాలతో బాటు సంఖ్యను వారి కదలికలను నిశితంగా పరిశీలిస్తోంది. వెలుపల క్యూలైన్లతోబాటు వైకుంఠం క్యూ కాంప్లెక్స్ కంపార్టుమెంట్లలో భక్తుల రద్దీ నియంత్రణ, భద్రతపై కూడా దృష్టి పెడుతున్నారు. ఐసిసిలో పెద్ద డిజిటల్ స్క్రీన్‌లు, అలిపిరి నుండి ఆనందనిలయం వరకు అన్ని విభాగాలకు చెందిన సిసికెమెరాల పనితీరు పర్యవేక్షణ చేస్తున్నారు. సాంకేతిక సిబ్బంది కంపార్టుమెంట్ల స్థితి, క్యూలైన్ల కదలికలను అధికారులకు వాస్తవ పరిస్థితులను తెలియజేస్తున్నారు. కొత్తగా అమర్చిన సిసికెమెరాలతో అలిపిరి వద్ద నుండే భక్తుల రద్దీని ఏఐ అంచనా వేస్తుంది. క్యూలైన్లలో ఎంతమంది భక్తులు ఉన్నారు,ఎంత సమయం వారు నిరీక్షిస్తున్నారు, సర్వదర్శనం పరిస్థితి తదితర అంశాలను ట్రాక్‌చేస్తున్నారు. ముఖ గుర్తింపు పరికరంద్వారా భక్తులను గుర్తించడం కూడా సులభమైంది. తప్పిపోయిన భక్తులను క్షణాల్లోకనిపెట్టే వ్యవస్థ అందుబాటులో ఉంది. క్యూలైన్లు, వసతి ఇతర సౌకర్యాలను వాస్తవ పరిస్థితులతో చిత్రాలతో చూపుతోంది. కొండపై రద్దీ ఉన్న ప్రాంతాల్ని రెడ్‌స్పాట్‌లుగా చూపడంతోబాటు చర్యలకు సంకేతాలిస్తుంది. ఆన్‌లైన్‌లో నిరంతరం పర్యవేక్షిస్తూ ఎప్పటి కప్పుడు భక్తుల అనుభవాలను తెలుసుకుని శ్రీవారి దర్శనాన్ని మరింత సౌకర్యవంతం చేసేందుకు చూస్తున్నారు. ఇంటిగ్రేటెడ్‌కమాండ్ కంట్రోల్ సెంటర్ పనితీరును, ప్రస్తుత పరిస్థితులను మీడియా ప్రతినిధులకు వివరించారు.

## తిరుపతి సంస్కృత వర్సిటీ ఘటన
## బాధ్యులను వదలం: హోంమంత్రి అనిత

**విజయవాడ,నవంబరు 8,ప్రభాతవార్తప్రతినిధి:** తిరుపతిలోని రాష్ట్రీయ సంస్కృత విశ్వవిద్యాలయంలో విద్యార్థినిపై జరిగిన లైంగిక దాడి ఘటనపై రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత తీవ్రంగా స్పందించారు. ఈ కేసు దర్యాప్తు పురోగతిపై తిరుపతి ఎస్పీ, ఇతర పోలీసు ఉన్నతాధికారులతో ఆమె ఫోన్‌లో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఈ ఘటనలో నిందితులు ఎంతటివారైనా ఉపేక్షి ంచేది లేదని, కఠిన చర్యలు తీసుకుంటామని ఆమె స్పష్టం చేశారు. ఫిర్యాదు అందిన వెంటనే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారని హోంమంత్రి తెలిపారు. తిరుపతి ఎస్పీ స్వయంగా ఈ కేసును పర్యవేక్షి స్తున్నారని చెప్పారు. బాధితురాలికి న్యాయం చేయడమే ప్రభుత్వ ప్రథమ కర్తవ్యమని మంత్రి అనిత పునరుద్ఘాటించారు. మహిళల భద్రతకు తమ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని, ఇలాంటి దారుణాలను ఎట్టి పరిస్థితుల్లోనూ

# విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రతిష్టను దిగజార్చేందుకు భారీ కుట్ర

## పాలకవర్గ విధానాల ఫలితమే ఇండిగో సంక్షోభం: సిపిఎం పొలిట్ బ్యూరో సభ్యుడు బివి రాఘవులు

**విశాఖపట్నం, డిసెంబర్ 8, ప్రభాతవార్త :** రూ. లక్షల కోట్లు పెట్టు బడులు, లక్షల ఉద్యోగాలంటూ చంద్రబాబు ప్రభుత్వం కబుర్లు చెప్పి అందుకు తగ్గట్లు కార్యాచరణ లేకుండా వ్యవహరిస్తుందని సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యులు బివిరాఘవులు ఎద్దేవా చేశారు. సోమవారం జగదాంబ జంక్షన్ సిఐటియు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, గతంలో వేల ఏకరాల భూములను రైతుల నుంచి తీసుకున్నా, ఏ పరిశ్రమా రాలేదని, భూముల కోసం తప్ప పెట్టుబడి ఆసక్తి కనిపించడం లేదన్నారు. ఐటి మంత్రి లోకేష్ కూడా గడచిన 17 నెలల్లో రూ.20లక్షల కోట్లు పెట్టుబడులను తెచ్చామన్నారని, ఈ డబ్బంతా ఎక్కడికి వెళ్లిపోయిందో చెప్పాలని కోరారు. 20ఏళ్ల క్రితం రైతులు నెల్లూరు జిల్లా కృ?పట్నంలో అదానీ కోసం 2800 ఎకరాలు, కాకినాడలో సెజ్ ల పేరుతో 10వేల ఎకరాలు, అనంతపురంలో 8వేల ఎకరాలు లేపాక్షి కోసం, ప్రకాశం జిల్లా పనుకొండలో 80వేల ఎకరాలు ఇచ్చారన్నారు. ఈ భూములన్నీ పెట్టుబడిదారుల స్పెక్యులేషన్ వ్యాపారానికి వాడుకున్నారు తప్ప, పరిశ్రమలు రాలేదని, భూములిచ్చిన రైతులకు ఏం పరిహారం ఇచ్చారంటూ ప్రశ్నించారు. డేటా సెంటర్లలో వచ్చే ఉద్యోగాలు 300 కంటే మించవని, గూగుల్ కి చౌకగా నీరు, విద్యుత్ ఇవాల్సి న అవసరం లేదన్నారు.

ఆదాని, టాటా కోసం కాకుండా, నిజంగా ఉపాధి కల్పించాలనుకుంటే ఉపాధి స ష్టించగల ఫుట్వేర్, గార్మెంట్, టెక్స్టైల్ ఇండస్ట్రీ, ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలు పెట్టాలని రాఘవులు డిమాండ్ చేశారు. విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రతిష్టను దిగజార్చి, కార్మికుల జీతాల్లో కోత పెట్టడానికి యాజమాన్యం ఉత్పత్తితో లింకు పెట్టి ఉద్యోగాలను కార్మికులు అంతిమంగా వదులుకునేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు యాజమాన్యం కుట్ర చేస్తున్నాయని మండిపడ్డారు. దేశంలోని కీలక రంగాల్లో ప్రభుత్వ ఆధిపత్యం ఉండి తీరాలని ప్రైవేట్ వాళ్ల పెత్తనానికి వదిలేస్తే తాజాగా నెలకొన్న విమానయాన రంగం ఎలా కకావికలం అయ్యిందో దేశం అంతా చూస్తుందని తెలిపారు. ఇది కచ్చితంగా పాలకవర్గ విధానాల వల్ల వచ్చిన సంక్షోభమన్నారు. కేంద్రం స్పందించకపోవడం వెనుక ప్రైవేట్ విమాన యాన సంస్థతో కుమ్మక్కయిందా?

అని ప్రశ్నించారు. సమావేశంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కె లోకనాథం, జిల్లా కార్యదర్శి ఎం జగ్గు నాయుడు పాల్గొన్నారు.

# వ్యక్తిత్వ హక్కులపై ఢిల్లీ కోర్టుకు జూ.ఎన్టీఆర్

**విజయవాడ,డిసెంబరు 8,ప్రభాతవార్తప్రతినిధి:** టాలీవుడ్ స్టార్ హీరో నందమూరి తారకరామారావు(జూనియర్ ఎన్టీఆర్)తాజాగా ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించారు. ఆయన వ్యక్తిగత హక్కులకు భంగం కలిగించేలా సోషల్‌మీడియాలో పోస్టులు చేస్తున్నారని, అలాంటి పోస్టులు క్రియేట్ చేసే వారిపై చర్యలు తీసుకోవాలని పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై సోమవారం విచారణ జరిపిన జస్టిస్ మన్మీత్ ప్రీతమ్ సింగ్ అరోరా, సదరు ఖాతాలపై విచారణ జరిపి నిందితులపై మూడు రోజుల్లోగా చర్యలు తీసుకోవాలని సోషల్ మీడియా సంస్థలను ఆదేశించారు., ఎన్టీఆర్ వ్యక్తిగత ప్రతిష్ఠ, హక్కులకు భంగం కలిగించేలా, ఆయన వ్యక్తిత్వాన్ని కించపరిచేలా సోషల్‌మీడియా, ఈ కామర్స్ ప్లాట్ ఫామ్స్ లో అనేక పోస్టులు వైరల్ అవుతున్నాయని అలాంటి వాటిపై చర్యలు తీసుకోవాలని ఎన్టీఆర్ తరపు న్యాయవాది జె.సాయిదీపక్ ఈ సందర్భంగా న్యాయస్థానాన్ని కోరారు. పిటిషన్‌ను విచారణకు స్వీకరించిన న్యాయస్థానం, 2021 ఐటీ చట్టం ప్రకారం సదరు ఖాతాలపై విచారణ జరిపి నిందితులపై 3 రోజుల్లోగా చర్యలు తీసుకోవాలని ఆయా సోషల్ మీడియా సంస్థలను కోర్టు ఆదేశించింది.వ్యక్తిగత హక్కులకు భంగం కలిగేలా ఉన్న అభ్యంతరకర పోస్టుల వ్యవహారంలో,

అలాంటి పోస్టులను తొలగించాలని ముందుగా సోషల్‌మీడియా సంస్థలను సంప్రదించాలని జస్టిస్ మన్మీత్ ప్రీతమ్ ఈ సందర్భంగా సూచించారు. ఆ తర్వాతనే కోర్టును ఆశ్రయించాలని అన్నారు. అయితే గతంలో బాలీవుడ్ నటుడు అజయ్ దేవ్‌గణ్‌కు కూడా ఇలాంటి పరిస్థితే ఎదురవ్వగా అప్పట్లో న్యాయస్థానం ఇచ్చిన ఉత్తర్వులను న్యాయవాది ఈ సందర్భంగా కోర్టు దృష్టికి తీసుకొచ్చారు ఈ కేసులో తదుపరి విచారణను డిసెంబరు 22కు వాయిదా వేసింది.



కూచిపూడి ఆస్పత్రిని సందర్శించి బిజెపి జాతీయ కౌన్సిల్ మెంబర్ సాధినేని యామినీ శర్మ

# కూచిపూడి ఆస్పత్రిలో ఫీజులుండవు

## - ఆసుపత్రి అద్భుతం: ప్రశంసించిన బిజెపి జాతీయ కౌన్సిల్ మెంబర్ సాదినేని యామినీ శర్మ

**విజయవాడ,డిసెంబరు 8,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీలోని అంతర్జాతీయ ప్రఖ్యాత నాట్య క్షేత్రం కూచిపూడిలో ఎటువంటి రుసుము లేకుండా ప్రవాసాంధ్రుల సౌజన్యంతో వైద్య సేవలు అందిస్తున్న ఆధునీక ఆసుపత్రి నిర్వహణలో ఉంది.సిలికానాంధ్రకు చెందిన తెలుగువారు ఏర్పాటు చేసిన ఈ ఆస్పత్రి క్షేత్ర ప్రాశ్యస్థానికి తగినట్లుగానే దివి సీమకు వరంగా మారింది.ఇటీవల ఏపీకి చెందిన బీజేపీ జాతీయ కౌన్సిల్ మెంబర్ సాధినేని యామినీ శర్మ ఈ ఆస్పత్రిని సందర్శించారు.ఇటువంటి ఆస్పత్రి మారుమూల ప్రాంతంలో అభినందనీయమని ప్రశంసించారు. తాను సందర్శించిన ఈ ఆసుపత్రిని చూసి నిశ్చేష్టురాలినయ్యానని ఆమె తన ట్విట్టర్ ఖాతాలో పేర్కొన్నారు. ఇది కేవలం ఆసుపత్రి మాత్రమే కాదని, మానవత్వానికి నిలువుటద్దమని ఆమె కొనియాడారు. ఈ ఆసుపత్రి పూర్తిగా విరాళాలతో నడుస్తోందని యామినీ శర్మ తెలిపారు. ఇక్కడ రోగ నిర్ధారణ పరీక్షల నుంచి పెద్ద పెద్ద శస్త్రచికిత్స ల వరకు అన్నీ రూపాయి ఖర్చు లేకుండా అందిస్తున్నారని ఆమె ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ఎలాంటి బిల్లులు, షరతులు, వివక్ష లేకుండా ప్రపంచ స్థాయి వైద్య సేవలు అందించడం గొప్ప విషయమని ఆమె అన్నారు. అధునాతన వైద్య పరికరాలు, పరిశుభ్రమైన వాతావరణం ఇక్కడి నిబద్ధతకు నిదర్శనమని ఆమె పేర్కొన్నారు. సిలికానాంధ్ర వ్యవస్థాపకులు ఆనంద్ కూచిభొట్ల దార్శనికత, సీనియర్ జర్నలిస్ట్ రవిప్రకాశ్ వంటి ఎందరో దాతల సహకారంతో ఈ అద్భుతమైన వైద్యాలయం రూపుదిద్దుకుందని యామినీ శర్మ వివరించారు. ఇది కేవలం ఆసుపత్రి మాత్రమే కాదని, మానవత్వం, సేవ, నిజమైన దేశ నిర్మాణం అంటే ఇదేనని తాను భావిస్తున్నానని చెబుతూ.. ఈ సంస్థను చూసి గర్వంగా, భావోద్వేగంగా ఉందని ఆమె తన పోస్టులో పేర్కొన్నారు.

# వల్లభనేని వంశీ ప్రధాన అనుచరుడు కొమ్మా కోట్లు అరెస్ట్

## - పోలీసులకు తానే లొంగిపోయానని ప్రకటించిన కొమ్మా

**విజయవాడ,డిసెంబరు 8,ప్రభాత వార్తప్రతినిధి:** గన్నవరం మాజీ ఎమ్మెల్యే, వైసీపీ కీలక నేత వల్లభనేని వంశీమోహన్‌కు గట్టిదెబ్బ తగిలింది. వంశీ ప్రధాన అనుచరుడు కొమ్మా కోటేశ్వరరావు అలియాస్ కోట్లును విజయవాడ పటమట పోలీసులు సోమవారం అదుపులోకి తీసుకున్నారు. సత్యవర్ధన్ కిడ్నాప్ కేసులో ఏ2గా ఉన్నారు కొమ్మా కోట్లు.గత కొంత కాలంగా ఆయన అజ్ఞాతంలో ఉంటున్నట్లు తెలుస్తోంది. ఎట్టకేలకు కొమ్మా కోట్లును పటమట పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అయితే, కొమ్మా కోట్లును ఇవాళ అరెస్ట్ చేసినట్లు చూపనున్నారు పోలీసులు. విజయవాడ ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్య పరీక్షలు చేయించిన అనంతరం కోర్టుకు పోలీసులు తీసుకువచ్చారు. న్యాయాధికారి ముందు కొమ్మా కోట్లును హాజరు పరిచారు పోలీసులు. ఈ సందర్భంగా కొమ్మా కోట్లు మీడియాతో మాట్లాడారు.సత్యవర్ధన్ కిడ్నాప్ కేసులో తన ప్రమేయం ఏమీ లేదని కొమ్మా కోట్లు స్పష్టం చేశారు. తాను ఏ తప్పూ చేయలేదని, తన మీద పోలీసులు కేసు నమోదు చేశారన్నారు.అందువల్లే ఈరోజు పటమట పోలీస్టేషన్‌కు వచ్చి తాను లొంగిపోయానని తెలిపారు. కోర్టులో తనకు న్యాయం జరగుతుందనే నమ్మకం ఉందని కొమ్మా కోట్లు పేర్కొన్నారు.



కోర్టులో హాజరు పరుస్తున్న సందర్భంలో మీడియాతో మాట్లాడుతున్న కొమ్మా కోట్లు

# గ్రామీణ ప్రాంతాలకు సైతం డిజిటల్ సేవలు

## - స్పెషల్ పర్పస్ వెహికల్ ఏర్పాటు

**విజయవాడ,డిసెంబరు 8,ప్రభాతవార్తప్రతినిధి:** గ్రామీణ ప్రారతాలకు సైతం డిజిటల్ సేవలను విస్తరించేరదుకుగాను అమలు చేస్తున్న డిజిటల్ నెట్ కోసం రాష్ట్ర ప్రభుత్వం ఒక ఎస్‌పివి (స్పెషల్ పర్పస్ వెహికల్)ను ఏర్పాటుచేస్తూ నిర్ణయం తీసుకుంది,ఇరదులో కేంద్ర ప్రభుత్వానికి సంబంధిరచి ఐదుగురు, రాష్ట్రం నురచి ఐదుగురు డైరెక్టర్లుగా ఉరటారు. ఈ ఎస్పీవీకి ఎపి భారత్‌నెట్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్‌గా (ఎపిబిఐఎల్)గా నామకరణం చేశారు. దీనికి సంబంధిరచిన మార్గదర్శకాలు కూడా శుక్రవారం విడుదల చేశారు. ఈ ఎస్‌పివిలో కేంద్రం నురచి డిజిటల్ భారత్ అడ్మినిస్ట్రేటర్ ఎక్స్ అఫిషియో ఛైర్మన్‌గా ఉరడగా, టెలికామ్ రాష్ట్ర సిజిఎం, స్పెషల్ డైరెక్టర్, రాష్ట్రానికి చెరదిన కమ్యూనికేషన్ అక్కౌరట్స్ కంట్రోలర్‌తోపాటు ధన్‌బాద్‌లోని ఐఐటిలో పనిచేస్తున్న ప్రొఫెసర్ రవి గంగ్వార్ ఉరటారు. అలాగే రాష్ట్రం తరఫున రాష్ట్ర పెట్టుబడులు మౌళికాభివృద్ధిశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, ఇరధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, ఆర్థికశాఖ ముఖ్య కార్యదర్శి, ఐటి శాఖ కార్యదర్శి, రాష్ట్ర ఫైబర్‌నెట్ ఎరడి డైరెక్టర్లుగా ఉంటారు.గత 2023లోనే కేంద్ర ప్రభుత్వం అమెరడెడ్ భారత్‌నెట్ ప్రోగ్రామ్ కిరద రూ.1,39 579 కోట్లతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిరచేరదుకు నిర్ణయిరచగా, 2.64 లక్షల గ్రామ పంచాయితీలకు ఫైబర్‌నెట్ అనసంధానం చేసేరదుకు లక్ష్యరగా నిర్దేశిరచుకున్నారు. ఇరదులో రాష్ట్రానికి సంబంధిరచి రూ.2,428 కోట్లు వ్యయం చేయనున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా 664 బ్లాక్‌లకు బిఎస్‌ఎన్‌ఎల్ ద్వారా కనెక్టివిటీ అరదిరచాలని నిర్ణయిరచారు. అలాగే ఇప్పటివరకు ఉన్న ఫేజ్ 1లోని నెట్ వర్క్‌ను అభివృద్ధి చేయడం, కొత్తగా 480 పంచాయితీలకు కనెక్టివిటీ ఏర్పాటుచేయడం, వాటి నిర్వహణపై దృష్టి పెట్టాల్సి ఉంటుంది.

## విశాఖ ఉక్కు పరిశ్రమను అమ్మేది లేదంటూనే అప్పనంగా అదానీ చేతిలో పెడుతున్నారు : పిసిసి అధ్యక్షురాలు షర్మిల

**విజయవాడ,డిసెంబరు 8,ప్రభాతవార్తప్రతినిధి:** విశాఖ ఉక్కు పరిశ్రమను అమ్మేది లేదంటూనే అప్పనంగా అదాని చేతిలో పెడుతున్నారని ఎపిసిసి అధ్యక్షులు వైఎస్ షర్మిల విమర్శించారు. స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ లేదని, అమ్మబోమని బిజెపి చెప్పేవన్నీ కల్లబొల్లి మాటలేనని సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కొత్త నియామకాలు లేకుండా అడ్డుకుంటున్నారని తెలిపారు. ప్లాంట్ భూములను అదానికి ధారాదత్తం చేయాలని చూస్తున్నారని ఆరోపించారు. ఒక్కొక్కటిగా అదానికి అప్పగిస్తూ రాష్ట్రాన్ని అదాని ప్రదేశ్‌గా మార్చాలని చూస్తున్నారన్నారు. విశాఖ ఉక్కును అమ్మే కుట్రలో కర్త మోడీ అయితే క్రియ చంద్రబాబు అని పేర్కొన్నారు. పొమ్మనకుండా పొగబెట్టిన చందంగా నష్టాల సాకు చూపి ఉద్యోగులను వేధిస్తున్నారని తెలిపారు. పనికొద్ది జీతమని ప్రపంచంలో ఎక్కడా లేని రూల్స్ అమలు చేస్తున్నట్లు చెప్పారు. స్టీల్ ఉత్పత్తికి కావాల్సి న ముడి సరుకును ఇవ్వకుండా ముప్పు తిప్పలు పెడుతున్నారని పేర్కొన్నారు. విశాఖ ఉక్కును అమ్మేది లేదనిప్రధాని మోడీతో ప్రకటన చేయించాలని డిమాండ్ చేశారు.

# ఆర్టీసి బస్సు ఢీకొని విద్యార్ధి దుర్మరణం

**ఇందుకూరుపేట (నెల్లూరు), డిసెంబర్ 8, ప్రభాతవార్త :** ఆర్టీసీ బస్సు ఢీకొని ఆరవ తరగతి చదువుతున్న పులి కిరణ్(9) అనే విద్యార్థి మృతి చెందిన ఘటన సోమవారం చోటు చేసుకుంది. మండలంలోని గంగపట్నం మజారా వెంకటరెడ్డి కాలనీకి చెందిన పులి ప్రదీప్ 9వ తరగతి, పులి కిరణ్ ఆరవ తరగతి చదువుతున్న అనే ఇద్దరు అన్నదమ్ములు సైకిల్ పంచర్ వేసుకునేందుకు గంగపట్నం వెళ్తుండగా వేపచెట్టు సెంటర్ వద్ద ఆర్టీసీ బస్సు వెనుక వైపు నుంచి వేగంగా ఢీకొనడంతో కిరణ్(9) అనే బాలుడు అక్కడే మృతి చెందాడు. ప్రదీప్ స్వల్ప గాయాలతో భయపడ్డాడు. గత 7 నెలల కిందట తండ్రి పులి మురళి విద్యుత్ ఘాతంతో మృతి చెందడంతో తల్లి సంరక్షణలో ప్రదిప్ కిరణ్ జీవనం సాగిస్తున్నారు. అన్న ప్రదీప్ కళ్ళ ఎదుట మృతి చెందిన తమ్ముడు కిరణ్ మృతదేహాన్ని చూసి విలవిలాడిపోయాడు. భర్తను కోల్పోయి కూలీ, నాలి చేసుకుని తన ఇద్దరు బిడ్డలతో జీవనం సాగిస్తున్న తల్లి మృతదేహం వద్ద తల్లడిల్లిపోయింది.



విద్యార్థి ఫైల్‌ఫొటో

# తిరుమల సమాచారం

# 16 నుండి సుప్రభాతసేవకు బ్రేక్

## - ఆలయంలో తిరుప్పావై ప్రవచనాలతో వెంకన్న మేల్కొలుపు

**తిరుమల,డిసెంబర్8 ప్రభాతవార్తప్రతినిధి :** వైఖానస ఆగమోక్తంగా పూజలందుకుంటున్న తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామికి వేకువజామున నిర్వహించే సుప్రభాతసేవ ఈనెల 16వతేదీ నుండి రద్దుచేశారు. ఆ స్థానంలో ధనుర్మాసం సందర్భంగా నెలరోజులపాటు గోదాదేవి తిరుప్పావై పాశురాలను వేదపండితులు ,ఆలయ అర్చకులు పారాయణం చేసి శ్రీవారిని మేల్కొలుపుతారు. ప్రతి ఏడాది ధనుర్మాసంలో సుప్రభాతసేవ స్థానంలో తిరుప్పావై పాశురాలు పఠించడం ఆనవాయితీ. తిరుమల, తిరుపతితో పాటు దేశవ్యాప్తంగా 233 కేంద్రాలలో తిరుప్పావై పారాయణం జరుగుతుంది. ఈనెల 16 నుండి 2026 జనవరి 14వ తేదీ వరకు పండితులు తిరుప్పావై ప్రవచనాలు చేయనున్నారు. టీటీడీ ఆళ్వార్ దివ్యప్రబంధ ప్రాజెక్టు ఆధ్వర్యంలో ఇందుకోసం ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఇందులో భాగంగా తిరుపతితో పాటు ఆంధ్రప్రదేశ్ 76 కేంద్రాలు, తెలంగాణ 57కేంద్రాలు, తమిళనాడు 73, కర్ణాటక 21, పాండిచ్చేరి 4, న్యూఢిల్లీ, ఒడిశాలో ఒకొక్క కేంద్రంలో తిరుప్పావై ప్రవచనాలు నిర్వహించనున్నారు. తిరుమల శ్రీవారి ఆలయంలోనూ ధనుర్మాసంలో సుప్రభాతం బదులు తిరుప్పావై నివేదించడం విశేషం. తిరుపతిలోని అన్నమాచార్య కళామందిరం, కెటి రోడ్డులోని శ్రీ వరదరాజస్వామివారి ఆలయంలో తిరుప్పావై ప్రవచనాలు పారాయణం చేస్తారు. 12 మంది ఆళ్వారులలో ఒకరైన గోదాదేవి ధనుర్మాసం వ్రతం చేశారు. ఈ వ్రతం చేయడం వల్ల దేశం సమృద్ధిగా, సుభిక్షంగా ఉంటుంది. ద్వాపరయుగంలో గోపికలు ఈ వ్రతాన్ని ఆచరించి శ్రీకృష్ణుని కృపకు పాత్రులయ్యారని భాగవతం దశమ స్కందంలో పేర్కొనబడింది. ఈ తిరుప్పావై సారాంశం భగవంతునికి కైంకర్యం చేయడమే. దేశవ్యాప్తంగా గల అన్ని వైష్ణవ దేవాలయాలలో తిరుప్పావై శాత్తుమొర నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది.



# బ్రహ్మోత్సవాల తరహాలో వైకుంఠ ఏకాదశి, ద్వాదశి రోజుల్లో సేవలు

## - భక్తుల భద్రతకు ప్రాధాన్యత : ఎస్పీ సుబ్బరాయుడు

**తిరుమల,డిసెంబర్8 ప్రభాతవార్తప్రతినిధి :** కలియుగప్రత్యక్షదైవం తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామికి జరిగిన బ్రహ్మోత్సవాలను విజయవంతంగా నిర్వహించడం వెనుక పోలీసుశాఖ నుండి సహకారం అందించినట్లే రానున్న వైకుంఠ ఏకాదశి,ద్వాదశి పర్వదినాల్లోసేవలందించాలని తిరుపతి జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు సూచించారు. ఆ రెండురోజులతోబాటు జనవరి 1న కూడా భక్తులు అశేషంగా తిరుమలకు వచ్చే అవకాశం ఉన్నందున భద్రత పరంగా, భక్తులకు సేవలందించే విషయాలపై సోమవారం సాయంత్రం తిరుపతిలో పోలీస్ అధికారులతో సమీక్షించారు. తిరుపతి అదనపు ఎస్పీలు రవిమనోహరచారి, రామకృష్ణ, నాగసుబ్బన్న, కులశేఖర్, ఎస్‌బి డిఎస్పీ జె.వెంకటనారాయణ, డిఎస్పీలు విజయశేఖర్, భక్తవత్సలం, శ్యామ్‌సుందర్, రామకృష్ణమాచారిలతో కలసి ఎస్పీ సుబ్బరాయుడు సమావేశం నిర్వహించారు. వైకుంఠద్వార దర్శనాల కారణంగా తిరుమలలో పెరగనున్న భక్తుల రద్దీని దృష్టిలోపెట్టుకుని ట్రాఫిక్ నియంత్రణ, వాహనాల పార్కింగ్ స్థలాలు, క్యూలైన్ల నియంత్రణ, చిన్నపిల్లలు,వృద్ధులు తప్పిపోకుండా తీసుకోవాల్సి న జాగ్రత్తలు, హెల్ప్‌డెస్కులు,ప్రత్యేక టీమ్‌లు విజిలెన్స్ సిబ్బందితో సమన్వయంగాపనిచేయాలని ఆదేశించారు. అత్యవసర పరిస్థితుల్లో క్విక్‌రెస్పాన్స్‌టీమ్స్, వైద్యసిబ్బంది సేవలు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు.





## భగవంతుని ఆశీస్సులందరిపై ఉండాలి: ప్రముఖులు

**తిరుమల,డిసెంబర్8 ప్రభాతవార్తప్రతినిధి :** కలియుగ ప్రత్యక్షదైవం తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి ఆశీస్సులందరిపై ఉండాలని వేడుకున్నట్లు ప్రముఖులు తెలిపారు.ప్రభుత్వ విఫ్ గణబాబు,మాజీ మంత్రి ఆర్‌కెరోజా వేర్వేరుగా సోమవారం ఉదయం శ్రీవారిని దర్శించుకున్నారు. ఆలయ అధికారులు, అర్చకులు స్వామివారి దర్శనం చేయించి వేదాశీర్వచనం అందించారు. ఆలయ అధికారులు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.



# కల్తీనెయ్యికేసులో సిట్ కస్టడీకి మరో ఇద్దరు నిందితులు

**తిరుమల,డిసెంబర్ 8ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమల లడ్డూలకు కల్తీనెయ్యి సరఫరాచేసిన కేసులో లోతైన దర్యాప్తుచేపట్టిన సిబిఐ సిట్ అధికారులు ఇప్పుడు కీలకమైన ఇద్దరు నిందితులు కాంట్రాక్టర్ సుగంధి, టిటిడి పూర్వ మార్కెటింగ్ జిఎం సుబ్రమణ్యంలను కస్టడీకి తీసుకున్నారు. ఆ ఇద్దరి కస్టడీ పిటిషన్‌పై నెల్లూరు ఏసిబి కోర్టు న్యాయమూర్తి అనుమతివ్వడంతో సుగంధిని, సుబ్రమణ్యంను సిట్ అధికారులు నేడు నెల్లూరు జైలునుండి కస్టడీకి తీసుకోనున్నారు. నాలుగురోజులు వారిని మరింత లోతుగా విచారణ చేసిన తరువాత కొంతమంది టిటిడి మార్కెటింగ్,కొనుగోళ్ళ విభాగం అధికారులను విచారణకు పిలిచి అరెస్ట్ చేసే సూచనలు లేకపోలేదనితెలుస్తోంది. మంగళవారం నుండి శుక్రవారం వరకు ఆ ఇద్దరినీ సిట్ ఏమి ప్రశ్నించి వివరాలు రాబట్టనుందనేది సంచలనమే. ఈ కేసులో మాజీ టిటిడి ఛైర్మన్ వైవి సుబ్బారెడ్డి వ్యక్తిగత సహాయకుడు చిన్నఅప్పన్నను కటకటాల్లోకి పంపిన సిట్ అతని నుండి మరిన్ని ఆధారాలు సేకరించింది. ఇప్పటివరకు అరెస్ట్‌చేసిన నిందితుల నుండి రాబట్టిన వివరాలను పరిశీలించి తదుపరి అనుసరించాల్సి న వ్యూహంపై తీవ్రంగా చర్చించిందనేది సమాచారం. కల్తీనెయ్యి సరఫరాచేసిన పాపంలో అసలు సూత్రధారులైన గత టిటిడి పెద్దల అవినీతిగుట్టు రట్టయ్యే అవకాశం కూడా ఉండటంతో సిబిఐ సిట్ అధికారులు మరింత వేగం పెంచారు. 2022లో అప్పటి టిటిడి బోర్డులో కొందరు అక్రమాలు భారీగానే ఉన్నాయని సిట్ అధికారులు ఆధారాలు సేకరించారు.మరింత కీలక సమాచారం సేకరించడానికి సుగంధి, సుబ్రమణ్యంలు కస్టడీకి తీసుకుని విచారణచేయబోయే అంశాలు హాట్‌టాఫిక్‌గా మారాయి. బోలేబాబాడెయిరీతోబాటు ఏఆర్ డెయిరీ,వైష్ణవి డెయిరీ, ప్రీమియర్‌అగ్రిఫుడ్స్ తో ఒప్పందంతో భారీగా కమీషన్లు రాబట్టారనేది సిట్ విచారణలో వెలుగుచూసిన అంశాలు. ఆ ఇద్దరి విచారణతో కల్తీనెయ్యి బాగోతంలో ముందుముందు ఎవరికి నోటీసులు వెళ్తాయో,ఎవరిని విచారణకు పిలిచి చర్యలు తీసుకుంటారనేది అందరిలో ఉత్కంఠే.





## గుజరాత్ వాసి కారులో కోటి హవాలా సొమ్ము స్వాధీనం

**గోరంట్ల (పెనుకొండ) డిసెంబర్ 8 ప్రభాతవార్త:** పట్టణ సమీపంలోని 44 జాతీయ రహదారి పాత చెక్పోస్ట్ వద్ద గుజరాత్ రాష్ట్రం సూరత్ నుండి కర్ణాటక రాష్ట్రం బెంగళూరుకు వెళ్తున్న ఒక కారును నలుగురు వ్యక్తులు కార్లతో కొంతమంది వెంబడించి ఆ కారును కొంత మంది అడ్డుకున్నారు. ఇది గమనించిన ఒక సాఫ్ట్వేర్ ఉద్యోగి పోలీసులకు సమాచారం అందించారు.దీంతో సిఐ రాఘవన్, ఎస్ఐ వెంకటేశ్వర్లు స్వాధీనం చేసుకోగా కారులోఉన్న కోటి 20 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు.

పూర్వీకుల ఘనత మీద బతికే వారిని మృతవీరుల జాబితాలో చేర్చవచ్చు.

-లాసన్

# అపూర్వ 'అణు'బంధం!


భారత్ రష్యాల స్నేహం విడదీయలేనిదని, ఎల్లప్పుడూ ధ్రువతారలా వెలుగులీనుతూనే ఉంటుందని మరోసారి వెల్లడైంది. రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌తో భేటీ సందర్భంగా ప్రధాని నరేంద్ర మోడీ కూడా అదే విషయాన్ని నొక్కి చెప్పారు. నిజానికి ఈ రెండు దేశాల మధ్యస్నేహబంధంఈనాటిది కాదు. భారత స్వాతంత్ర్యానంతరం దేశ పారిశ్రామిక ప్రగతికి సాంకేతికతను అందించిన దేశంగా రష్యా పట్లభారతీయులందరికీ కృతజ్ఞత ఉంది. అదే ఇప్పుడు తాజాగా ఆ రెండు దేశాల పాలనాధ్యక్షుల మధ్య భేటీకి దారులు తెరచింది. భారతీయ సంప్రదాయాలను, రుచులను విదేశీ అతిథులకు పరిచయం చేయడంలో మనదేశం ఎప్పుడూ ముందుంటుంది. భారతీయతను చాటి చెప్పిన తర్వాతనే అవతలి వారితో ఒప్పందమైనా, స్నేహశీలతను ప్రకటించడమైనా. భారత్ పై అమెరికా ప్రతీకార సుంకాలు,ఆంక్షలు విధించిన నేపథ్యంలో ఇరు దేశాలు తమ ఆర్థిక ,వాణిజ్య భాగస్వామ్యాన్ని బలపరచుకునేందుకు ఈ భేటీ బాగా ఉపయోగ పడింది. ప్రధానంగా ఉగ్రవాదాన్ని అంతం చేసేందుకు భారత రష్యాలు కలిసి పని చేస్తాయి.వార్షిక ద్వైపాక్షిక వాణిజ్యాన్ని పది వేలకోట్ల డాలర్లకు పెంచింది. విశేషంగా ఉక్రెయిన్‌తో యుద్ధానికి శాంతియుతంగా ముగింపు పలకాలంటూ ప్రధాని మోడీ పుతిన్‌ను వేడుకోవడం ఇతర దేశాలతో సంబంధాలు ఎలా ఉండాలో ప్రత్యేకించి చెప్పినట్లయింది. భారత్ రష్యా బిజినెస్ ఫోరంలో మోడీ, పుతిన్‌లు పాల్గొవడం భారత్ సుస్థిరాభివృద్ధికి రష్యా బాసటగా ఉంటుందని పుతిన్ భరోసా ఇవ్వడం చెప్పుకోదగిన సందర్భం. సుదీర్ఘ కాలంగా రష్యా, భారత్‌ల సంబంధాలు సజావుగా కొనసాగడానికి ఢోకా లేనివిధంగా అడుగులు పడ్డాయి. గత 8దశాబ్దాల్లో మానవాళి అనేక సవాళ్ల సంక్షోభాలను ఎదుర్కొంది. వాటన్నింటినీ తట్టుకుంటూ భారత్‌రష్యా మైత్రి ధ్రువతారలా నిలిచిందన్న భావనల బలిమి కలిగింది.పరస్పర గౌరవం, బలమైన విశ్వాసం, అనే పునాదులపై ఈ బంధం శాశ్వతమైనదని రష్యా అధ్యక్షుడు పుతిన్ ఉద్ఘాటించడంతో ఆయన రెండురోజుల భారత పర్యటన ముగిసింది. అందువల్ల ద్వైపాక్షిక సంబంధాలతోపాటు ఇరు దేశాల ప్రజల మధ్య సంబంధాలూ మరింత బలపడతాయని ఆయన ఆకాంక్షించారు. పుతిన్‌తో ప్రధాని నరేంద్ర మోదీ ఢిల్లీలోని హైదరాబాద్ హౌస్‌లో శుక్రవారం జరిపిన శిఖరాగ్ర సమావేశంలో ఇరు దేశాల మధ్య మొత్తం 16 కీలక ఒప్పందాలు కుదిరాయి. నైపుణ్య కార్మికుల వలసలకు రష్యా వెసులుబాటునిచ్చింది.భారత కూడా అదే స్ఫూర్తితో స్వాగతం పలికింది. ఆరోగ్యం, ఆహార భద్రత, శాస్త్రీయ పరిశోధనలు, నౌకాయానం, ఎరువులు, విద్య వంటి రంగాల్లో పరస్పర సహకారం పెంపునకు దోహదపడే అంశాలే ఉన్నాయి. వాణిజ్య లోటును పూడ్చుకోవడంలో మాస్కో ఢిల్లీకి సాయపడనున్నాయి. ద్వైపాక్షిక సంబంధాలను మరింత ఐలోపేతం చేసుకోవడంపై చర్చించారు. భారత్,రష్యాల మధ్య ప్రస్తుతం ఏటా 64బిలియన్ల డాలర్ల వాణిజ్యం జరుగుతుండగా 100 బిలియన్ డాలర్‌లకు పెంచుతూ రష్యన్ అధ్యక్షుడు పుతిన్ ప్రకటించారు. భారత్ ఇంధన అవసరాలను తామే పూర్తిగా తీర్చగలమని భరోసా దొరికింది. చమురుగా, గ్యాస్, బొగ్గు విషయంలో కూడా ఇదే పద్ధతి అనుసరించేందుకు రష్యా ముందుకొచ్చింది.భారత్ ఉత్పత్తుల కోసం రసాయన మార్కెట్లను నిరంతరం అందుబాటులో ఉంచేందుకు సిద్ధమని ఆయన ప్రకటించారు. వ్యవసాయం, ఔషధ రంగంలో కీలకమైన అణు టెక్నాలజీ వాడుకునేందుకు భారతకు పూర్తి స్థాయిలో సహకరించనున్నామని, ఆ మేరకు ఒప్పందం కూడా జరిగింది.భారత్, రష్యా మధ్య మానవ వనరుల రాకపోకలను సులభతరం చేసేలా రెండు ఒప్పందాలు కుదుర్చుకున్నట్లు తెలిపారు. ఇరుదేశాలు కలిసి ఐక్యంగా సాగుదామన్న పుతిన్ ఆలోచనకు భారతీయుల్లో విశేషఖ్యాతి లభించింది. గురువారం సాయంత్రం ఢిల్లీకి చేరుకున్న పుతిన్కు ప్రధాని మోడ్స్ స్వయంగా ఎయిర్పోర్టుకు వెళ్లి స్వాగతం పలికినవిషయం తెలిసిందే. శుక్రవారం ఉదయం పుతిన్కు రారక్షణ, ఇంధనంసహా అనేక రంగాల్లో ఇరుదేశాల సహకారాన్నిమరింత బలోపేతం చేసే దిశగా కీలక చర్చలు సాగాయి. ఈ పర్యటన సందర్భంగా పుతిన్‌కు ప్రధాని మోడీ వివిధ బహుమతులు అందించారు. ఇందులో భగవద్గీత రష్యన్ ఎడిషన్,కాశ్మీరీ కుంకుమ పువ్వు,అసోం బ్లాక్‌టీ, బెంగాల్ ముర్షిదాబాద్ కు చెందిన వెండి టీ సెట్, మహారాష్ట్ర హస్త కళా తయారీ వెండి గుర్రం, ఆగ్రా నుంచి తెచ్చిన మార్బుల్ చెస్ సెట్ వంటివి ఉన్నాయి. ఇలా దేశాల మధ్య సాంస్కృతిక సంబంధాలకు ఆస్కారమిచ్చే ఆయా దేశాల ప్రాముఖ్యత కలిగిన కానుకలను ఇచ్చి పుచ్చుకోవడం ఓ సాంస్కృతిక మర్యాదగా బాసిల్లుతుంది. భారత్, రష్యాల మధ్య కుదిరిన ఒప్పందాలన్నీ ఐదేళ్ల పాటు ఉండే ఆర్థిక ఒప్పందాలు 'పంచవర్ష ప్రణాళిక'గా చెప్పాలి. తమిళనాడులోని కూడంకుళం అణువిద్యుత్ కేంద్రాన్ని, ప్లాంట్ నిర్మాణాలను త్వరలో వినియోగంలోకి తెచ్చేందుకు రష్యా హామీ ఇచ్చింది.భారత్ ప్రగతికి కాలొడ్డిన అమెరికా ప్రస్తావించిన అన్ని అంశాలకూ రష్యా భరోసా లభించడం ఆహ్వానించదగిన పరిణామం.రష్యాతో ఎలాంటి వాణిజ్య ఒప్పందాలు వద్దన్న అమెరికాను కానీ యూరప్ ఒత్తిళ్లకు గానీ లొంగని భారతీయ పాకుల వైఖరి ప్రశంస నీ యం. భారత్, రష్యాల మధ్య బంధం అత్యంత వ్యూహాత్మకమైనదని, వారి భేటీ ప్రపంచానికి స్పష్టమైన సందేశాన్ని పంపినట్లుగా చైనా అభివర్ణించింది.

కోపాన్ని జయించలేని వాడికి ఇతరుల సామర్థ్య లోపాన్ని విమర్శించే హక్కు ఉండదు.



ఇ.గిబ్బన్

పుస్తకాలు మాత్రమే చదవకు. మనుషులను కూడా చదువు. ముఖ్యంగా నిన్ను నీవు చదువుకో.



ఆస్కార్‌వైల్డ్

# పోలీసుల్లో మార్పు ప్రజలే తేగలరు!

**మన దేశంలో దాదాపు అన్ని రాష్ట్రాలలో పోలీసుల ప్రవర్తన వల్ల, అవినీతి వల్ల అనవసరపు కఠినత్వ ప్రదర్శన వల్ల ప్రజలకు దూరమవుతున్నారు. ప్రభుత్వాలు ఎన్నో సంస్కరణలు ప్రవేశపెట్టదల్చుకున్నా అవి కాగితాలకే పరిమితమయ్యాయి. సైబర్ నేరాలు కృత్రిమ మేధస్సుతో ఉబికివస్తున్న వైవిధ్య భరిత ప్రశ్నలకు దీటుగా కార్యాచరణ ఇంకా సీరియస్‌గా పాలకులు తలపెట్టలేదు. పైపెచ్చు వారి రాజకీయ ప్రవర్తన రాజ్యాంగ వ్యతిరేకంగా పోలీసులను పార్టీల కార్యకర్తలుగా మార్చే పరిస్థితి ఏర్పడుతున్నది. దీనిని తక్షణం అధిగమించగలుగుతేనే నాలుగు రోడ్ల కూడలి నుంచి నిర్ణీత మార్గంలో సమాజానికి సేవ చేసే మార్గంలో ప్రయాణం చేసే అవకాశం ఉంటుంది. బ్రిటిష్ వారిచ్చిన కాలం చెల్లిన యూనిఫాం మార్చటంతో పోలీసుల్లో మార్పురాదు. మనదేశానికి పనికివచ్చే తీరులో పోలీసుల పని తీరులో మార్పును స్పష్టంగా తేవాలి.పోలీసు చట్టాన్ని కాపాడటంతో పాటు అమలు చేయాలి. చట్టాలను చుట్టాలుగా మార్చుకున్న పాల కుల చట్రంనుంచి పోలీసులు బయటపడ్డప్పుడే పోలీసును సమాజం ప్రేమిస్తుంది. సహకరిస్తుంది. ప్రజలు ప్రభుత్వాలు పూనుకుంటేనే అలాంటి మార్పు సాధ్యమవుతుంది.**



రావులపాటి సీతారాంరావు

ప్రభుత్వంలో ఒక భాగమైన పోలీసు వ్యవస్థ ప్రస్తుతం నాలుగు రోడ్ల కూడలిలో దిక్కుతోచకఉందా అన్న భావన ప్రజల్లో కలుగుతున్నదని చాలా మంది భావిస్తున్నారు. ప్రభుత్వంలోని ఇతర విభాగాలు కూడా ఉదాహరణకు,రెవెన్యూవ్యవస్థ, టాక్స్‌లు వసూలు చేసే వ్యవస్థ వ్యవసాయానికి చెందిన వ్యవస్థ, అడవులకు సంబంధించిన, విజ్ఞానాన్ని ప్రసాదించే చదువుల వ్యవస్థల్లాంటివి నాలుగు కూడళ్ల మధ్యలేవా అని ప్రశ్నించే ఆలోచన ఎవరికైనా కలగొచ్చు. పోలీసు వ్యవస్థకు మాత్రమే ప్రత్యేకంగా ఎందుకీ ప్రస్తావన? అడుగుతే జవాబు మాత్రం ఒక్కటే. దాదాపు కొన్ని వ్యవస్థలకే పరిమితమైన విభిన్న బాధ్యతలతో పోలీసు శాఖ విద్యుక్త ధర్మాన్ని నిర్వర్తించాల్సిన అవసరం ఉంది. కాబట్టి చట్టాలను అమలు చేసే అతి ముఖ్యమైన బాధ్యత ఆ శాఖకే ఉంది కాబట్టి. వ్యక్తిగత స్వేచ్ఛను అవసరం అనుకుంటే సంస్థల స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను కూడా కట్టడి చేసేఉద్యోగం, ప్రజాస్వామ్యపరంగా రాజ్యాంగ పరంగా ఆ శాఖకే సంక్రమించింది. కాబట్టి పోలీసు వ్యవస్థ పనితీరు భూతద్దంలో చూడకతప్పదు. ఆశాఖ వ్యవహార దక్షతనూ, పనితీరునూ జవాబుదారీతనాన్ని ప్రతి నిముషమూ ప్రశ్నించక తప్పదు. భూమితోపాటు మానవాళి ఈ ప్రపంచంలో భాగంగా ఉద్భవించి మమేకమై మొదట్లో సర్వ స్వతంత్రంగా గమనాన్ని సాగిస్తూ, తర్వాత తర్వాత చిన్నా భిన్నమైన సమూహాల నియంత్రణ, ధర్మం, న్యాయం, అవసరమని అనుభవం ద్వారా గుర్తించి తమంతట తామే క్రమశిక్షణ, జవాబుదారీతనం కోసం కొన్ని నియమాలు ఏర్పరుచుకొని ఆ నియమ నిబంధనలను అమలు చేసేందుకు ఒక సంస్థ తప్పనిసరి అని గుర్తించి, ఎవరికి తోచిన రీతిలోవారు కట్టుబాట్లు ఏర్పరుచుకొని, నియంత్రించటానికి, రక్షించుకోటానికి ప్రతి దేశంలోనూ, పోలీసు వ్యవస్థను ఏర్పరుచుకున్నారని మానవ చరిత్ర చెబుతున్నది. పోలీసు అన్న పేరే కానక్కర్లేదు. వివిధ పేర్లతో క్రమేపీ రక్షణ కోసం మానవాళిలో పొడచూపుతున్న నేర ప్రవృత్తి కట్టడి కోసం భౌగోళికంగా ఏర్పడిన ప్రతి ఖండంలోనూ ఈ సంస్థ ఉద్భవించి అలరారుతున్నది. పోలీసుల పుట్టుక, గత చరిత్ర ప్రస్తుతం అప్రస్తుతం కానీ రేఖా మాత్రంగా ఏ రూపంలో, ఎందుకోసం పోలీసులు పుట్టుకొచ్చారు అని జ్ఞప్తికి తెచ్చుకోవటానికి మాత్రమే ఈ నేపథ్యం ఇవ్వాల్సివచ్చింది. అసలు విషయానికి వస్తే మనదేశంలోని పోలీసులు అనతికాలంలోనే స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత మంచి పేరు సంపాదించుకున్న మాటనిజం. నేరాలు నిరోధించటంలోనూ, నేరాల దర్యాప్తులోనూ, పరిశోధనలోనూ, ఇతర దేశాల పోలీసులకు ఏమాత్రం తీసిపోని విధంగా, నైపుణ్యాన్ని ప్రతిభను ప్రదర్శించుకోవటమే కాకుండా ఇతర దేశాల ప్రభుత్వాలు ఎదు



ర్కొని గడ్డు సమస్యలను అతి చాకచక్యంగా పరిష్కరించుకోగలిగారు. దేశంలో ఉగ్రవాదుల చర్యలను తీవ్రవాదుల సమస్యను గణనీయంగా అణచివేయడంలోనూ అతి త్వరలోనే అనుభవాన్ని గడించి,ఫలితాలు సాధించారు. ముఖ్యంగా పంజాబ్‌లో కొన్నేళ్లక్రిందట ఎదుర్కొన్న, ఖలిస్తాన్ వేర్పాటు వాదాన్ని నియంత్రించటంలో శ్రీలంక ఎల్.టి.టి.ఇ సమస్యను పరిష్కరించటంలో ఇందిరా గాంధీ, రాజీవ్‌గాంధీ లాంటి నాయకులను కోల్పోయినా పోలీసులు సమర్థవంతంగా ఇతర బలగాల తోడ్పాటుతో శాంతి భద్రతలను కాపాడగలిగారు. వి.ఐ.పిల బందోబస్తు, ట్రాఫిక్ సమస్య, ప్రాంతీయవాదాల చిక్కుముడులు, కులమత వర్గవైషమ్యాలు వెలికి తెచ్చే శాంతిభద్రతల సవాళ్లు నిత్యమూ ఎదుర్కోవాల్సిన పరిస్థితి ఏర్పడుతున్నది. సమస్యలకు తగ్గ బలగాలు అందుబాటులలోని పరిస్థితి. నిష్పత్తి పరంగా ర్యాంకులపరంగా సంఖ్యల్లో కొరత కొట్టొచ్చేట్లు కనపడుతున్నా పోలీసులు వెనక్కి తగ్గకుండా అహర్నిశలూ పనిచేస్తూ ఎత్తిన జెండాను కిందకు దింపకుండా కష్టాలను అధిగమిస్తున్నారు. సానుకూలంగా సమీక్షిస్తే వివిధ రకాల ఇబ్బందులకూ, సవాళ్లకూ, జవాబు ఇవ్వగలుగుతున్నా నిజానికి ఫైర్ ఫైటింగ్ ఆపరేషన్సుతోనే కాలం గడుపుతున్న నిజాన్ని ఎవరూ కాదనలేరు. ఇప్పటివరకూ వ్యవస్థ నిత్యమూ ఏర్పడుతున్న ప్రతిబంధకాలనూ, గడ్డుకాలాన్ని అధిగమిస్తూ అనుభవం వల్ల వెసులుబాట్లు కల్పించుకుంటూ ముందడుగు వేస్తున్నది. అయితే ముందు ముందు ఇలాంటి గుడ్డిలో మెల్లలాంటి సంతృప్తి కలిగించే వాతావరణమూ, పరిస్థితులూ, పరిణామాలు ఉండకపోవచ్చు. ఆధునిక యుగంలో అనుకూల మార్పులతోపాటు వ్యతిరేకత మూటగట్టుకొని వచ్చే మార్పులను కాదనక తప్పదు.పోలీసువ్యవస్థ తనను తాను సంస్కరించుకొని ప్రజలకు సానుకూలంగా తయారుకాక తప్పదు. స్థూలంగా రిక్రూట్‌మెంట్, శిక్షణల్లో మార్పులతోపాటు వ్యవహారశైలి కూడా పోలీసులు మార్చుకోక తప్పదు. సమాజంలో పోలీసుల జోక్యం జనాభావారీగా 10 శాతం మించి ఉండదు. తొంభై శాతం ప్రజలకు పోలీసుల రక్షణ మానసిక తృప్తి కలిగించేదే. ట్రాఫిక్ బందోబస్తు వ్యవహారాల్లో మాత్రమే పోలీసులు ప్రత్యక్షంగా తోడ్పడగలరు.ఆవిధంగా విహంగ వీక్షణంగా పోలీసు చేతలను గమనించవచ్చు. మారిన కాలంలో కొన్ని గడ్డు సమస్యలు పోలీసులు వృత్తిపరంగా ఎదుర్కోక తప్పటం లేదు. ఇతర దేశాల్లో పోలీసులతో భయంతోనో, గౌరవంతోనో ప్రజలు వ్యవహరించగలుగుతున్నారు. మన దేశంలో దాదాపు అన్ని రాష్ట్రాలలో పోలీసుల ప్రవర్తన వల్ల, అవినీతి వల్ల అనవసరపు కఠినత్వ ప్రదర్శన వల్ల ప్రజలకు దూరమవుతున్నారు. ప్రభుత్వాలు ఎన్నో సంస్కరణలు ప్రవేశపెట్టదల్చుకున్నా అవి కాగితాలకే పరిమితమయ్యాయి. సైబర్ నేరాలు కృత్రిమ మేధస్సుతో ఉబికివస్తున్న వైవిధ్య భరిత ప్రశ్నలకు దీటుగా కార్యాచరణ ఇంకా సీరియస్‌గా పాలకులు తలపెట్టలేదు. పైపెచ్చు వారి రాజకీయ ప్రవర్తన రాజ్యాంగ వ్యతిరేకంగా పోలీసులను పార్టీల కార్యకర్తలుగా మార్చే పరిస్థితి ఏర్పడుతున్నది. దీనిని తక్షణం అధిగమించగలుగుతేనే నాలుగు రోడ్ల కూడలి నుంచి నిర్ణీత మార్గంలో సమాజానికి సేవ చేసే మార్గంలో ప్రయాణం చేసే అవకాశం ఉంటుంది. బ్రిటిష్ వారిచ్చిన కాలం చెల్లిన యూనిఫాం మార్చటంతో పోలీసుల్లో మార్పురాదు. మనదేశానికి పనికివచ్చే తీరులో పోలీసులపనితీరులోమార్పును స్పష్టంగా తేవాలి.పోలీసు చట్టాన్ని కాపాడటంతో పాటు అమలు చేయాలి. చట్టాలను చుట్టాలుగామార్చుకున్న పాలకుల చట్రంనుంచి పోలీసులు బయటపడ్డప్పుడే పోలీసును సమాజం ప్రేమిస్తుంది. సహకరిస్తుంది. ప్రజలు ప్రభుత్వాలు పూనుకుంటేనే అలాంటి మార్పు సాధ్యమవుతుంది. •

# అవినీతి అంతమే యువత నినాదం

ఆచార్య : బుర్ర మధుసూదన్ రెడ్డి

నేటి ప్రపంచ మానవాళి పలు సవాళ్లు, అసమానతలు, అన్యాయాలు, విషాదాలు, మారణహోమాలు, అపరిమిత అవినీతి చేష్టలు లాంటి సమస్యలతో సతమతం అవుతున్నది. ప్రపంచ యువత అనేక రంగుల కలలు, ఎదగాలనే ఆకాంక్షలతో ముందుకు సాగడానికి ప్రయత్నాలు చేస్తున్నవేళ అవినీతి, లంచగొండితనం లాంటి చెదలు వారిని ఎదుగుదలను/ ఉద్యోగ ఉపాధులను/విద్యా అవకాశాలను/నైపుణ్య ప్రదర్శనలను/వైద్య ఆరోగ్య సంరక్షణను అడ్డుకోవడం,యువతలో అశాంతికి ఆజ్యం పోయడం జరుగుతున్నది. దీనికి తోడుగా అవినీతి చెదలు విస్తరిస్తూ పర్యావరణ విధ్వంసం, ప్రతికూల వాతావరణ మార్పులకు కారణం అవుతున్నది. ప్రపంచవ్యాప్త దాగాపు 2బిలియన్ల యువత అవినీతికి వ్యతిరేకంగా ప్రమాణం చేసి, బలీయ శక్తిగా ఎదిగి, నైతికతకు పట్టం కట్టి, అక్రమాల కట్టడికి నడుం బిగిస్తేనే ఉజ్వలభవిత దర్శనమిస్తుందని తెలుసుకోవాలి. ప్రపంచ యువత నైతిక ప్రవర్తన, పారదర్శకత, జవాబుదారీతనాన్ని డిమాండ్‌చేస్తూ అవినీతి నిర్మూలనకు పూనుకోవాలని, ఇలాగే నిర్లక్ష్యం చేస్తే ప్రపంచమే ఒక యుద్ధ క్షేత్రంగా మారి మానవత్వం మసకబారుతుందని గుర్తుంచుకోవాలి. ఆధునిక పౌర సమాజంలో వేళ్లూనుకుపోయిన అవినీతి చెదలు, లంచాల పీడలను పెకిలించడానికి యువశక్తి మాత్రమే చొరవ చూపాలి. యువతలో అవినీతి నిర్మూలన పోరాటాగ్నిని రగల్చడానికి ఐరాస నేతృత్వంలో 2004 నుంచి ప్రతి ఏటా 09 డిసెంబర్ రోజున ప్రపంచ దేశాలు అంతర్జాతీయ అవినీతి నిర్మూలన దినం(ఇంటర్నేషనల్ ఆంటీకరప్షన్ డే) పాటించుట జరుగుతోంది. అంతర్జాతీయ అవినీతి వ్యతిరేక దినం 2025 ఇతివృత్తంగా అవినీతి నిర్మూలనతో మానవ గౌరవానికి ప్రోత్సాహం" అనబడే అంశాన్ని తీసుకున్నారు. అవినీతి నిర్మూలనకు యువ యోధుల్లో నైతిక ప్రవర్తన, నీతివంతమైన సమాజ స్థాపన, లంచగొండి గుణాలను పాతరేయడం, నీతి నిజాయితీల ప్రాధాన్యాన్ని పలు వేదికల్లో చర్చించడం, అక్ర మార్కుల భరతం పట్టడం,లంచావతారులను అవినీతి నిరో ధక శాఖ ద్వారా పట్టించడం, నీతిమంతులను సన్మానించడం, పారదర్శక పాలన ప్రయోజనాలను అవగాహన పర్చ డం, అవినీతికి వ్యతిరేకంగా ప్రదర్శనలు ఏర్పాటు చేయడం లాంటి కార్యక్రమాలను ఈ వేదికగా ప్రచారం చేస్తున్నారు. ఈ ఏడాది హాష్‌ట్యాగ్‌గా యునైటెడ్ అగెనిస్ట్ కరప్షన్ అనే నినాదాన్ని తీసుకున్నారు. భారత్‌లో అవినీతి, లంచగొండిత నం నిత్య నినాదంగా, సర్వవ్యాప్తం అయింది. వార్డు మెంబర్ నుండి ఎంపీ వరకు, సర్పంచ్ నుంచి కేంద్ర మంత్రి వరకు ఎవ్వరి చరిత్ర చూసినా అవినీతి, అక్రమార్జనల కంపు కొడుతున్నది. లంచం ఇవ్వనిదే చిన్న చీమైనా కుట్టడం లేదు. అవినీతి చేయని అధికారి కనిపించడం అసాధ్యంగా తోస్తున్నది. నిత్యం అవినీతి నిరోధక శాఖ పన్నిన వలలో అవినీతి తిమింగలాలు పడుతూనే ఉన్నాయి. అనివీతి నిర్మూలనకు చేసిన చట్టాలకు లంచాల కోరల్లో చిక్కి విలవిలలాడుతున్నాయి. మన దేశంలో అవి నీతి నిర్మూలన చట్టం 1988, భారతీయ న్యాయ సంహిత2023, లోక్‌పాల్, లోకాయుక్త, విజిల్ బ్లోయర్స్ ప్రొటెక్షన్ ఆక్ట్2014, సివిసీ, సిబిఐ, రాష్ట్ర అవినీతి నిరోధక శాఖ లాంటివి భారత్‌లో అమలు అవుతున్నాయి. ప్రపంచ దేశాల్లో అవినీతిని కొలిచే సూచికలను ట్రాన్స్ ఫరెన్సీ ఇంట ర్నేషనల్ అధ్యయనం చేసి వివిధ దేశాల జాబితాను తయారు చేస్తు న్నది. 2025లో విడుదలైన 'గ్లోబల్ కరప్షన్ పర్‌సెప్షన్ ఇండెక్స్(ప్రపంచ అవినీతి సూచీ) ప్రకారం 180 దేశాల జాబితాలో భారత్‌కు 96వ స్థానం దక్కింది. ప్రపంచ వ్యాప్తంగా అవినీతిని అంతం చేయడానికి యువతను ఏకం చేస్తూ శక్తివంతం చేయడం, ప్రపంచ వ్యాప్తంగా సంఘీభావం ప్రకటించడం, చట్టాల అమలు, ప్రభుత్వ పని తీరును మెరుగుపరచడం లాంటి చర్యలు నిరంతరం ఉద్యమంగా కొనసాగాలి. ప్రతి ఒక్కరు 'అవినీతికి నో' చెప్పాలి. అవినీతి, అక్రమార్జన, అధికార దుర్వినియోగం, మోసాలు, లంచాలు లాంటి దురాలోచనలు ప్రపంచాభివృద్ధి కి ప్రతిబంధకాలని తెలుసుకోవాలి. అవినీతి శృంఖలాలను ఛేదిద్దాం,అక్రమార్జన పరుల భరతంపడదాం, నైతిక ప్రవర్తన ఆయుధాలను సిద్ధం చేద్దాం. మనందరం ఏకమైతే, లంచగొండితనం తోక ముడుస్తుంది. అవినీతి ఆలోచన మానవాళి అభివృద్ధికి గొడ్డలి పెట్టు, దేశభక్తి గొడ్డలితో అవి నీతి విష వృక్షాన్ని నిర్దయగా నరికేద్దాం. అవినీతి అంతమే యువత నినాదం కావాలి. •

# ప్రజావాక్కు



### వినూత్న కార్యక్రమాలు

పాఠశాల విద్యార్థుల్లో భూభౌగోళికఅవగాహన, స్థల నిర్ధారణ సామర్థ్యం, విశ్లేషణాత్మక ఆలోచన వంటి నైపుణ్యాలుపెంపొందించాల్సి నఅవసరంరోజురోజుకూ పెరుగుతోంది.పటాల శాస్త్రంపై ఆసక్తి కలిగించే కార్యక్రమాలు విద్యార్థులలో కొత్త అన్వేషణా భావనకు దారితీస్తాయి. ఇటీవలి కాలంలో పటాలఆధారిత ప్రశ్నోత్తర కార్యక్రమాలు, పటం పరిశీలనపై ఆధారితమైన కార్యకలాపాలుపాఠశాల స్థాయిలో మంచి స్పందనను పొందుతున్నాయి. ఇవి విద్యార్థులకు పాఠ్యపుస్తక పరిజ్ఞానాన్ని ప్రపంచంతో అనుసంధానం చేసే అరుదైన అవకాశాన్ని కల్పిస్తున్నాయి. భౌగోళిక స్థితిగతులు, దూరాల అంచనా, దిశలను గుర్తించడం, ప్రకృతి వైవిధ్యాలను పటాల రూపంలో అర్థం చేసుకోవడం వంటి అంశాలు భవిష్యత్తు విద్యా, వృత్తి రంగాల్లో కీలక పాత్ర పోషిస్తాయి. ఈ నేపథ్యంలో విద్యార్థులకు చిన్న వయసులోనే పటాల శాస్త్రంపై అవగాహన కల్పించడం అభినందనీయమైన విషయం.

- తిప్పర్తి శ్రీనివాస్, చొప్పదండి

### ఆలోచించాల్సిందే..

పాలన ఎంత బాగా చేసినా ప్రజలకు ఎన్ని సంక్షేమ పథకాలు అందించినా కొంత కాలానికి ప్రభుత్వాలపై వ్యతిరేకత రావటం సహజం. ప్రజావ్యతిరేకత కారణంతోనే రాష్ట్రాలలోప్రభుత్వాలుమారుతుంటాయి.అయితే ప్రతిపక్ష పార్టీ ప్రభుత్వాలు ఉన్న రాష్ట్రాలలోనే ఇలా జరుగుతోందని కాని బిజెపి పాలిత రాష్ట్రాలలో కాదు. ఇదంతా చూస్తుంటే ఎక్కడో ఏదో గోల్‌మాల్ జరుగుతోందని కొత్త ఓట్లను సృష్టిస్తున్నారని ఉన్న ఓట్లను మాయం చేస్తున్నారనే మాట నిజమేననిపిస్తోంది.

- ఎమ్.ఎస్.శర్మ, హైదరాబాద్

### అసత్య ప్రచారాన్ని నమ్మకూడదు

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో గెలిచేది తామేనని మా సీటు మాకే దక్కబోతోందని నవంబరు 14వ తారీఖు నుంచి బిఆర్ఎస్ దశ తిరగబోతోందని ఆ రోజు నుంచే కాంగ్రెస్ పతనం కూడా ప్రారంభం కాబోతోందని రెండేళ్ల నుంచి రేవంత్ రాష్ట్రానికి ఏమీ చేయలేదని ఎన్నికల ప్రచార సభల్లో చెప్పుకున్నారు బి.ఆర్.ఎస్‌నాయకులు.అయితే వారు అన్నవి ఏవీజరగలేదు. వారుకన్న కలలు కల్లలయ్యాయి.

- ఎం.శ్రీనివాస్, హైదరాబాద్

### భగవద్గీత గురించి తెలుసుకోవాలి

భారతదేశానికి స్వాతంత్రం సిద్ధించే నాటికి అమెరికా రష్యాలు రెండుఅద్వితీయ శక్తులుగా ఉండేవి.స్వతంత్ర భావాలతో జీవించాలనే ఉద్దేశంతో వాటికిదూరంగా ఉంటూనే శత్రుత్వం పెంచుకోకుండా రెండిట్లోని మేలువిధానాలను ఎంచుకొని అలీన విధానాన్ని రూపొందించారు ప్రథమ భారత ప్రధాని, నవభారత నిర్మాత,పండిట్ జవహర్లాల్ నెహ్రూగారు.ఇటీవల రష్యా అధ్యక్షులు పుతిన్ గారు భారత పర్యటనకు వచ్చినప్పుడు ఆయనకు నరేంద్ర మోడీ జీ భగవద్గీతను బహుకరించారు. నిజానికి భగవద్గీతను మోడీజీ ఏనాడూ చదవలేదు,చదవలేరు కూడా. ఎవరైనా చెప్తే వినడంతెప్పించి దానిని స్వతంత్రంగా అర్థం చేసుకునే శక్తి ఆయనకు లేదు. నిజానికి ఆ పుస్తకం మీద ప్రమాణం చేసి న్యాయస్థానాల్లో న్యాయాన్ని చెప్పడం కూడా అర్ధరహితమే అనిపిస్తూ ఉన్నది. ఆ పుస్తకంలో ఏముందో జడ్జిలకు కూడా తెలియదు అన్నది కఠోర సత్యం. ఇక నేరస్తులకు ,నేరస్తులనే పేరుతో బోనులో ప్రవేశపెట్టిన వారికి కూడా తెలియదన్నది కూడా నిజం. జననంఎంత సహజమో మరణం అంతే సహజం. చంపడానికి దేవుడే కారణం అని చెప్పడం అర్థరహితం.

- వీరగంట భాస్కర్ రావు, బొబ్బిలి

### శబ్దకాలుష్యాన్ని నియంత్రించాలి

భారత్ క్రికెట్‌జట్టు మ్యాచ్ గెలిచినా ఏదైనా టోర్నమెంట్‌లో కప్ కొట్టుకొచ్చినా క్రికెట్ అభిమానులు హాపీగా ఫీలవుతారు. అయితే ఆ హాపినెస్‌ని పరస్పరంఅభినందనలు తెలుపుకోవటంతోనుమిఠాయిలు పంచుకోవటంతోను ఆపేయాలి. లేదూ చిచ్చుబుడ్లు,చక్రాలు, కాకరపువ్వొత్తులు, మతాబులతోను సరిపెట్టుకోవాలి. అంతేకాని వృద్ధులు, రోగులు, మహిళలు, పసిపిల్లలు నిద్రించే సమయంలో పెద్ద శబ్దాలు వచ్చే బాంబులు, సీమటపాకాయలు పేల్చటం సరికాదు. ఒకరి సంతోషం మరొకరిని ఇబ్బంది పెట్టేలా ఉండకూడదు.

- మిథునం, హైదరాబాద్

### క్షేత్ర స్థాయి విచారణలు అవసరం

వివిధ రకాల సమస్యలు పరిష్కరించాలని ప్రజలు ప్రభుత్వ అధికారులకు ఫిర్యాదులు చేసిన దరఖాస్తుదారుని వద్దకు వెళ్లి క్షేత్ర స్థాయిలో సమస్య పరిష్కారం చేయాలి. విచారణ చేయకుండా రిపోర్ట్ రాయడం సరి కాదు. అధికారులు పరిస్థితిని ఫోటోలు తీయాలి. అడగాలి పరిశీలించి న్యాయం చేయాలి.

- రాపాక రవీందర్, జనగాం

మన వి ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్


(e-mail: editpage@vaartha.com)

# నాయకుల ఎంపికకూ వేలం పాటలా?



డాక్టర్ నీలం సంపత్

పల్లెలే దేశానికి పట్టు గొమ్మలు, స్థానిక స్వపరిపాలన ద్వారానే గ్రామాల అభివృద్ధి జరుగుతుంది. తద్వార దేశ సర్వతోముఖాభివృద్ధికి రాచబాటలు ఏర్పడతాయి.భారత దేశ ఆత్మ పల్లెల్లోనే వుంది.రాజకీయాలకు అతీతంగా గ్రామాలకు ఎన్నికలుజరిపి ఆయా గ్రామాలలో ప్రజల సర్వతోముఖాభివృద్ధికి నిస్వార్థ సేవతో కృషి చేసే సామర్థ్యంతో పని చేయాలని భావించే నాయకులనే ప్రజా ప్రతినిధులుగా ఎంపిక చేసుకునే వెసులుబాటును ప్రజలకు స్వతంత్ర ప్రతిపత్తి గలిగిన రాజ్యాంగ సంస్థ అయినఎన్నికల కమిషన్ కల్పించిన విషయం బహిరంగ రహస్యమే.ఆ ఎన్నికల ప్రక్రియలో భాగంగానే నేడు తెలంగాణ రాష్ట్రంలో గ్రామ పంచాయతీల ఎన్నికల జాతర కోలాహలంగా కొనసాగుతోంది. సదరు ఎన్నికల్లో వేలం పాటలతో విజేతల ఎంపిక జరగకుండా, సమర్థులైన అభ్యర్థులను పోటీలకు ఆహ్వానించాలి. వారిలో అత్యంత సమర్థులైన వ్యక్తులనే తమ గ్రామాలకు సర్పంచులుగా, తమ వార్డులకు సభ్యులుగా ఎన్నుకునే వెసులుబాటును ఎన్నికల కమిషన్ కల్పించాలి.ఏక గ్రీవాల ద్వారా ఆయా గ్రామాల ప్రజలందరికీ ఆమోదయోగ్యుడైన నిజాయితీ, నిబద్ధత గల నాయకుల ఎన్నిక జరిగితే అది అభినందనీయమే. ఐతే అది జరుగుతుందా? అనేది మిలియన్ డాలర్ల ప్రశ్నగా భావించక తప్పదు.నిజానికి అలా జరిగినప్పుడే సమర్థ నాయకత్వం లభించి వారి నేతృత్వంలో పంచాయతీలు ప్రగతి పథంవైపు పరుగులు పెడతాయని చెప్పక తప్పదు. తెలంగాణలోని గ్రామాలలో కొనసాగుతున్న పంచాయతీల ఎన్నికల్లో డబ్బులున్న వారే తమ ఐదేళ్ల పదవీకాలంలో ఓ యాభై లక్షలతో లేదా కోటీ, రెండు కోట్ల రూపాయలతో ఆయా గ్రామాలలో గుడులూ ,చర్చీలు, మసీదులూ, కమ్యూనిటీ హాల్స్,అంతర్గత రోడ్ల నిర్మాణం, రక్షిత మంచినీటి సదుపాయాల లాంటి సౌకర్యాలను సమకూరుస్తామనే హామీలతో గ్రామాలలో ప్రజలతో ఒప్పందాలను కుదుర్చుకుంటూ ఏకగ్రీవాలకు తెరదీస్తుండడం గమనార్హం. ఈ క్రమంలో ఒకవేళ పోటీఏర్పడితే వేలంగా మార్చి అధిక మొత్తం చెల్లిస్తామన్న వారే పదవులను చేజిక్కించుకుంటున్నారనే వార్తలుఆందోళన కలిగిస్తున్నాయి. బెదరింపులూ, బలప్రయోగాలు సైతం ఏకగ్రీవాలకు కారణమోతున్నాయనే వాదనలు కూడ వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో తొలి విడత ఎన్నికలలో 395, రెండో విడతలో 415 ఏకగ్రీవాలు ఎలాంటి ప్రలోభాలకు,బల ప్రయోగాలకు,ఒత్తిళ్లకు, బెదిరింపులకు తావు లేకుండా పూర్తి ప్రజాస్వామ్యయుతంగా జరిగినవేనని ఎన్నికల కమిషన్ చెబుతున్న వైనం పట్ల భిన్నాభిప్రాయాలు వ్యక్తమోతున్నాయి.రాజ్యాంగ నిబంధనల ననుసరించి ఎన్నికల కమిషన్ నియమాల ప్రకారం ఏ రాజకీయ పార్టీ కూడా తమపార్టీ ఎన్నికల గుర్తుతో ప్రత్యక్షంగా ఈ ఎన్నికలలో పాలుపంచుకోవడానికి వీల్లేదు. ఈ స్ఫూర్తికి విరుద్ధంగా ప్రాంతీయ,జాతీయ పార్టీలనే తేడా లేకుండా అన్ని రాజకీయ పార్టీలు పోటాపోటీగా ఈ ఎన్నికల సమరంలో పాలుపంచుకుంటూ పెద్ద ఎత్తున డబ్బులను వెచ్చిస్తూ ఏకగ్రీవాల రూపంలో వేలం పాటల



ద్వారా అధికారాన్ని చేజిక్కించుకుంటున్న వైనంతో ప్రజాస్వామ్య వ్యవస్థ ఉనికికి భంగం కలుగుందనే బుద్ధిజీవుల అభిప్రాయం ప్రాధాన్యత సంతరించుకుంటోంది.తద్వారా ధనస్వామ్యం చేతుల్లో ప్రజాస్వామ్యం బందీగా మారుతుందేమోననే భావన సర్వత్ర వెల్లువెత్తుతోంది. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 243(జి) స్థానిక స్వపరిపాలన ఉద్దేశ్యంపరిపాలన,రాజకీయ, సాంఘిక సమానత్వాన్ని సాధించడం అనే నిర్దేశాన్ని బడా నేతలు,పెత్తం దారులు తోసి రాజంటూ ధన,కుల,మత ప్రమేయంతో పెద్దఎత్తున ఏకగ్రీవాలను ప్రోత్సహిస్తుండడం ఎన్నికలలో ప్రజాస్వామ్య స్ఫూర్తికి విఘాతమే. ఈ చర్యలు అధికార, విపక్ష పార్టీల నేతల సూచనలతోనే ముందుకు సాగుతున్నవైనం బహిరంగ రహస్యమే.ఫలితంగా స్థానిక స్వపరిపాలన డబ్బులున్న వారి చేతుల్లో బందీగా మారుతుందనేది నిర్వివాదాంశమే.ఇలాంటి అప్రజాస్వామిక విధానాలను ప్రభుత్వం, న్యాయవ్యవస్థ నివారించాలంటే తెలంగాణ పంచాయతీ రాజ్ చట్టాన్ని సవరించాల్సిందేననేది న్యాయ నిపుణుల నిశ్చితాభిప్రాయం. పార్టీల సంస్థాగత ఎన్నికల తంతే ఇక్కడ కొనసాగుతోంది. విశాలమైన ప్రజల సంక్షేమం, అభివృద్ధితో పాటు స్వేచ్ఛ సమానత్వ సాధనకు సంబంధించి రాజ్యాంగ నిబంధనల స్ఫూర్తితో ధన, కుల,మత, వర్ణ, వర్గ విచక్షణకు అతీతంగా ప్రజల సమాన అభివృద్ధి కోసం ముందుకు సాగే లక్ష్యంతోనే మా రాజకీయ పార్టీని ఏర్పాటు చేస్తున్నామని ప్రకటిస్తున్న అన్ని రాజకీయ పార్టీలు, వారి పార్టీల నిర్మాణానికి సంబంధించిన సంస్థాగత ఎన్నికలలో మాత్రం ప్రజాస్వామ్య స్ఫూర్తిని తోసిరాజంటూకోట్ల రూపాయల సంపదతో పాటు, కులాలను, మతాలను,వర్ణాలను, వర్గాలనే బలమైన ప్రాతిపదికలుగా భావిస్తూ సీల్డ్‌కవర్ ద్వారానే నాయకుల ఎంపికకు పూనుకుంటున్నారు.పార్టీల నియమావళి ప్రకారంఎన్నికల తంతుని తూతూ మంత్రంగానే కొనసాగిస్తున్నాయి. ఆ అలవాటే ఈ రోజు రాష్ట్రంలో జరుగుతున్న గ్రామ పంచాయతీ ఎన్నికలలో ఏకగ్రీవాలకు, వేలం పాటలకు ఊపిరులూదుతున్నదేమోననే భావన కలుగుతుంది. రాజ్యాంగ నిబంధనలకు కట్టుబడి ధన, కుల,మత, వర్ణ, వర్గ విచక్షణకు ఆస్కారమే లేకుండా ప్రజలు తమ ఓటు హక్కులను వినియోగించుకునే విధంగా చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత ఎన్నికల కమిషన్ దే. అందులో భాగంగా మాడల్ కోడ్ మానిటరింగ్ ఆఫీసర్ల నియామకంతో పాటు స్ట్రాటజిక్ సర్వేయలెన్స్ టీమ్‌ల ఏర్పాటుకు అదనంగా మొబైల్ టీమ్‌లతో,వ్యయ పరిశీలకుల నియామకంతో నిరంతరపర్యవేక్షణలో వివిధ రకాల ఎన్నికల అక్రమాలను, ప్రలోభాలను అరికట్టే చట్టపరమైన బాధ్యతలను నిర్వర్తించే క్రమంలోఎన్నికల విధినిర్వహణలోభాగంగా మంత్రులూ,ముఖ్యమంత్రుల కాన్వాయ్‌లను సైతం ఎన్నికల అధికారులు తనిఖీ చేస్తున్నప్పటికీ ప్రలోభాల వరదలో ఎన్నికల నియమాలు కొట్టుకుపోకుండా ఆపలేకపోతున్నాయేమోనని పరిశీలకులనుకుం టున్నారు.ఒకాయన ఐదేళ్ల పాటు ఫ్రీ కేబుల్, ఉచిత వైఫై సదుపాయాలను కల్పిస్తానంటున్నాడు.మరో గ్రామంలో ఐదేళ్లపాటు ఉచితంగా క్షవరంచేస్తానని హామీఇస్తున్నాడు. ఎంత మంది నిజాయితీ పరులైన అభ్యర్థులను తమ ప్రజా ప్రతినిధులుగా ఎంపిక చేసుకుని తమతమ గ్రామాలలో వారికి అధికారాన్ని అప్పగించి గ్రామ స్వరాజ్యస్థాపన కోసం ఊపిరులూదడానికి ఓటర్లుగా తమ వివేకాన్ని ప్రదర్శిస్తారో? లేదా ప్రలోభాల వలలో చిక్కుకుని తమ ఐదేళ్ల భవిష్యత్‌ని చేతులారా తామే కాలరాచుకుంటారో? రాబోయే ఎన్నికల ఫలితాలే తేల్చి చెప్పాల్సివుంది. •

# అమెరికా, ఉక్రెయిన్ శాంతిచర్చలకు బ్రేక్!


## జెలెన్‌స్కీ ముందుకురావడం లేదంటూ ట్రంప్ వ్యాఖ్య



**ఫ్లోరిడా, డిసెంబరు 8:** ఉక్రెయిన్‌లో యుద్ధాన్ని ముగించేందుకు అమెరికా మధ్యవర్తిత్వంతో జరుగుతున్న శాంతి చర్చలకు తాత్కాలికంగా బ్రేక్ పడింది. అమెరికా ప్రతిపాదించిన శాంతి ప్రణాళికను ఉక్రెయిన్ అధ్యక్షుడు వొలొదిమిర్ జెలెన్‌స్కీ ఇంకా చదవలేదని, చర్చలను ముందుకు తీసుకెళ్లేందుకు ఆయన సిద్ధంగా లేరని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వ్యాఖ్యానించారు. ఫ్లోరిడాలో మూడు రోజుల పాటు అమెరికా, ఉక్రెయిన్ అధికారుల మధ్య చర్చలు ముగిసిన తర్వాత ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేశారు. కెన్నెడీ సెంటర్ ఆనర్స్‌కు హాజరయ్యే ముందు ఆయన మీడియాతో మాట్లాడుతూ అధ్యక్షుడు జెలెన్‌స్కీ ఇంకా ప్రతిపాదనను చదవలేదని తెలిసి నేను కాస్త నిరాశ చెందాను. ఉక్రెయిన్ అధికారులు దీన్ని ఇష్టపడుతున్నారు. కానీ, ఆయన మాత్రం సిద్ధంగా లేరని అన్నారు. రష్యా ఈ ప్రతిపాదనకు అనుకూలంగానే ఉందని తాను భావిస్తున్నట్లు ట్రంప్ తెలిపారు. ఈ విషయంపై జెలెన్‌స్కీ స్పందించారు. చర్చల్లో పాల్గొన్న అమెరికా అధికారులతో తాను ఫోన్‌లో మాట్లాడానని, పూర్తి వివరాలు తెలుసుకున్నానని వెల్లడించారు. "శాంతిని సాధించడానికి అమెరికాతో కలిసి చిత్తశుద్ధితో పనిచేయడానికి ఉక్రెయిన్ కట్టుబడి ఉంది" అని ఆయన సోషల్ మీడియాలో పేర్కొన్నారు. అయితే, శాంతికి మార్గం చాలా సంక్లిష్టంగా ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. మరోవైపు ఈ ప్రతిపాదనను రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ అధికారికంగా ఆమోదించలేదు. గత వారం ఆయన మాట్లాడుతూ, ఈ ప్రణాళికలోని కొన్ని అంశాలు ఆచరణ సాధ్యం కావని అన్నారు. కానీ, అమెరికా కొత్త జాతీయ భద్రతా వ్యూహాన్ని క్రెమ్లిన్ స్వాగతించింది. చర్చల ద్వారా సమస్యల పరిష్కారానికి మొగ్గు చూపడాన్ని తాము స్వాగతిస్తున్నామని తెలిపింది. ఈ రాజకీయ చర్చలు ఒకవైపు జరుగుతున్నప్పటికీ, ఉక్రెయిన్‌పై రష్యా దాడులు మాత్రం ఆగలేదు. వారాంతంలో జరిగిన దాడుల్లో నలుగురు మృతి చెందారు. నిన్న ఒక్కరోజే ఖార్కివ్ ప్రాంతంలో జరిగిన షెల్లింగ్‌లో ముగ్గురు పౌరులు ప్రాణాలు కోల్పోగా, మరో 10 మంది గాయపడ్డారు.

# ప్రియుడి నిర్లక్ష్యంవల్లనే పర్వతారోహకురాలు మృతి

## ఆస్ట్రియా పోలీసులు కేసు నమోదు



**వియన్నా, డిసెంబరు 8:** ఆస్ట్రియాలో అత్యంత ఎత్తైన గ్రాస్‌గ్లాక్నర్ పర్వతంపై జరిగిన ఒక విషాద ఘటనలో 33 ఏళ్ల కెర్‌స్టిన్ గర్ట్‌నర్ అనే మహిళ చలికి గడ్డకట్టి ప్రాణాలు కోల్పోయింది. ఆమె మృతికితీవ్ర నిర్లక్ష్యమే కారణమన్న ఆరోపణలపై ఆమె ప్రియుడు, అనుభవజ్ఞుడైన పర్వతారోహకుడు థామస్ ప్లాంబర్గర్ (39)పై అధికారులు హత్య కేసు నమోదు చేశారు. ఈ ఏడాది జనవరిలో కెర్‌స్టిన్, థామస్ ఇద్దరూ గ్రాస్‌గ్లాక్నర్ పర్వతాన్ని అధిరోహించడం ప్రారంభించారు. అనుకున్న సమయం కంటే రెండు గంటలు ఆలస్యంగా బయలుదేరడంతో వారు తీవ్ర ప్రతికూల వాతావరణంలో చిక్కుకున్నారు. మైనస్ 20 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత, పెనుగాలుల ధాటికి కెర్‌స్టిన్ తీవ్రంగా అలసిపోయి, నీరసించిపోయింది. పర్వత శిఖరానికి కేవలం 150 అడుగుల దూరంలో ఉండగా ఈ ఘటన చోటుచేసుకుంది. ప్రాసిక్యూటర్ల కథనం ప్రకారం తెల్లవారుజామున 2 గంటల సమయంలో థామస్ సహాయం కోసం వెళ్తున్నానని చెప్పి కెర్‌స్టిన్‌ను అక్కడే ఒంటరిగా వదిలి వెళ్లాడు. చలి నుంచి రక్షణ కల్పించేందుకు తన వద్ద ఉన్న ఎమర్జెన్సీ దుప్పట్లు లేదా ఇతర సామగ్రిని కూడా ఆమెకు ఇవ్వలేదని వారు ఆరోపించారు. సహాయక బృందాలకు సమాచారం ఇవ్వడంలో గంటల తరబడి ఆలస్యం చేయడమే కాకుండా, తొలి కాల్ తర్వాత తన ఫోన్‌ను సైలెంట్‌లో పెట్టాడని తెలిపారు. తీవ్రమైన గాలుల కారణంగా సహాయక బృందాలు మరుసటి రోజు ఉదయానికి కానీ అక్కడికి చేరుకోలేకపోయాయి. అప్పటికే కెర్‌స్టిన్ మరణించింది. ఈ కేసులో థామస్‌పై తీవ్ర నిర్లక్ష్యంతో హత్యకు పాల్పడినట్లు అభియోగాలు మోపారు. నేరం రుజువైతే అతనికి మూడేళ్ల వరకు జైలు శిక్ష పడే అవకాశం ఉంది. అయితే, ఇది కేవలం ఒక దురదృష్టకర ప్రమాదమని అతని తరఫు న్యాయవాది వాదిస్తున్నారు. ఈ కేసుకు సంబంధించిన విచారణ 2026 ఫిబ్రవరి 19న జరగనుంది.

# ఎస్సీఎస్టీలకూ క్రీమీలేయర్ వర్తింపచేయడంపై కట్టుబడి ఉన్నా!

## చీఫ్ జస్టిస్ బిఆర్ గవాయ్



**న్యూఢిల్లీ, డిసెంబరు 8:** షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలకు కూడా క్రీమీలేయర్ విధానాన్ని వర్తింపజేయాలని తాను ఇచ్చిన తీర్పుపై సొంత వర్గం నుంచే తీవ్ర విమర్శలు ఎదుర్కొన్నానని భారత మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్ వెల్లడించారు. రిజర్వేషన్ల ఫలాలు నిజంగా వెనుకబడిన వర్గాలకు చేరాలన్నదే తన ఉద్దేశమని ఆయన తన వైఖరిని గట్టిగా సమర్థించుకున్నారు. భారత ప్రధాన న్యాయమూర్తి కుమారుడికి, గ్రామ పంచాయతీ పాఠశాలలో చదివిన ఒక కూలీ కుమారుడికి ఒకే రకమైన కొలమానం వర్తింపజేయడం రాజ్యాంగం చెప్పిన సమానత్వం ఎలా అవుతుందని ఆయన ప్రశ్నించారు. రిజర్వేషన్ ప్రయోజనాలు పొంది సుప్రీంకోర్టు జడ్జి అయ్యాక, ఇప్పుడు ఇతరులకు ఆ ఫలాలు అందకుండా చేస్తున్నానని తనపై ఆరోపణలు చేశారని గవాయ్ గుర్తు చేసుకున్నారు. ఈ విమర్శలు రాజ్యాంగ నిబంధనలపై అవగాహన లేమితో చేస్తున్నారని ఆయన అన్నారు.



# నెహ్రూ సేవలకు మరకలంటించలేరు

> స్వాతంత్ర్యపోరాటంలో బిజెపి పూర్వీకులేంచేశారు?
> నెహ్రూ పేరు లేకుండా ఏ చర్చయినా జరపగలరా?
> ప్రధాని మోడీ వ్యాఖ్యలకు గౌరవ్ గగోయ్ కౌంటర్
> వందేమాతరంపై చర్చ ప్రజల దృష్టి మరల్చేవ్యూహమే: ప్రియాంకగాంధీ
> అంతా రాజకీయమేనా? ఎస్పీ అధినేత అఖిలేష్ యాదవ్

**న్యూఢిల్లీ, డిసెంబరు 8:** వందేమాతరం 150వ వార్షికోత్సవం సందర్భంగా లోక్‌సభలో నిర్వహించిన చర్చ సందర్భంగా కాంగ్రెస్ ఉప నాయకుడు గౌరవ్ గొగోయ్ ఆవేశపూరితంగా మాట్లాడుతూ బిజెపి, ఆర్ఎస్ఎస్‌పై తీవ్ర విమర్శలు చేశారు. జాతీయ గీతంపై కాంగ్రెస్ పార్టీ 1937 నిర్ణయంపై ప్రధానమంత్రి నరేంద్రమోడీ చేసిన విమర్శలకు ప్రతిస్పందిస్తూ, స్వాతంత్ర్య పోరాటానికి బిజెపి రాజకీయ పూర్వీకుల సహకారాన్ని గొగోయ్ ప్రశ్నించారు. "మీ రాజకీయ పూర్వీకులు వందేమాతరం ఉద్దేశాన్ని ఎప్పుడు నెరవేర్చారో నేను అడగాలనుకుంటున్నా? మీరు బ్రిటిషు వారికి వ్యతిరేకంగా ఎప్పుడు తిరుగుబాటు చేశారు? బెంగాల్, రవీంద్రనాథ్ ఠాగూర్ సాంస్కృతిక వారసత్వాన్ని అర్థం చేసుకోవడంలో పాలక పార్టీ విఫలమైంది" అని తీవ్ర ఆరోపణలు చేశారు. అసోంలో డి-ఓటర్ సమస్యను ఎదుర్కొంటున్న బెంగాలీల దుస్థితిని ఎత్తి చూపారు. వందేమాతరం గీతానికి కాంగ్రెస్ పార్టీ ఎంతో ప్రాధాన్యత ఇచ్చి జాతీయగీతం చేసిందని గౌరవ్ గొగోయ్ వివరించారు. చర్చ ఏదైనా జవహర్‌లాల్ నెహ్రూ పేరు వాడకుండా మోడీ ప్రసంగం ఉండటం లేదన్నారు. "వందేమాతరం గీతానికి కాంగ్రెస్ సపోర్ట్ చేసింది. ఎంతో ప్రాధాన్యతనిచ్చి జాతీయగీతం చేసింది. ప్రధాని ప్రతి డిబేట్‌లోనూ నెహ్రూ పేరు, కాంగ్రెస్ పేరు వాడుకుంటారు. ఆపరేష్ సింధూర్‌పై చర్చలో పండిట్ నెహ్రూ పేరును 14 సార్లు, కాంగ్రెస్ పేరు 50 సార్లు వాడారు. 75వ రాజ్యాంగ దినోత్సవంలో నెహ్రూ పేరు 15 సార్లు, కాంగ్రెస్ పేరు 26 సార్లు వాడారు. 2022లో రాష్ట్రపతి ప్రసంగంపై చర్చలో నెహ్రూ పేరు 20 సార్లు ఉపయోగించారు. మోడీకి, ఆయన టీమ్‌కు నేను ఒకటి చెప్ప దలచుకున్నాను. మీరెంత కష్టపడినా సరే పండిట్ నెహ్రూజీ దేశానికి అందించిన సేవలపై ఎలాంటి మరక అంటదు" అని గౌరవ్ గొగోయ్ అన్నారు. ప్రజలు ఎన్నో కష్టాలు పడుతున్నారని, వాటి గురించి ప్రధాని ఒక్క మాట కూడా మాట్లాడరని, ఢిల్లీ పేలుళ్ల ప్రస్తావనే లేదని, ఢిల్లీ అయినా పహల్గాం అయినా ప్రజలను రక్షించే పరిస్థితిలో మనం లేమని గొగోయ్ విమర్శించారు. దేశవ్యాప్తంగా విమానాల రద్దుతో రోజుల తరబడి ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారనీ, దీనిపై పౌర విమానయాన మంత్రిత్వ శాఖ ఈ సభ ద్వారా ప్రజలకు పరిస్థితిని వివరించాలని కోరారు. ప్రయాణికుల్లో అనేక మంది డయాలసిస్ పేషెంట్లు ఉన్నారని, కొందరి ఇళ్లల్లో పెళ్లిళ్లు ఉన్నాయని, వృద్ధులైన బంధువులను చూసేందుకు వెళ్తున్నవారున్నారని, జనం డబ్బులు నష్టపోతున్నారని, విమానాశ్రయాల్లో ఎక్కడ చూసిన ఈ అలజడే కనిపిస్తోందని అన్నారు.

వందే మాతరంపై చర్చను ప్రభుత్వం దృష్టి మరల్చే వ్యూహమని వయనాడ్ కాంగ్రెస్ ఎంపి ప్రియాంక గాంధీ ఆగ్రహం వ్యక్తం చేశారు. జాతీయ గీతం దేశ ఆత్మలో ఒక భాగ మని, దానిపై ఎటువంటి చర్చ జరగద న్నారు. సోమవారం లోక్‌సభలో ప్రియాంక గాంధీ మాట్లాడుతూ... బెంగాల్ అసెంబ్లీ ఎన్నికలకు ముందు కథనాన్ని ఏర్పాటు చేయడం, ప్రజల దృష్టిని మళ్లించడానికి స్వాతంత్ర్య సమరయోధులపై కొత్త ఆరోపణలు చేయడం అనే ద్వంద్వ ఉద్దేశ్యంతో అధికార పార్టీ ఈ అనవసరమైన చర్చను పిలిచిందని మండిపడ్డారు. "దేశం ఎదుర్కొంటున్న ప్రస్తుత సవాళ్ల గురించి, పేపర్ లీకేజీ లు, నిరుద్యోగం కారణంగా యువత బాధపడు తు న్నారు. పేదలకు రిజర్వేషన్లు నిరాకరించ బడు తున్నాయి. మహి ళలకు అన్యాయం జరుగుతోంది. దేశ రాజధాని ఢిల్లీలో వాయు కాలుష్యం పెరిగిపోతున్నది. ప్రభు త్వం వీటిపై చర్చించ కూడదని, గతం నుండి వచ్చిన పరిణామాలను తవ్వి ప్రజల దృష్టిని మళ్లించాలని కోరుకుంటున్నది" అని ప్రియాంక గాంధీ ఘాటుగా సమాధానమిచ్చారు. మాజీ ప్రధాని నెహ్రూపై ప్రధాని మోడీ చేసిన విమర్శలను ప్రియాంక గాంధీ తిప్పికొడుతూ, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్, సుభాస్ చంద్రబోస్ వంటి జాతీయ నాయకులు పాటపై తీసుకున్న నిర్ణయాల గురించి ప్రధానమంత్రి కీలక విషయాలను పంచుకోలేదని, కథలోని ఒకవైపు మాత్రమే ప్రస్తావించారని అభ్యంతరం వ్యక్తం చేశారు. వందేమాతరంలోని కొన్ని భాగాలను తొలగించాలనే డిమాండ్‌కు మతతత్వ మనస్తత్వం ఉందంటూ నెహ్రూ రాసిన లేఖను సభలో ప్రియాంక గాంధీ చదవి వినిపించారు. జాతీయ గీతం కాంగ్రెస్ రక్తంలోనే ఉందని, అది అలాగే ఉంటుందని, గత పరిణామాలకు సంబంధించిన వ్యర్థమైన చర్చలోకి లాగకూడదని సూచించారు. ప్రతిదీ స్వంతం చేసుకోవడానికి బిజెపి ప్రయత్నిస్తోందని, తమది ప్రత్యేకమైన జాతీయ వాదమని చెప్పుకుంటోందని సమాజ్‌వాదీ పార్టీ అధినేత, ఎంపి అఖిలేష్ యాదవ్ ఆరోపణలు గుప్పించారు. ఇది నిజానికి జాతి వ్యతిరేకమని మండిపడ్డారు. వందేమాతరం జాతీయ గీతం ప్రతి భారతీయుడిదని, దానిని రాజకీయం చేయలేమన్నారు. అధికార బిజెపిని లక్ష్యంగా చేసుకుని యాదవ్ ఆరోపణలు గుప్పించారు. "మనదేశంలోని పాలక పార్టీ

# నటికిడ్నాప్, లైంగిక వేధింపుల కేసులో నటుడు దిలీప్‌కు రిలీఫ్

## నిర్దోషి అని తేల్చిన ఎర్నాకుళం కోర్టు



**ఎర్నాకుళం, డిసెంబరు 8:** మళయాళనటి కిడ్నాప్, ఆమెపై లైంగిక దాడికి పాల్పడిన కేసు ఎనిమిదేళ్లక్రితం కేరళలో సంచలనం సృష్టించింది. ఏళ్లుగా సాగుతున్న విచారణ ఈకేసు ఇపుడు కీలక మలుపు తిరిగింది. నిందితుల్లో ఒకరైన ప్రముఖ నటుడు దిలీప్‌ను కేరళలోని ఎర్నాకుళం కోర్టు సోమవారం నిర్దోషిగా తేల్చింది. అత్యాచారం కుట్ర వంటినేరాలకింద ఆరుగురిని న్యాయస్థానం దోషులుగా తేల్చింది. మళయాళం, తమిళం తెలుగుచిత్రాల్లో నటించిన ప్రముఖ నటి 2017 ఫిబ్రరి 17న కిడ్నాప్‌కు గురయింది. ఆరోజు రాత్రి రెండు గంటలపాటు ఆమెను తన కారులోనే లైంగిక వేధింపులకు గురిచేసిన దుండగులు తర్వాత అక్కడినుంచి పారిపోయారు. కోచ్చిలో జరిగిన ఈ ఘటనలో పోలీసులు పదిమందిపై కేసునమోదుచేసారు. వారిలో దిలీప్‌కూడా ఒకరు. వారిపై కిడ్నాప్ లైంగిక వేధింపులు గ్యాంగ్‌రేప్, ఉద్దేశ్యపూర్వకంగా ఆధారాలు చెరిపివేయడం వంటి అభియోగాలకింద కేసులునమోదయ్యాయి. ఈ కేసులో 2017లో తొలిఛార్జిషీటు నమోదయింది. అదే ఏడాదిజులైలో దిలీప్ అరెస్టు అయ్యాడు. నాలుగునెలల తర్వాత బెయిల్‌పై వచ్చాడు. కేరళపోలీసులు పక్షపాతంతో వ్యవహరిస్తున్నారనిఆరోపించిన దిలీప్ సిబిఐ దర్యాప్తునకు డిమాండ్‌చేసారు. ఆ అభ్యర్థన తిరస్కరించింది. ఈకేసులో తనకు ఎలాంటిప్రమేయం లేదని చెపుతూ వచ్చిన దిలీప్ తాజాతీర్పుపై స్పందించాడు. ఇదినాపై జరిగిన కుట్ర అన్నారు.

## చిన్నారుల్లో ఏకాగ్రతను దెబ్బతీస్తున్న

# సోషల్‌మీడియా!

## స్వీడన్ శాస్త్రవేత్తల పరిశోధనలో తేలిన నిజాలు



**స్టాక్‌హోమ్, డిసెంబరు 8:** ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, స్నాప్‌చాట్ వంటి సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లపై రోజుకు అరగంటకు మించి గడిపే పిల్లల్లో క్రమేపీ ఏకాగ్రత తగ్గుతున్నట్లు తాజా అధ్యయనంలో వెల్లడైంది. దాదాపు 8,000 మందికి పైగా చిన్నారులపై నాలుగేళ్లపాటు నిర్వహించిన ఈ పరిశోధనలో ఆందోళనకరమైన విషయాలు వెలుగులోకి వచ్చాయి. స్వీడన్‌కు చెందిన కరోలిన్‌స్కా ఇన్‌స్టిట్యూట్, అమెరికాలోని ఒరెగాన్ హెల్త్ సైన్స్ యూనివర్సిటీ పరిశోధకులు సంయుక్తంగా నిర్వహించిన అధ్యయనంలో 9 నుంచి 14 సంవత్సరాల వయసున్న 8,324 మంది పిల్లల స్క్రీన్ అలవాట్లపై చేసిన సర్వేలో ఏకాగ్రత తగ్గుతున్నట్లు తేలింది. 9 ఏళ్ల వయసులో సగటున 30 నిమిషాలుగా ఉన్న సోషల్ మీడియా వాడకం, 13 ఏళ్లు వచ్చేసరికి రోజుకు 2.5 గంటలకు పెరిగింది. అనేక ప్లాట్‌ఫామ్‌లు 13 ఏళ్ల వయసును కనీస అర్హతగా నిర్దేశించినప్పటికీ, వాడకం అంతకంటే ముందే మొదలవుతున్నట్లు తేలింది. ఆసక్తికరంగా, టీవీ చూడటం లేదా వీడియో గేమ్‌లు ఆడటం వల్ల పిల్లల్లో ఏకాగ్రత లోపం కనిపించలేదని పరిశోధకులు స్పష్టం చేశారు. కేవలం సోషల్ మీడియా వాడకం మాత్రమే వారి ఏకాగ్రత సామర్థ్యాన్ని దెబ్బతీస్తున్నట్లు గుర్తించారు. ఈ పరిశోధన బృందానికి చెందిన ప్రొఫెసర్ టోర్కెల్ క్లింగ్‌బర్గ్ మాట్లాడుతూ.. "సోషల్ మీడియాలో నిరంతరం వచ్చే సందేశాలు, నోటిఫికేషన్లు పిల్లల దృష్టిని మరల్చుతాయి. ఏదైనా మెసేజ్ వచ్చిందేమోనన్న ఆలోచన కూడా వారి ఏకాగ్రతను దెబ్బతీస్తుంది. ఇదే ఈ సమస్యకు ప్రధాన కారణమని వివరించారు. పిల్లల సామాజిక, ఆర్థిక నేపథ్యం లేదా వారికి జన్యుపరంగా ఏడీహెచ్‌డీ లక్షణాలు ఉన్నాయాఅనే దానితో సంబంధం లేకుండా ఈ ప్రభావం కనిపిస్తోందని తెలిపారు. ఇప్పటికే ఏకాగ్రత లోపంతో బాధపడే పిల్లలు సోషల్ మీడియాను ఎక్కువగా వాడటం లేదని, సోషల్ మీడియా వాడకమే ఏకాగ్రత లోపానికి దారితీస్తోందని స్పష్టమైంది. వ్యక్తిగతంగా ఒక్కో చిన్నారిపై ఈ ప్రభావం తక్కువగా అనిపించినప్పటికీ, జనాభా స్థాయిలో చూస్తే ఇది సమాజంపై గణనీయమైన ప్రభావం చూపుతుందని పరిశోధకులు హెచ్చరించారు. ఈ అధ్యయన వివరాలు పీడియాట్రిక్స్ ఓపెన్ సైన్స్ జర్నల్‌లో ప్రచురితమయ్యాయి.

# సంక్షిప్తంగా..

## భారత్‌తో యుఎస్ బలమైన బంధంతోనే చైనాపై ఆధిపత్యం



**వాషింగ్టన్, డిసెంబరు 8:** ఇండో-పసిఫిక్ ప్రాంతంలో చైనాతో జరుగుతున్న వ్యూహాత్మక పోటీలో ఆధిపత్యం పొందేందుకు భారత్‌తో సంబంధాలు బలోపేతం చేసుకోవాలని అమెరికా వార్షిక డిఫెన్స్ పాలసీ బిల్లు పేర్కొంది. 'ది నేషనల్ డిఫెన్స్ ఆథరైజేషన్ యాక్ట్-2026ను కాంగ్రెషనల్ నాయకులు ఆదివారం విడుదల చేశారు. దీనిలో అమెరికా రక్షణ మంత్రి భారత్‌తో డిఫెన్స్ రంగంలో భాగస్వామ్యాన్ని మరింత ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. ఇందుకోసం విదేశాంగ శాఖ మంత్రితో సమన్వయం చేసుకోవాలని వెల్లడించింది. అప్పుడే ఇండో-పసిఫిక్‌లో చైనాపై ఆధిపత్యం సాధ్యమవుతుందని వెల్లడించారు. ఇందుకు క్వాడ్ కూటమి వంటివి ఉపయోగపడతాయని వెల్లడించింది. అమెరికా విదేశాంగ మంత్రి యుఎస్-ఇండియా స్ట్రాటజిక్ సెక్యూరిటీ డైలాగ్ వంటి సంప్రదింపుల వ్యవస్థను ఏర్పాటు చేయాలని సదరు బిల్లులో పేర్కొంది. ఇది భారత్-అమెరికా మధ్య 2008లో జరిగిన పౌర అణుఒప్పంద పురోగతిని సమీక్షించాలని సూచించింది. ఇక ఈ చట్టం అమల్లోకి వచ్చిన 180 రోజుల్లో అమెరికా విదేశాంగ మంత్రి సంయుక్త అంచనాలను నివేదిక రూపంలో ఇవ్వాలని సూచించింది.

## హరిద్వార్ శౌర్యయాత్రలో ఉద్రిక్తతలు



**హరిద్వార్, డిసెంబరు 8:** ఉత్తరాఖండ్‌లోని హరిద్వార్‌లో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. భజరంగ్ దళ్ నిర్వహించిన శౌర్య యాత్రపై గుర్తుతెలియని వ్యక్తులు రాళ్లు రువ్వడంతో జ్వాలాపూర్ ప్రాంతంలో వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది. సమాచారం అందుకున్న పోలీసులు, ఉన్నతాధికారులు వెంటనే ఘటనాస్థలానికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. భజరంగ్ దళ్ ఆదివారం సాయంత్రం హరిద్వార్‌లోని మూడు వేర్వేరు ప్రాంతాల నుంచి శౌర్య యాత్రను ప్రారంభించింది. ఈ యాత్ర జ్వాలాపూర్‌లోని రామ్ చౌక్ వద్దకు చేరుకోగానే కొందరు దుండగులు రాళ్లతో దాడి చేసినట్లు అధికారులు తెలిపారు. ఈ ఘటనతో ఆగ్రహానికి గురైన భజరంగ్ దళ్ కార్యకర్తలు ఆందోళనకు దిగారు. ఇంతలో కొందరు కార్యకర్తలు బుల్డోజర్‌తో అక్కడికి చేరుకోవడంతో ఉద్రిక్తత మరింత పెరిగింది.

## కర్ణాటక సిఎం సిద్దరామయ్యకు సుప్రీం నోటీసులు



**బెంగళూరు, డిసెంబరు 8:** కర్ణాటక రాష్ట్రంలో ముఖ్యమంత్రి మార్పు అంశంపై చర్చ జరుగుతున్న వేళ, సీఎం సిద్ధరామయ్యకు సుప్రీంకోర్టు నోటీసులు జారీ చేసింది. గత అసెంబ్లీ ఎన్నికల్లో వరుణ నియోజకవర్గం నుంచి ఆయన ఎన్నికను సవాల్ చేస్తూ కె. శంకర అనే వ్యక్తి ఈ పిటిషన్ దాఖలు చేశారు. 1951 ప్రజాప్రాతినిధ్య చట్టంలోని నిబంధనల ప్రకారం సిద్ధరామయ్య అవినీతి కార్యకలాపాలకు పాల్పడ్డారని, వరుణ అసెంబ్లీ నుంచి ఆయన ఎన్నిక చెల్లదని ప్రకటించాలని పిటిషనర్ కర్ణాటక హైకోర్టును ఆశ్రయించారు. ఆ అభ్యర్థనను న్యాయస్థానం తిరస్కరించడంతో, ఆయన సుప్రీంకోర్టుకు వెళ్లారు. తాజాగా, శంకర పిటిషన్‌పై సమాధానం ఇవ్వాలని సిద్ధరామయ్యకు జారీ చేసిన నోటీసుల్లో పేర్కొంది.

## థాయ్ - కంబోడియా సరిహద్దుల్లో మళ్లీ ఘర్షణలు : సైనికుని మృతి



**బ్యాంకాక్, డిసెంబరు 8:** థాయ్‌లాండ్-కంబోడియా సరిహద్దుల్లో మరోసారి ఘర్షణలు భగ్గుమన్నాయి. ఉబోన్ రాట్చథాని ప్రావిన్స్‌లో థాయ్ దళాలపై కంబోడియా కాల్పులు జరిపాయి. దీంతో థాయ్ సైన్యం వైమానిక దాడులకు దిగింది. కంబోడియా పోస్టులు, ఆయుధ డిపోలే లక్ష్యంగా బాంబుల వర్షం కురిపించారు. ఈ క్రమంలో సరిహద్దుల్లో మరోసారి ఘర్షణలు చోటుచేసుకున్నాయి. ఈ ఘర్షణల్లో ఓ థాయ్ సైనికుడు మృతి చెందినట్లు థాయ్ సైన్యం వెల్లడించింది. ఈ ఘర్షణలకు సంబంధించి ఇరు పక్షాలు పరస్పరం విమర్శలు చేసుకుంటున్నాయి. కంబోడియా సైన్యం తొలుత దాడులను మొదలు పెట్టినట్లు థాయ్ అధికారులు చెబుతుండగా..ఈ వాదనను కంబోడియా ఖండించింది. థాయ్ దళాలే తొలుత కాల్పులు జరిపినట్లు కంబోడియా రక్షణ మంత్రిత్వ శాఖ తెలిపింది.

# సిద్ధూ భార్యను మెంటల్ ఆసుపత్రిలో చేర్పించాలి!

## కర్ణాటక డిప్యూటి సిఎం డికెశివకుమార్



**బెంగళూరు, డిసెంబరు 8:** పంజాబ్ ముఖ్యమంత్రి పదవి కోసం కాంగ్రెస్ పార్టీలో తీవ్ర పోటీ ఉందని, రూ.500 కోట్లు చెల్లిస్తే ఎవరైనా ముఖ్యమంత్రి కావొచ్చని కాంగ్రెస్ నేత నవజ్యోత్ సింగ్ సిద్ధూ భార్య నవజ్యోత్ కౌర్ సంచలన ఆరోపణలు చేశారు. కాంగ్రెస్ పార్టీలో ఐదారుగురు సీనియర్ నేతలు ఆ పదవిని ఆశిస్తున్నారని చెబుతూ సిద్ధూను వారు ఎదగనివ్వడం లేదని ఆరోపించారు. రూ.500 కోట్లు ఇచ్చే స్థోమత తమకు లేకపోవడంతో సిద్ధూకు సీఎం సీటు దక్కలేదని ఆమె చెప్పారు. ఈ వ్యాఖ్యలు అటు పంజాబ్ తో పాటు ఇటు కాంగ్రెస్ పార్టీలోనూ సంచలనంగా మారాయి. నవజ్యోత్ కౌర్ చేసిన ఆరోపణలపై బీజేపీ నేతలు స్పందిస్తూ పంజాబ్ సీఎం పోస్టుకే 500 కోట్లు ఉంటే కర్ణాటక సీఎం పోస్టుకు ఎంత చెల్లించాలో అంటూ ప్రశ్నిస్తున్నారు. ఈ నేపథ్యంలో నవజ్యోత్ కౌర్ ఆరోపణలు, బీజేపీ నేతల విమర్శలపై కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ స్పందించారు. సీఎం పోస్టుకు కోట్లు చెల్లించాలన్న వ్యాఖ్యలను ఖండిస్తూ అలాంటి ఆరోపణలు చేసిన వారిని వెంటనే మెంటల్ హాస్పిటల్ లో చేర్పించాలని అన్నారు. ఓ మంచి పిచ్చాసుపత్రి చూసి వారిని అందులో చేర్పించాలని, మంచి వైద్యం అందేలా చూడాలని డీకే శివకుమార్ వ్యాఖ్యానించారు. ఆమెను మంచి మానసిక ఆసుపత్రిలో చేర్చాల్సి అన్నారు. డీకే శివకుమార్ సోమవారం కర్ణాటక గవర్నర్ గులాబ్ చంద్ కటారియాను కలిశారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎవరైనా డబ్బులు డిమాండ్ చేశారా అని ప్రశ్నించగా అందులో ఏమాత్రం నిజం లేదన్నారు. రూ.500 కోట్ల సూట్‌కేస్ ఇచ్చినవారు మాత్రమే సీఎం అవుతారనడంలో అర్థం లేదన్నారు. ఆమె చేసిన వ్యాఖ్యలల్లో నిజం లేదన్నారు.

# శ్రీకృష్ణుని పెళ్లాడిన యువతి! బరాత్, వైభవంగా వేడుక

**లక్నో, డిసెంబరు 8:** ఉత్తరప్రదేశ్‌లోని బదౌన్‌కు చెందిన యువతి ఏకంగా శ్రీకృష్ణుడినే పెళ్లాడింది. అమితంగా ఆరాధించే యువతి, సాక్షాత్తూ ఆ శ్రీకృష్ణుడినే భర్తగా ప్రకటించుకుంది. గ్రామమంతా తరలివచ్చి ఈ పెళ్లి తంతును ఆసక్తిగా తిలకించడం విశేషం. బుడాన్ జిల్లాకు చెందిన 28 యేళ్ల మహిళ హిందూ సంప్రదాయ వేడుకలో కృష్ణుడి విగ్రహాన్ని వివాహం చేసుకోవడం విస్తృత చర్చకు దారితీసింది. పోస్టు గ్రాడ్యుయేట్ అయిన పింకీశర్మ కుటుంబం, బంధువులు, గ్రామ నివాసితుల సమక్షంలో సంప్రదాయబద్ధంగా ఈ వివాహ తంతు ముగించారు. ఇస్లాంనగర్ పోలీసు స్టేషన్ పరిధిలోని బ్యెయూర్ కాశీమాబాద్ గ్రామంలో జరిగిన ఈ ప్రత్యేకమైన వేడుక పలువురి దృష్టిని ఆకర్షించింది. దైవిక వరుడితో సంప్రదాయ వివాహం ఈ సందర్భంగా పింకీ ఇంటిని అలంకరించారు. ఆమె సమీప బంధువు ఇంద్రేష్‌కుమార్ వరులి అలంకరించిన శ్రీకృష్ణుడి విగ్రహాన్ని వివాహ మండపానికి తీసుకొని వచ్చారు. దాదాపు 125 మందితో ఊరేగింపుగా తరలివచ్చారు. పింకీ విగ్రహాన్ని తన చేతులతో ఎత్తుకొని ఆచారాల కోసం వేదికపైకి అడుగుపెట్టింది. ఆమె దేవుడితో దండలు మార్చుకుంది. తరువాత సిందూర వేడుక జరిగింది. వేడుకల్లో భాగంగా బృందావనం నుంచి వచ్చిన కళాకారులు భక్తి నృత్యాలు చేశారు. మొత్తం గ్రామమంతా వివాహ విందును సిద్ధం చేశారు. పింకీ ఏడు సంప్రదాయ వివాహ రౌండ్ల కోసం కృష్ణ విగ్రహాన్ని మోసుకెళ్లి పవిత్ర అగ్ని చుట్టూ ప్రదక్షిణ చేసింది. వీడ్కోలు వేడుక మరుసటి రోజు ఉదయం జరిగింది. ప్రస్తుతం ఆమె తన తల్లిదండ్రుల ఇంట్లో నివసిస్తోంది. దాదాపు నాలుగు నెలల క్రితం, ఆమె దైవిక జోక్యంగా భావించిన ఒక అనుభవాన్ని అనుభవించిందట. బాంకే బిహారీ ఆలయంలో ప్రసాదం స్వీకరిస్తున్నప్పుడు, ఒక బంగారు ఉంగరం ఆమె కండువాలో పడింది. దీంతో ఇది వరమని పింకీ నమ్మింది. అందుకే తానిక ఏ మానవుడిని వివాహం చేసుకోనని, కృష్ణుడిని మాత్రమే వివాహం చేసుకుంటానని నిర్ణయించుకుంది. ఇటీవల అనారోగ్యంగా ఉన్నప్పుడు బృందానం ద్వారా బరువైన కృష్ణ విగ్రహాన్ని మోసుకెళ్లి గోవర్ధన పరిక్రమను పూర్తిచేసిన



తర్వాత కోలుకుంది. ఇది తన వివాహానికి మరొక సంకేతంగా భావించిదట. తన జీవితం దేవునికి అంకితమని పింకీ వెల్లడించింది. తన జీవితంలో విద్యతోపాటు, భక్తి, కృష్ణుడికి లొంగిపోవడంతోనే తనకు శాంతి అని తెలిపింది. కాగా ఇలా కృష్ణుడ్ని వివాహమాడిన ఘటనలు యుపిలో గతంలోనూ కూడ నమోదయ్యాయి.



ఎమ్మెల్యే మాధవి ప్రోటోకాల్ వివాదం

# ప్రివిలేజ్ కమిటీ గరంగరం

## - తప్పును అంగీకరించి కమిటీకి సూపరింటెండెంట్ క్షమాపణలు

విజయవాడ, డిసెంబరు 8 ప్రభాతవార్త ప్రతినిధి: కడప ఎమ్మెల్యే రెడ్డప్పగారి మాధవి విషయంలో ప్రోటోకాల్ పాటించడంలో నిర్లక్ష్యంపై పివిలేజ్ కమిటీ విచారించింది. అసెంబ్లీ కమిటీ హాల్‌లో ప్రివిలేజ్ కమిటీ సోమవారం సమావేశమైంది. ప్రివిలేజ్ కమిటీ ఛైర్మన్ పితాని సత్యనారాయణ నేతృత్వంలో జరిగిన ఈ సమావేశంలో కడప ఎమ్మెల్యే రెడ్డప్పగారి మాధవి విషయంలో ప్రోటోకాల్ పాటించడంలో నిర్లక్ష్యంపై కమిటీ విచారించింది. రిమ్స్‌లో క్యాథ్‌ల్యాబ్ ప్రారంభోత్సవ శిలా ఫలకంలో ఎమ్మెల్యే పేరు లేకపోవడంపై చర్చ జరిగింది. ఈ వ్యవహారానికి సంబంధించి అప్పటి మెడికల్ సూపరింటెండెంట్, డీఆర్వోను కమిటీ ప్రశ్నించింది. గత వాయిదాకు ఇరువురు హాజరుకాకపోవటంపై తీవ్రంగా మందలించింది. ప్రభుత్వం మారిందనే స్పృహ లేకుండా పనిచేస్తున్నారా? అని కమిటీ మండిపడింది. తీరు మారకుండా ఎమ్మెల్యేల పట్ల అగౌరవంగా ఉంటున్నారని కమిటీకి మాధవీ రెడ్డి ఫిర్యాదు చేశారు. జరిగిన తప్పును అంగీకరించి కమిటీకి నాటి సూపరింటెండెంట్ క్షమాపణలు చెప్పారు. తప్పు పునరావృతం కాకుండా చూసుకుంటానని హామీ ఇచ్చారు. అయితే ఈ వ్యవహారంపై పొంతన లేని సమాధానాలు చెప్పిన నాటి డీఆర్వోపై కమిటీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. మరోసారి విచారణకు రావాలని ఇరువురునీ ఆదేశించింది. అలాగే 2019- 24 మధ్య ఎమ్మెల్యేగా తనకు జరిగిన ప్రోటోకాల్ ఉల్లంఘనలపై జోగేశ్వరరావు ఇచ్చిన ఐదు ఫిర్యాదులపైనా కమిటీ చర్చించింది. ఐదు ఫిర్యాదులపై నాటి అసెంబ్లీ సిబ్బంది నోటీసులు కూడా పంపకపోవటంపై కమిటీ ఆగ్రహం వ్యక్తం చేసింది. నాటి ప్రభుత్వ పెద్దల ఒత్తిడికి తలొగ్గే ప్రోటోకాల్ పాటించలేకపోయామని అధికారులు వివరణ ఇచ్చారు. కమిటీని క్షమాపణలు కోరి, తప్పు పునరావృతం కాకుండా చూసుకుంటామని అధికారులు హామీ ఇచ్చారు.

# రోడ్డెక్కిన 'కలువాయి సేవ్'

**• రోజురోజుకు ఉధృతమౌతున్న నిరసనలు • దాచూరు గ్రామపంచాయతీ ఏకగ్రీవ తీర్మానం • నేడు ఎమ్మెల్యేను కలవనున్న జెఏసి నేతలు**




కలువాయి (నెల్లూరు), డిసెంబరు 8 ప్రభాతవార్త: "కలువాయి సేవ్" తిరుపతి మాకొద్దు- నెల్లూరు జిల్లానే ముద్దు అనే నినాదంతో జెఏసి ఆద్వర్యంలో నిర్వహిస్తున్న ఈకార్యక్రమాలకు నిరసన కారులు పెద్దఎత్తున చేరుకొని నిరసనలు తెలియజేస్తు న్నారు. సోమవారం స్ధానిక బస్టాండ్ సెంటర్ నందు అన్ని వర్గాల వారు నల్ల బ్యాడ్జిలు దరించి బైటాయించి నిరసన తెలిపారు. అదే విధంగా ప్రధాన రోడ్లపై చేరుకొని ఒంటి కాలితో నిరసన తెలుపుతు నినదించారు. కలువాయి మండలాన్ని నెల్లూరు జిల్లాలోనే ఉంచాలన్న నినాదంతో బస్టాండ్ కూడలి హోరెత్తింది. ఈ సందర్భంగా నిరసన కారులు మాట్లాడుతు ప్రజాభిప్రాయం లేకుండా విభజన ఎలా చేస్తారని వారు ప్రశ్నించారు. వీరితోపాటు మండలంలోని వికలాంగులు యూనియన్ సభ్యులు సేవ్ కలువాయి నినాదంతో బైటాయించారు. మండలంలోని దాచూరు,పర్లకొండ, చీపినాపి, కేశమనేనిపల్లి గ్రామాలతోపాటు పలు పంచాయితీల సర్పంచ్‌లు ఏకగ్రీవ తీర్మానంతో నెల్లూరు జిల్లాలోనే కలువాయి మండలాన్ని కొనసాగించాలంటూ తీర్మానం చేస్తూ గ్రామాలలో సంతకాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు.

### దాచూరు సర్పంచ్ ఏకగ్రీవ తీర్మానం

ఈ సందర్భంగా దాచూరు సర్పంచ్ రాజుల అనురాధ సచివాలయంలో సమావేశం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం కలువాయి మండలాన్ని నెల్లూరు జిల్లా నుండి తిరుపతి జిల్లాకు మార్చలనుకోవడం దారుణమని అమె ఖండించారు. ఆత్మకూరు రెవిన్యూ డివిజన్ నుండి గూడూరు రెవిన్యూకి డివిజన్‌కు కలువాయిని మారుస్తూ గెజిట్ నోటిపికేషన్ విడుదల చేయడం పట్ల ప్రజలు ఆందోళనకు గురౌతున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలకు అన్ని విధాలా తీవ్ర నష్టాన్ని గురిచేసే ఈ విభజన కార్యక్రమాన్ని ప్రభుత్వం స్పందించి విరమించుకోవాలని ఆమె డిమాండ్ చేశారు. కలువాయి మండలాన్ని నెల్లూరు జిల్లాలోనే కొనసాగే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు.

వెంకటగిరి శాసనసభ్యులు కురుగొండ్ల రామకృష్ణను నేడు కలువాయి జెఏసి నాయకుల ఆద్వర్యంలో అన్ని వర్గాల వారు కలిసి కలువాయి సేవ్ నినాదాన్ని ఆయనకు తెలియజేయనున్నట్లు వారు తెలిపారు.




బిసిఎస్ స్పోర్ట్స్ మీట్ ప్రారంభోత్సవ సభలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్

# బాలచైతన్య స్ఫూర్తి క్రీడోత్సవాలు షురూ!

జగ్గయ్యపేట, డిసెంబరు 8 ప్రభాతవార్త: క్రీడలపట్ల ఆసక్తి, యువతకు నైతిక విలువలు తెలియజెప్పే కార్యక్రమాలు, పర్యావరణ పరిరక్షణకు నడుంబిగించటం, ఆత్మస్థైర్యంలో వృద్ధిలోకి తీసుకురావాలనే తపనతో ఈ ఎమ్మెల్యే సొంత ఖర్చుతో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల బాలలతో మూడు రోజుల క్రీడోత్సవాలను నిర్వహిస్తున్నారు. ఎన్‌టిఆర్ జిల్లా జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) సొంత ఖర్చుతో 14వ సంవత్సరం కూడా చేపట్టిన బాలచైతన్య స్ఫూర్తి (బిసిఎస్) క్రీడోత్సవాలు సోమవారం స్థానిక జిల్లా పరిషత్ బాలుర హైస్కూలు క్రీడా మైదానంలో ఘనంగా ప్రారంభమయ్యాయి. ప్రైవేట్, ప్రభుత్వ విద్యాసంస్థలలకు చెందిన వేలాదిమంది బాలలు ఈక్రీడోత్సవాల్లో తమ ప్రతిభను చాటుతున్నారు. స్పోర్ట్స్ కమిటి కోఆర్డినేటర్ ఎం.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పిఇటీలు తమ టీమ్స్‌ను ఈస్పోర్ట్స్ మీట్‌లో ప్రవేశపెట్టారు. తొలుత ఎమ్మెల్యే తాతయ్య జ్యోతి ప్రజ్వలనచేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ క్రీడల ద్వారా బాలల్లో పోరాటపటిమ పెరుగుతుందన్నారు. నవ్యాంధ్ర నిర్మాణం కోసం సమాజంలోని అందరికి కలుపుకుపోతూ సమగ్ర వ్యక్తిత్వ వికాసంతో బాలలు ఉత్తమ పౌరులుగా ఎదగాలన్నారు. బాలల్లో క్రీడా నైపుణ్యం-స్ఫూర్తిని పెంపొందించటం, పర్యావరణ పరిరక్షణపై అవగాహన కలిగించటం, నైతిక విలువలను ఆచరింపజేయటం లక్ష్యంగా శ్రీగురుధామ్ వ్యవస్థాపకులు, ప్రముఖ తాత్వికులు గెంటేల వెంకటరమణ ప్రేరణతో తాను 2008 నుండి బాలచైతన్యస్ఫూర్తితో (బిసిఎస్) కొనసాగిస్తున్నట్లు వివరించారు. ఈక్రీడోత్సవాలను నిర్వహించేందుకు ప్రైవేట్, ప్రభుత్వ విద్యాసంస్థల ప్రతినిధులు అందిస్తున్న తోడ్పాటు మరువలేనిదన్నారు. ప్రముఖ తాత్వికులు గెంటేల వెంకటరమణ బాలచైతన్య స్ఫూర్తి (బిసిఎస్) స్పోర్ట్స్ మీట్ ఏర్పాటుచేయటంలో స్థానిక ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) చేస్తున్న కృషి అభినందిస్తూ శుభ సందేశం పంపారు. సభలో మాజీ మున్సిపల్ ఛైర్మన్ శ్రీరాం సుబ్బారావు, ఉభయ తెలుగు రాష్ట్రాల సీనియర్ న్యాయవాది గెంటేల అశోక చక్రవర్తి, గోపాలకృష్ణ సొసైటీ అధ్యక్షులు దూళిపాళ లక్ష్మణరావు, నేతలు యలమంచిలి రాఘవేంద్రరావు (రాఘవ), కట్టా వెంకటనరసింహారావు, కన్నెబోయిన రామలక్ష్మి, కంచేటి గీతారాణి, కానూరి కిషోర్, ఎంఇఓ చిట్టిబాబు, హెచ్‌ఎం పి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## సీనియర్ పాత్రికేయుడు అన్నాప్రగడ శివరామకృష్ణ ప్రసాద్ మృతి



విజయవాడ, డిసెంబరు 8 ప్రభాతవార్త ప్రతినిధి: సుప్రసిద్ధ రచయిత, సీనియర్ పాత్రికేయుడు అన్నాప్రగడ శివరామకృష్ణ ప్రసాద్ (ఏఎస్ఆర్ ప్రసాద్) మృతి చెందారు. ఆర్‌ఎస్ఎస్ క్రియాశీలక కార్యకర్త, బిజెపి కృష్ణా జిల్లా శాఖ వ్యవస్థాపక సంస్థాగత కార్యదర్శిగా వ్యవహరించిన ఏఎస్ఆర్ ప్రసాద్(72) గత రాత్రి బాగా పొద్దుపోయిన తరువాత మరణించారు. వృత్తిరీత్యా ఆడిటర్ అయిన ఏఎస్ఆర్ ప్రసాద్ గుంటూరు జిల్లా ప్రాంతం నుంచి వచ్చి ఎన్టీఆర్ జిల్లా నందిగామలో స్థిరపడ్డారు. అనంతర కాలంలో హైదారాబాద్‌కు మకాం మార్చారు. జాగృతి, జనసందేశ్ పత్రికల్లో ఆయనది క్రియాశీలక బాధ్యత. ఇప్పటికి బిజెపి అధికార పత్రిక జనసందేశ్‌కు కార్యనిర్వాహక సంపాదకునిగా ఉన్నారు. దగ్గరదగ్గర 30 దశాబ్దాలు ఆయన ఒక దినపత్రికలో విలేకరిగాను పనిచేసారు. సుపప్రసిద్ధ చలనచిత్ర సంగీత దర్శకుడు, గాయకుడు మాధవపెద్ది రమేష్‌కు ప్రసాద్ వియ్యంకుడు. ఆయన పెద్ద కుమారుడు చలనచిత్ర రంగంలో కీబోర్డు ఆపరేటర్‌గా మంచి గుర్తింపు పొందారు, ద్వితీయ కుమారుడు చిత్రకారునిగా గుర్తింపు పొందారు ప్రసాద్‌కు కుమార్తె ఉంది. ఆర్‌ఎస్ఎస్, బిజెపి ప్రచారగీతాలెన్నో రాసిన ప్రసాద్, దివంగత చలనచిత్ర గీత రచయిత విశ్వమోహినికి కావ్యానికి రాసిన పీఠిక గత శతాబ్దం 90వ దశకంలో సంచలనాత్మకమైంది. హోమియో వైద్యం చేయడంలో దిట్టయిన ప్రసాద్ మృతి పట్ల పలువురు తీవ్ర సంతాపం వ్యక్తం చేసారు.

# విగ్రహాల ఏర్పాటుపై బందరులో ఉద్రిక్తత

## - పోటాపోటీగా టిడిపి, బిజెపి శ్రేణుల ఆందోళన



విజయవాడ, డిసెంబరు 8 ప్రభాతవార్త ప్రతినిధి: కృష్ణా జిల్లా కేంద్రం మచిలీపట్నంలో టిడిపి, బిజెపి వర్గాల మధ్య తమ నాయకులు విగ్రహాల విషయంలో వివాదం తలెత్తింది. ఎన్టీఆర్, వాజ్ పేయీ పేర్ల వివాదం తలెత్తింది. ప్రస్తుతం రాష్ట్రంలో కూటమి సర్కార్ అధికారంలో ఉంది. ఇందులో టిడిపి, బిజెపి భాగస్వాములుగా ఉన్నాయి. అయితే పట్టణంలోని ఎన్టీఆర్ సర్కిల్ కు వాజ్ పేయి పేరు పెట్టాలని బిజెపీ నిర్ణయించింది. దీనిపై టిడిపి నేతలు మండిపడుతున్నారు. ఈ ప్రయత్నాలపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ వారు నిరసనకు దిగారు. మచిలీపట్నంలోని న్యూహౌసింగ్ బోర్డు వద్ద దివంగత మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్ పేయి విగ్రహ నిర్మాణానికి తాజాగా స్థానిక బిజెపి నేతలు పావులు కదుపుతున్నారు. ఇందులో భాగంగా వారు అక్కడే ఉన్న ఎన్టీఆర్ సర్కిల్ లో ఆ విగ్రహం తీసేసి వాజ్ పేయ్ విగ్రహం తయారు చేయించి పెట్టాలని భావించారు. ఇందుకోసం వాజ్ పేయ్ విగ్రహ నిర్మాణానికి శంకుస్థాపనకు ప్లాన్ చేశారు. దీన్ని చివరి నిమిషంలో టిడిపి నేతలు అడ్డుకున్నారు. రాష్ట్రంలో అధికార టిడిపి, కేంద్రంలో అధికార బిజెపి మధ్య ఇలా విగ్రహాల విషయంలో వివాదం చోటు చేసుకోవడం ఇదే తొలిసారి. కూటమిలో భాగస్వాములుగా ఉన్న ఇరు పార్టీల మధ్య రాష్ట్రంలో గతంలో ఎక్కడా ఇలాంటి వివాదం చోటు చేసుకోలేదు. కేవలం పార్టీలు, నేతల మధ్య వివాదాలు కాస్తా ఇప్పుడు విగ్రహాల వరకూ రావడంతో బందరులో ఏం జరుగుతుందని ఇరు పార్టీల సీనియర్ నాయకులు తెలుసుకుంటున్నారు.



హుండీ లెక్కింపులు పర్యవేక్షిస్తున్న ఇఓ, ఛైర్మన్లు

# దుర్గమ్మ హుండీ ఆదాయం రూ.5 కోట్లు

## - నూతన లడ్డూపోటు ప్రారంభం

## - భవానీ దీక్షల ఏర్పాట్లు పరిశీలించిన ఆర్‌డిఓ

ఇంద్రకీలాద్రి, డిసెంబరు 8 ప్రభాతవార్త: దుర్గమ్మవారి ఆలయంలో సోమవారం సంకటహర చతుర్థి సందర్భంగా శ్రీ గణేశునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శివాలయం వద్ద వున్న పాత యాగశాలలో గణేశునికి అభిషేకాది పూజాదికాలు నిర్వహించారు. ఇఓ, ఛైర్మన్‌లు పాల్గొన్నారు. దుర్గమ్మ వారి ఆలయంలో భక్తులు హుండీల ద్వారా 26 రోజుల్లో సమర్పించిన కానుకలను సోమవారం లెక్కించగా రు.5,22,18.647ల నగదు, 415 గ్రాముల బంగారం, 7కెజిల 465గ్రాముల వెండితో పాటు యుఎస్ఏ డాలర్లు 489, సింగపూర్ డాలర్లు 109, కెనడా డాలర్లు 125, యుఎఇ దిర్హామ్స్ 860, సౌదీ రియాల్స్ 125, మలేషియా రింగెట్స్ 4, ఖతార్ రియాల్స్ 3, ఆస్ట్రేలియా డాలర్లు 105, ఇంగ్లాండ్ పౌండ్లు 10, స్టెర్లింగ్ పౌండ్లు 10, మాల్దీవులు రుపియా 20, బహ్రెయిన్ దినార్ 1, యూరప్ యూరోలు 20 లభించాయని ఇఓ వికె శీనా నాయక్ తెలిపారు. లెక్కింపు లను ఇఓ, ఛైర్మన్ బొర్రా రాధాకృష్ణ, పాలకమండలి వారు పర్యవేక్షించారు.

### నూతన లడ్డూపోటు ప్రారంభం



సంకటహర చతుర్థి పూజల్లో గణేశునికి అభిషేకం నిర్వహిస్తున్న దృశ్యం

శ్రీ దుర్గమ్మ వారి ఆలయంలో సోమవారం నూతన లడ్డూపోటును ఇఓ వికె శీనా నాయక్ లాంఛనంగా ప్రారంభించారు. ఆలయ స్థానాచార్యులు వి. శివప్రసాద్, అర్చక బృందం వేద మంత్ర పఠనాల నడుమ ప్రత్యేక పూజాదికాలు నిర్వహించారు. ఈఓ కొబ్బరికాయ కొట్టి పోటును ప్రారంభించారు. అనంతరం శీనా నాయక్ మాట్లాడుతూ భవానీ దీక్షలకు తరలివచ్చే భక్తులకు రుచికరమైన శ్రీ అమ్మవారి లడ్డూ ప్రసాదం అందించడానికి ఈ పోటు సిద్ధం చేశామన్నారు. దుర్గమ్మవారి ఆలయంలో జరిగే నిత్యాన్నదాన పథకానికి రు.1,00,023ల విరాళాన్ని విశాకపట్నంకు చెందిన కె వరప్రసాద్ కుటుంబసభ్యులతో కలిసి అందించారు.

### ముమ్మరంగా భవానీ దీక్షల విరమణల ఏర్పాట్లు

దుర్గమ్మవారి ఆలయంలో ఈనెల 11 నుండి 15 వరకు జరగబోయే శ్రీ భవానీ దీక్షల విరమణలకోసం త్వరితంగా ఏర్పాట్లను ఆర్‌డిఓ కావూరి చైతన్య, ఏడిసిపి రామకృష్ణతో కలిసి పరిశీలించారు. సోమవారం ఇఓ వికె శీనా నాయక్‌తో కలిసి పరిశీలించిన అనంతరం ఆయన లడ్డూ ప్రసాదం పోటును, అన్నదాన కేంద్రం, హోమగుండాలు, కేశఖండనశాల తదితర ఏర్పాట్లు పరిశీలించిన అనంతరం మాట్లాడుతూ భక్తులకు నిరంతరం అన్నప్రసాదం అందించాలన్నారు. పరిశుభ్రతపై శ్రద్ధ వహించాలన్నారు. ఏర్పాట్లలో భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా పటిష్టంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఆటో క్యాడ్ ద్వారా అదికారులు ఆయనకు వివరించగా పలు సూచనలు చేశారు.

# కాణిపాకంలో వేదపాఠశాల ఏర్పాటు

**• రూ.2.50 కోట్లతో ఆలయ పుష్కరిణి పునర్నిర్మాణం • భక్తులకు అందుబాటులోకి నూతన వంద గదులు • పాలక మండలి సమావేశంలో ఏకగ్రీవ తీర్మానం**



కాణిపాకం, డిసెంబరు 8 ప్రభాతవార్త: కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయక స్వామి దేవస్థానంలో నిత్య పారాయణంలో భాగంగా వేద పాఠశాలను ఏర్పాటు చేయాలని పాలకమండలి ఏకగ్రీవంగా తీర్మానించింది. కాణిపాకం దేవస్థానం నూతన పాలకమండలి తొలి సమావేశం సోమవారం స్థానిక ఈవో కార్యాలయ సమావేశ మందిరంలో పాలకమండలి ఛైర్మన్ మణి నాయుడు అధ్యక్షతన జరిగింది. ఈసమావేశానికి పూతలపట్టు ఎమ్మెల్యే కలికిరి మురళీమోహన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా దేవస్థానం విధివిధానాలు ఆలయంలో పూజా విధానాలు, సాంప్రదాయాలు, మాస్టర్ ప్లాన్ అమలు తదితర అంశాలపై పాలకమండలిలో సుదీర్ఘంగా చర్చించారు. పాలకమండలిలో తీసుకున్న నిర్ణయాలను ఎమ్మెల్యే కలికిరి మురళీమోహన్ పాలకమండలి ఛైర్మన్ మణి నాయుడు, ఈవో పెంచల కిషోర్‌లతో కలిసి విలేకరులకు వివరించారు. ఈ సందర్భంగా మాస్టర్ ప్లాన్‌లో భాగంగా భవిష్యత్తులో సుమారు 60, 70 ఏళ్ళ వరకు బహుళ ప్రయోజనాలను దృష్టిలో వుంచుకుని ఆలయం ముందు భాగంలోని స్వామివారి పుష్కరిణిని సుమారు 70 అడుగుల వరకు ముందుకు జరిపి పునర్నిర్మించాలని సమావేశంలో తీర్మానించినట్లు తెలిపారు. అలాగే దేవస్థానంలో అతిథి గృహాలు,సామూహిక కళ్యాణ మండపాల నిర్మాణం కోసం 20 కోట్ల రూపాయలను ఆర్థిక సాయం అందించిన టిటిడి ఛైర్మన్, ఈవోలకు ధన్యవాదాలు తెలియజేస్తూ సమావేశం ఏకగ్రీవంగా తీర్మానించింది. అలాగే ఆలయ ప్రాశస్త్యాన్ని, హిందూ ధర్మాన్ని ప్రచారం చేసేందుకు వీలుగా పాత ప్రచార రథం స్థానంలో నూతన ప్రచార రథం వాహనాన్ని సుమారు 13 లక్షల రూపాయలతో కొనుగోలు చేయాలని తీర్మానం చేసినట్లు ఎమ్మెల్యే మురళీమోహన్ తెలిపారు. దేవస్థానం పరిపాలన సౌలభ్యంలో భాగంగా సుమారు ఐదు లక్షల రూపాయలతో అవసరమైన నూతన కంప్యూటర్లను కొనుగోలు చేయాలని నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఇప్పటికే నిర్మాణం పూర్తయిన వంద గదుల సత్రాన్ని భక్తులకు అందుబాటులోకి తీసుకురావాలని పాలకమండలి తీర్మాంచినట్లు ఎమ్మెల్యే మురళీమోహన్ తెలిపారు. అలాగే పెరుగుతున్న భక్తుల రద్దీ దృష్ట్యా ఉభయదారుల అంగీకారంతో దేవస్థానంలో అమలు జరుగుతున్న పలు రకాల ఆర్జిత సేవా కార్యక్రమాల్లో మార్పులు చేర్పులపై చర్యలు తీసుకోవాలని కూడా సమావేశం తీర్మానించినట్లు ఆయన పేర్కొన్నారు. ప్రస్తుతం పూర్తయిన వంద గదులను 10 లక్షల రూపాయలు చెల్లించే దాతల పేరున మార్చాలని కూడా సమావేశంలో తీర్మానించినట్లు ఎమ్మెల్యే మురళి తెలిపారు. ముఖ్యంగా ఆలయ దర్శనార్థం వచ్చే భక్తులకు సకల సౌకర్యాలతో స్వామివారి సంతృప్తికర దర్శనం కలి ్పంచాలని తీర్మానించినట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఆలయ ఛైర్మన్ మణినాయుడు, ఈఓ పెంచల కిషోర్, డిప్యూటీ ఈవో సాగర్ బాబు, ఈ ఈ వెంకటనారాయణ, ఏఈఓలు ధనంజయ, ప్రసాద్, రవీంద్రబాబు, ధనపాల్, హరి మాధవరెడ్డిలతోపాటు బోర్డు సభ్యులు కత్తి సుధాకర్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, డాక్టర్ బివి.నరేష్, చంద్రకళ, కెఎస్.అనుసూయమ్మ, సంధ్యారాణి, సునీత, కొత్తపల్లె శివప్రసాద్, టివి.రాజ్యలక్ష్మీ, ఊట్ల నాగరాజు నాయుడు, శ్రీపతి సతీష్, పెరుమాళ్ సుబ్రమణ్యంరెడ్డి, చల్లా కృష్ణవేణి, పద్మలత, వసంత, వి.శ్రావణి తదితరులు పాల్గొన్నారు.



# శ్రీకాళహస్తీశ్వరాలయంలో నిత్య కల్యాణం మృత్యుంజయ అభిషేకాలు

## భక్తులతో ఆలయం కళకళ

శ్రీకాళహస్తి, డిసెంబరు 8 ప్రభాతవార్త: శ్రీకాళహస్తీశ్వరాలయం సోమవారం భక్తులతో కిటకిట లాడింది. ఆలయంలో సోమవారం శివయ్యకు ప్రీతి పాత్రమైన రోజు కాబట్టి దూర ప్రాంతాలు పొరుగు రాష్ట్రాల నుంచి వచ్చిన భక్తులు అభిషేకాలకు అత్యధిక ప్రాధాన్యత ఇచ్చారు. ఆలయంలో నిత్యకళ్యాణం పచ్చ తోరణంలా పూజలు అభిషేకాలు నిర్వహించబ డుతుంది. ఓ వైపు స్వామి అమ్మవార్లకు అభిషేకాలతో పాటు రాహుకేతు దోష నివారణ పూజలు, శనీశ్వరునికి ప్రత్యేకాభిషేకాలు, ఇక స్వామి అమ్మవార్లకు నిత్యకళ్యాణం, మృత్యుం జయస్వామికి అభిషేకాలతో పునీతమౌతుంది. ఆలయాధికారులు అందించిన సమాచారం మేరకు సోమవారం సుమారు పాతికవేల మంది స్వామి అమ్మవార్లను దర్శించుకోగా రాహుకాల సమయంలో సుమారు 5వేల మంది భక్తులు పూజలు జరిపించుకున్నట్లు సమాచారం. సోమవారం ఆలయంలోని స్వామి అమ్మవార్ల నిత్యకల్యాణోత్సవానికి విశేష స్పందన వచ్చింది. గణపతి పూజలు, నవగ్రహ పూజలు, యజ్ఞోపవేత పూజలు, మాంగల్య ధారణ కార్యక్రమాలు నిర్వహించారు.

### మృత్యుంజయునికి షోడశాభిషేకాలు

శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసిన మృత్యుంజయ స్వామికి సోమవారం ప్రత్యేకాభిషేకాలు, అలంకారాలు నిర్వహించారు. స్వామికి పాలు, పంచామృతం, చందనం, విభూది, పచ్చ కర్పూరంతో అభిషేకాలు నిర్వహించారు. అనంతరం పలు రకాల సుగంధ పరిమళపుష్పాలు, గజమాలలు, వెండి నాగాభరణలతో శోభాయ మానంగా అలంకరించి ధూప, దీపనైవేద్యాలను మహా మంగళ హారతులిచ్చారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు. భక్తులందరికీ తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

## నేలపాడులో సిఆర్‌డిఏ అడిషనల్ కమిషనర్ పర్యటన

విజయవాడ, డిసెంబరు 8 ప్రభాతవార్త ప్రతినిధి: రైతుల సమస్యలు, సూచనలు తీసుకునే క్రమంలో రాజధాని అమరావతి పరిధిలోని నేలపాడులో సీఆర్డీఏ అడిషనల్ కమిషనర్ ఏ.భార్గవ తేజ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కె.ఎస్.భాగ్యరేఖ పర్యటించారు. సోమవారం వారు ఈ గ్రామంలో పలు అంశాలను పరిశీలించారు. రాజధాని రైతుల సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్ర శేఖర్, మున్సిపల్ శాఖా పి నారాయణ, ఎమ్మెల్యే శ్రావణ్ కుమార్‌తో త్రిసభ్య కమిటీని ఏర్పాటు చేసింది. త్రిసభ్య కమిటీ రైతుల సమస్యలపై సమీక్ష సమావేశం నిర్వహించి గ్రామకంఠాల సమస్యను నెలరోజుల్లో పరిష్కరిస్తామని చెప్పింది. నేపథ్యంలో అధికారులు గ్రామకంఠాలను పరిశీలించారు. గ్రామకంఠాల సమస్యల గురించి రైతులు, స్థానికులు అడిషనల్ కమిషనర్‌కు వివరించారు. ఈ సందర్భంగా రైతులు పలు సమస్యలను ఆమె దృష్టికి తీసుకుని వెళ్ళారు.

## సావిత్రి బాయిపూలే జయంతిని మహిళా ఉపాధ్యాయ దినోత్సవంగా ప్రకటించాలి

విజయవాడ, డిసెంబరు 8 ప్రభాతవార్త ప్రతినిధి: సావిత్రి భాయిపూలే జయంతిని మహిళా ఉపాధ్యాయ దినోత్సవంగా ప్రకటించాలని ఆంధ్రప్రదేశ్ ప్రాథమిక ఉపాధ్యాయుల టీచర్స్ అసోసియేషన్ కోరింది. ఈ మేరకు అసోసియేషన్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కె ప్రకాష్‌రావు, ఎంజి మెహిది ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. దేశంలోనే తొలిసారిగా 1848లో బాలికల పాఠశాలను సావిత్రిభాయి ప్రారంభించారని తెలిపారు. ఆమె జయంతి జనవరి 3వ తేదిన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మహిళా ఉపాధ్యాయ దినోత్సవంగా అధికారికంగా ప్రకటించిందని వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా ఆమె జయంతిని జరపడంతో పాటు మహిళా ఉపాధ్యాయ దినోత్సవంగా ప్రకటించాలని ముఖ్యమంత్రి, విద్యాశాఖ మంత్రిని కోరారు.

# పంట వ్యర్థాలను కాల్చకుండా, పొలాల్లోనే కలియదున్నటం మేలు

### వ్యవసాయ సంచాలకులు మనజీర్ జిలాని సమూన్



సచివాలయం, డిసెంబర్ 8 ప్రభాత వార్త: పంట వ్యర్థాలను కాల్చకుండా, పొలాల్లోనే కలియదున్నటం మేలని వ్యవసాయ సంచాలకులు డాక్టర్ మనజీర్ జిలాని సమూన్ తెలిపారు. ప్రస్తుతం ఖరీఫ్ సీజన్ వరిపంటలో కోతలు ముమ్మరంగా జరుగుతున్నాయని, ఇప్పటికే కోతలు పూర్తయిన చోట కొందరు రైతులు రబీ పంట సాగు కోసం వరి కొయ్యలను, దుబ్బలను కాల్చే పనుల్లో నిమగ్నమై ఉన్నారని, దీనివల్ల వచ్చే పొగతో పర్యావరణానికి నష్టం కాలుష్యం పెరగటమే కాకుండా పంట పొలాలకు అంతకు మించి నష్టంజరుగుతుందని శాస్త్రవేత్తలు తెలియజేశాయరన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రత్యేక సూచన మేరకు గ్రామస్థాయి సచివాలయ రైతు సేవా కేంద్రం సిబ్బందిచే రైతులకు పంట వ్యర్థాలను తగుల పెట్టవద్దు భూసారానికి, పర్యావరణానికి హాని తలపెట్టవద్దనే అంశంతో అవగాహన పెంచేలా ఆదేశాలు జారీ చేయడం జరిగిందన్నారు. కాల్చడం వల్ల నేలకు పర్యావరణానికి పౌరసమాజానికి కలిగే నష్టాలను తెలియజేస్తూ... పోషకాలు నశిస్తాయని, భూమిలోని సేంద్రీయ కర్బనం తగ్గుతుంది. సూక్ష్మ జీవులు నశిస్తాయి, తేమను నిలుపుకునే శక్తి తగ్గుతుంది. నేలల్లో ఆమ్ల గుణం పెరుగుతుంది. పర్యావరణ కాలుష్యం పెరిగి ఆరోగ్యానికి ముప్పు వాటిల్లుతుందని తెలిపారు. వీటికి భిన్నంగా వ్యర్థాలను నేలలోనే కలియబెట్టడం వల్ల కలిగే లాభాలను తెలియజేస్తూ పైరు ఎదుగుదలకు దోహదపడే అన్ని రకాల పోషకాలు భూమిలో కలిసి భూసారం పెరుగుతుందని, నేలలోని కార్బన్ శాతం పెరిగి తదుపరి పంటల దిగుబడులు పెరుగుతాయని తెలిపారు.

# బాల్యవివాహాలు నిర్మూలనకు సమాజం ముందుకు రావాలి : కలెక్టర్ కీర్తి చేకూరి



**ఉమ్మడి తూర్పుగోదావరి బ్యూరో, డిసెంబరు 08, (ప్రభాతవార్త) :** బాల్యవివాహ ముక్త్ భారత్ 100 రోజుల ప్రచార కార్యక్రమాల భాగంగా జిల్లాలో బాల్యవివాహాల నివారణపై సమగ్ర ప్రయత్నాలు జరుగుతున్నాయని జిల్లా కలెక్టర్ %ఒ% జిల్లా మేజిస్ట్రేట్ కీర్తి చేకూరి తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లో మహిళాభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బాల్యవివాహాల నిర్మూలనపై పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమాలు నవంబర్ 7 నుంచి మార్చి 8 వరకు ప్రభావవంతంగా కొనసాగుతాయని చెప్పారు. "బాల్యం చదువుకు, అభివృద్ధికి సమయం%ౌ% పిల్లల జీవితాలను కోల్పోయే వివాహాలు కాదు" అని ఆమె స్పష్టం చేశారు. కనీస వివాహ వయస్సు అమ్మాయికి 18, అబ్బాయికి 21 సంవత్సరాలు నిండకుండ వివాహం జరిపితే కఠిన శిక్షలు తప్పవని జాగ్రత్తపరిచారు. ఈ సందర్భంగా కలెక్టర్ కీర్తి చేకూరి మాట్లాడుతూ పేదరికం, అవగాహన లోపం, కుటుంబ ఒత్తిళ్లు, సామాజిక దోషాలు, సాంకేతిక దుర్వినియోగం వంటి అనేక కారణాలతో బాల్య వివాహాలు జరుగు తున్నాయని పేర్కొన్నారు. బాల్యవివాహం అనేది చట్టరీత్యా నేరమే కాక, బాలికల విద్య, ఆరోగ్యం, భవిష్యత్తును దెబ్బతీసే తీవ్రమైన సామాజిక సమస్య అన్నారు. వీటిని అడ్డుకోకపోవడం అంటే మనం పిల్లల హక్కులను మనమే ఉల్లంఘించి నట్లేనన్నారు. "ప్రతి కుటుంబం, ప్రతి గ్రామం, ప్రతి పాఠశాల%ౌ% కలిసి ముందుకు రావాలి. ఒక పిల్లవాడైనా బాల్యవివాహం నుంచి రక్షితుడైతే, అదే నిజమైన అభివృద్ధి" అని కలెక్టర్ పిలుపునిచ్చారు. జిల్లా వ్యాప్తంగా గ్రామ,వార్డ్, మండల, డివిజనల్, జిల్లా స్థాయిల్లో బాల్యవివాహ నిరోధక నిర్మూలన కమిటీలు ఏర్పాటు చేశామని అధికారులు తెలిపారు. గ్రామ,వార్డ్ కమిటీలకు సర్పంచ్,కార్పొరేటర్ ఛైర్పర్సన్‌గా, మహిళా సంరక్షణ కార్యదర్శి, సభ్య–కన్వీనర్‌గా వ్యవహరిస్తారు. రెవెన్యూ, విద్య, పోలీసు మరియు ఐ సి డీఎస్ విభాగాలతో కలిపి మొత్తం 11 మంది సభ్యులు ఈ కమిటీలలో పనిచేస్తూ, ప్రతి నెల మొదటి మరియు మూడవ శుక్రవారం సమావేశాలు నిర్వహిస్తారు. ఎక్కడైనా 18 సంవత్సరాలు నిండని బాలిక, బాలుడి పెళ్లి జరిగినట్లు సమాచారం తెలిసిన వెంటనే చైల్డ్ హెల్ప్ లైన్ 1098, పోలీస్ 100, అత్యవసర హెల్ప్‌లైన్ 112లకు తెలియజేయాలని సూచించారు. సమాచారాన్ని పూర్తిగా గోప్యంగా ఉంచుతామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ వై. మేఘా స్వరూప్, డిఆర్వో టి. సీతారామ మూర్తి, ఐసిడిఎస్ పిడిఓ టి. శ్రీదేవి, ఎస్డిసి ఎస్. భాస్కర్ రెడ్డి, పి. భాగ్యలక్ష్మి, డీ ఎల్ డబ్ల్యూవో పి. వీణా దేవి తదితరులు పాల్గొన్నారు.

# దొంగతనం కేసులో జాప్యం..

### టెక్నికల్ ఎవిడెన్స్ ఉన్నా పట్టుకోవడంలో ఆలస్యం..

### కాజులూరు సర్కిల్ లో పోలీసులపై ఆరోపణలు..?

**ఉమ్మడి తూర్పుగోదావరి బ్యూరో, డిసెంబరు, 08 (ప్రభాతవార్త) :** దర్జాగా ఇంట్లోకి దొంగలు జొరబడి విలువైన వస్తువులు చోరీ చేసి వెళ్ళిపోయారు. రోజులు గడుస్తున్నా సరే పోలీసులు కేసును దర్యాప్తు చేయడంలో జాప్యం చేస్తున్నారని బాధితులు ఆరోపిస్తున్నారు. ఇంతకీ ఏం జరిగిందంటే.. కాకినాడ జిల్లా కాజులూరు మండలం గొల్లపాలెం పెద్ద వీధి లో ఉన్న నేతి భగవాన్ ఇంట్లో గత నెల 29న శనివారం తెల్లవారుజామున 12 నుండి 4 గంటల సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు గేటు తాళం పగలగొట్టి ఇంటి లోపలి ప్రవేశించి ల్యాప్ టాప్ , హుందాయ్ వెన్యూ ఏపీ 39 కేబి 3736 నెంబర్ గల నీలి రంగు కారును దొంగిలించుకు పోయారు. నాడు అందిన ఫిర్యాదు మేరకు దొంగిలించుకొని పోయినట్లు వచ్చిన ఫిర్యాదు పై గొల్లపాలెం పోలీస్ స్టేషన్ నందు క్రైమ్ నెంబర్



144/2025 ప్రకారం కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. అందులో భాగంగా రూరల్ సీఐ చైతన్య కృష్ణ పర్యవేక్షణలో క్లూ టీం సీఐ పి శ్రీనివాస్ బృందం నేర స్థలాన్ని సందర్శించి ఆధారాలను సేకరించి దర్యాప్తు ముమ్మరం చేస్తున్నట్లుగా ఎస్సై మోహన్ కుమార్ అప్పట్లో తెలిపారు. కాగా రోజులు గడుస్తున్నా నేటికీ ఎలాంటి చర్యలు పోలీసులు చేపట్టినట్లు లేదని ఆరోపణలు ఉన్నాయి. టెక్నికల్ గా లాప్టాప్ కూడా దొంగల చేతిలో ఉన్నా... లొకేషన్ లేదా ఇతరత్రా పద్ధతుల ద్వారా చోరీ సొత్తును కనుగొనడంలో మీన మేషాలు లెక్కిస్తున్నారని అంటున్నారు. పైగా కారు కూడా చోరికి గురికాబడింది. ఇన్ని టెక్నికల్ ఎవిడెన్స్ ఉన్నా సరే. .. పోలీసులు కేసు దర్యాప్తు జాప్యం ఎందుకు చేస్తున్నారో అర్థం కావడం లేదని బాధితులు ప్రశ్నిస్తున్నారు.



## విద్యా శాఖ కార్యాలయ భవనానికి సమకూరిన స్థలం...

### స్థలాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే. బండారు.



**ఆత్రేయపురం,డిసెంబర్, 08,(ప్రభాత వార్త)** విద్యాశాఖ కార్యాలయం భవన నిర్మాణానికి సోమవారం ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ఆత్రేయపురం తహసీల్దార్ కార్యాలయం వెనుక నున్న స్థలాన్ని పరిశీలించారు. విద్యాశాఖ కార్యాలయం నిర్మాణానికి 54 లక్షలు నిధులు ప్రభుత్వం విడుదల చేసింది. అయితే ఇప్పటి వరకు స్థలం సమకూరినందుకు నిర్మాణానికి నోచుకోలేదు. ఈ విషయాన్ని ఉపాధ్యాయులు ఎమ్మెల్యే బండారు సత్యానందరావు దృష్టికి తీసుకురాగా స్పందించి సోమవారం సాయంత్రం ఆత్రేయపురంలో స్థల పరిశీలన చేశారు. తహసీల్దార్, కార్యాలయం వెనకవైపునున్న స్థలం అనుకూలంగా ఉందని గుర్తించారు. అందరికీ ఆమోదయోగ్యం రావడంతో భవనం నిర్మించేందుకు చర్యలు చేపట్టారు స్థలం ఇవ్వడానికి సహకరించిన ఆర్డీవో. పి. శ్రీకర్ తహసీల్దార్ టి ఆర్ రాజేశ్వరరావుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమం లో ఆకుల రామకృష్ణ, కె.వి సత్యనారాయణరెడ్డి, ముదునూరి వెంకటరాజు, ముదునూరి రామభద్రరాజు, కూసంపూడి రామకృష్ణంరాజు, వెచ్చా అనిల్ కుమార్, నాగిరెడ్డి సత్యనారాయణ, దండు సీతారామరాజు,సర్వ శిక్ష అభియాన్ రాంజీ, విద్యాశాఖ అధికారి పి.వి. వరప్రసాదరావు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## సదరం సర్టిఫికెట్ల కోసం దివ్యాంగుల అగచాట్లు



**గోపాలపురం , డిసెంబర్ 8 (ప్రభాతవార్త ):** సదరం సర్టిఫికెట్ల కోసం దివ్యాంగులు నానా అగచాట్లు పడిన సంఘటన గోపాలపురం ప్రభుత్వాసుపత్రిలో జరిగింది ప్రభుత్వం అందించే పింఛన్ పొందేందుకు వివిధ ప్రమాదాల్లో క్షతగాత్రులైన వారు ఇన్సూరెన్స్ పొందేందుకు సదరం సర్టిఫికెట్లు కోసం కొన్ని రోజుల క్రితం స్లాట్ బుక్ చేసుకున్నారు ఉమ్మడి తూర్పు పశ్చిమగోదావరి జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన దివ్యాంగులు కొంచెం దగ్గరలో ఉన్న గోపాలపురం ప్రభుత్వాసుపత్రిని ఎంపిక చేసుకున్నారు వారిలో పలువురికి గోపాలపురం ప్రభుత్వాసుపత్రికి ఈనెల 8వ తేదీన ఆధార్ కార్డు మరి ఏదైనా గుర్తింపు కార్డు తీసుకొని రావాలని సంబంధిత అధికారులు చెప్పడంతో నానాఇబ్బందులు పడుతూఉదయాన్నే గోపాలపురం ఆసుపత్రికి చేరుకున్నారు. మధ్యాహ్నం ఒంటిగంట వరకు డాక్టర్ల కోసం పడిగాపులు పడుతూఎంతో ఆశగా నిరీక్షించారు అయితే ఈరోజు డాక్టర్లుసంబంధిత అధికారులు రారని చెప్పడంతో ఎంతో ఆవేదన కు గురయ్యారు . వచ్చిన వారిలో గతంలో రెండుసార్లు ఇదేవిధంగా వచ్చి డాక్టర్లు రాక వెనుదిరిగిన సంఘటనలు విలేకరుల వద్ద .వాపోయారు ఎక్కడెక్కడ నుంచో ఎంతో ప్రయాసతో వచ్చిన తమకు నిరాసేఎదురైందని దివ్యాంగులు అంటే ప్రభుత్వ అధికారులకు డాక్టర్లకు ఎంత నిర్లక్ష్యమా అంటూ ఆవేదన వ్యక్తం చేశారు .మరలాపరీక్షలు ఎప్పుడు జరిగేది తెలియజేస్తామని ఆసుపత్రి సిబ్బంది చెప్పడంతో చేసేదేమీ లేక దివ్యాంగులు నిరాశతో వెనుతిరి గారు .

## పంటు ప్రయాణం పునఃనిర్మాణ పనులు ప్రారంభం



**కె గంగవరం,డిసెంబర్ 8, (ప్రభాతవార్త) :** గంగవరం మండలం లో కోటిపల్లి – ముక్తేశ్వరం రేవు పంటు ప్రయాణ రహదారి పనులు ప్రారంభించినట్లు పప్పులు మసేను వెంకన్న (రేపు శ్రీను)తెలిపారు. సుమారు నాలుగు నెలల క్రితం వచ్చిన వరదలకు రహదారి కొట్టుకుపోవడంతో కొత్తగా రహదారి నిర్మించి త్వరలోనే పంటు రాకపోకలు జరుగునని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పెమ్మాడి బేబీ సత్తిబాబు,పప్పుల సాయిబాబు స్థానిక నేతలు,ప్రజలు పాల్గొన్నారు.

## రోడ్డుకు అడ్డంగా వేసిన ముళ్లకంచెను తొలగింపుచేయించిన తాసిల్దార్




**రౌతులపూడి, డిసెంబర్ 8( ప్రభాతవార్త):** మండలంలోని బలరాంపురంలో ఓ రైతు రోడ్డుకు అడ్డంగా ముళ్లకంచి వేశారు. దీంతో దారి మార్గం లేక స్థానికులు చాలా ఇబ్బంది పడుతున్నారు. దీనిపై జిల్లాస్థాయి అధికారులకు ఫిర్యాదు వెళ్లడంతో తాసిల్దార్ ఎస్ వి నరేష్ హుటా హుటిన బలరాంపురం వెళ్ళి ఆ ప్రదేశాన్ని పరిశీలించారు. ఎప్పటినుంచో ఉన్నటువంటి దారి మార్గాన్ని మూసి వేయడం సమంజసం కాదని, తక్షణం తొలగించాలని ఆయన ఆదేశించారు. స్థానికులు, సిబ్బంది కంచె తొలగింపు చర్యలు చేపట్టారు. ఆ ప్రాంత వాసులు తాసిల్దార్కు అభినందనలు తెలిపారు.

## నేడు ఆత్రేయపురం గ్రామ దేవత శ్రీ మల్లమ్మ అమ్మవారి 11వ వార్షికోత్సవం

**ఆత్రేయపురం, డిసెంబర్, 08,(ప్రభాత వార్త )** గ్రామ దేవత శ్రీ మల్లమ్మ అమ్మవారి 11వ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేసి నట్లు ఆలయ కమిటీ నిర్వాహకులు తెలిపారు.ఈ సందర్భంగా ఆత్రేయపురం గ్రామ దేవత అయిన శ్రీ మల్లమ్మ అమ్మవారి ఆలయాన్ని సర్వాంగా సుందరంగా తీర్చి దిద్దారు.అమ్మవారి 11వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని లక్ష చామంతి పూజ ప్రత్యేక హోమాలు కుంకుమ పూజలు నిర్వహించేందుకు ఏర్పాటు పూర్తి అయినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ నిర్వాహకులు మాట్లాడుతూ ఈ పూజ కార్యక్రమాలను ఆలయ ప్రధాన అర్చకులు పుల్లేటికుర్తి భాస్కర్ ఆధ్వర్యంలో వేద పండితులు నడుమ ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి కృపా కటాక్షలకు పాత్రులు కాగలరని తెలిపారు. అనంతరం ఆలయ ఆవరణలో భారీ అన్న సమారాధన నిర్వహిస్తున్నట్లు తెలిపారు





## విద్యార్థులు నడిచే దారిలో చెత్త వేసే వారిపై చర్యలు తీసుకోవాలి



**జగ్గంపేట డిసెంబర్ 8 (ప్రభాతవార్త)** జగ్గంపేట గ్రామంలో ఉన్న ప్రభుత్వ హైస్కూల్ నందు విద్యార్థిని విద్యార్థులు రోజు రాజమండ్రి జగ్గంపేట మెయిన్ రోడ్ లో నడుస్తూ అనేక ప్రమాదాలకు గురయ్యేవారు ఈ విషయం తెలుసుకున్న ప్రధానోపాధ్యాయులు టీ రంగారావు పాఠశాల వెనుక ప్రహరీ గోడ కొంతమేర పగలగొట్టించి కాకినాడ రోడ్ లో వెళ్ళే విధంగా తయారు చేయించారు ఈ దారి నుండి విద్యార్థులు పాఠశాలకు సౌకర్యంగా వెళ్లి వచ్చేవారు కానీ ఆ వీధిలో నివసిస్తున్నటువంటి కొంతమంది ప్రజలు విద్యార్థులు నడిచే దారిలోనే చెత్తను, వ్యర్థాలను అధికంగా వేయడం వలన వెళ్లే దారిలో దుర్వాసన అత్యంత దారుణంగా రావడంతోపాటు విద్యార్థులు అనారోగ్యం బారిన పడతారని ఆ దారి వదలి ట్రాఫిక్ ఎక్కువగా ఉండి ప్రమాదాలు జరిగే దారిలో వెళ్తున్నారు ఈ సందర్భంగా భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ జగ్గంపేట మండల అధ్యక్షుడు జి అరుణ్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థినీ విద్యార్థులుకు ఎలాంటి ప్రమాదాలు జరగకుండా సౌకర్యంగా వెళ్లే దారిలో వ్యర్థాలు చెత్త వేసే వారిపై పంచాయతీ వారు కఠిన చర్యలు తీసుకోవాలని, హెచ్చరిక బోర్డు పెట్టాలని దాన్ని ఉల్లంఘించిన వారిపై కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని భారత విద్యార్థి ఫెడరేషన్ తరపున జగ్గంపేట పంచాయతీ సెక్రెటరీకి వినతి ఇవ్వడం జరిగిందని తెలియజేశారు ..

## మానవ సేవకు మించిన తృప్తి లేదు జాతీయ స్థాయిలో పదవ స్థానంలో పార్డ్ ఇండియా

### పార్డ్ ఇండియా వ్యవస్థాపక అధ్యక్షులు బేతాళ వీరాస్వామి



**దేవరపల్లి ,డిసెంబర్ 8 (ప్రభాతవార్త):** సమాజ సేవ పట్ల ప్రతి వ్యక్తి చూపే శ్రద్దే మానవత్వానికి ప్రత్యక్ష నిదర్శనమని పార్డ్ ఇండియా స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు బేతాళ వీరాస్వామి పేర్కొన్నారు.పార్డ్ ఇండియా స్థాపించి 15 ఏళ్లు పూర్తైన సందర్భంగా దూబచర్ల గ్రామ శివారులో నిర్వహించిన సేవా యజ్ఞ మహోత్సవ సభ సంస్థ అధ్యక్షులు అంబటి శ్రీనివాసరావు అధ్యక్షతన నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా వీరస్వామి మాట్లాడుతూ బాల్యంలో ఎన్నో కష్టాలను ఎదుర్కొంటూ ఉన్నత విద్య అభ్యశించి దేశ,విదేశాల్లో ఉన్నతస్థాయిలో స్థిరపడడం జరిగినా తనకు తృప్తి లభించలేదన్నారు.ఉన్నంతలో సమాజానికి ఏదో రకంగా సేవ చేయాలనే సంకల్పంతో 2011 లో పార్డ్ ఇండియా సంస్థను ప్రారంభించానన్నారు.యర్నగూడెం వంటి మారుమూల ప్రాంతంలో ప్రారంభమైన సంస్థ,నేడు జిల్లా, రాష్ట్ర, దేశ, విదేశ స్థాయిలో శాఖోపశాకాలుగా విస్తరించడం, జాతీయ స్థాయిలో 10 వ స్థానం లభించడం గర్వకారణమన్నారు. తమ సేవా సిద్ధాంతానికి ప్రతీకగా పార్డ్ ఇండియా ద్వారా ఉచిత మెగా వైద్య శిబిరాలురక్తదాన శిబిరాలుప్రమాదగ్రస్తులకు అంబులెన్స్,విద్యార్థులకు ఉచిత ట్యూషన్ కేంద్రాలు, మహిళలకు కుట్టు శిక్షణా కేంద్రాలు, కంప్యూటర్ శిక్షణ, స్కాలర్షిప్,ఆపదలో ఉన్న కుటుంబాలకు ఆర్థిక సహాయం, నిరంతర అన్నదానం,పర్యావరణ పరిరక్షణకు మొక్కల పంపిణీ,విద్యార్థులకు పోటీలు నిర్వహించి బహుమతుల ప్రదానం చేయడం వంటి అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ క్రమంలో స్థానిక శ్రీ సంఘమిత్ర విద్యాలయ దూబచర్ల నందు మెగా హెల్త్ క్యాంప్,దాతల సహకారంతో 16 మందికి ఉచిత కుట్టుమిషన్లు పంపిణీ చేశారు.అలాగే సంఘ అభివృద్ధికి విశేష సేవలందించిన 50 మందిని సన్మానించి జ్ఞాపికలు బహుకరించారు.అదేవిధంగా, 100 మంది నూతన సభ్యులకు సభ్యత్వ పత్రాలను వ్యవస్థాపక అధ్యక్షుల చేతుల మీదుగా అందజేశారు.అత్యంత వైభవంగా జరిగిన ఈ కార్యక్రమంలో కారుమంచి గణేష్,నెక్కంటి వెంకటేష్,దేవరాజు అచ్యుతరావు,సోమశెట్టి వెంకట్రావు,చీమకుర్తి కృష్ణ ప్రసాద్,మహమ్మద్ ఇలియా షరీఫ్,కూరపాటి నాగరాజు,జివివి ప్రసాద్, బొందల శ్రీనివాస్,తాతిన సత్యనారాయణ, అల్లాడ రామకృష్ణ,రాపాక ఫణి కిషోర్, సుంకవల్లి సత్తిరాజు తదితరులు పాల్గొన్నారు

## ప్రతి అర్జీకి పూర్తి పరిష్కారం... కలెక్టర్ మహేష్ కుమార్



**అమలాపురం,డిసెంబర్8,ప్రభాతవార్త** ప్రతి అర్జీని క్షేత్రస్థాయిలో పూర్తిగా విచారించి అర్జీదారులకు శత శాతం పరిష్కార మార్గాలు సంతృ ప్తికర స్థాయిలో అందిం చాలని జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్ నందు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్ర మాన్ని జిల్లా స్థాయిలో నిర్వహించారు.ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడు తూ ప్రజలకు చేరువగా సుపరి పాలన లక్ష్యంగా మండల డివిజన్ జిల్లా స్థాయిలలో ప్రజా ఫిర్యా దుల పరిష్కార వేదిక కార్యక్రమాలు అధికారులతో కలసి నిర్వహించి కలిసి అర్జీదారుల నుంచి అర్జీలు స్వీకరిస్తున్నట్లు తెలిపారు.ఈ కార్యక్ర మంలో మొత్తం 265 అర్జీలు వచ్చాయి. వీటిని నిర్దేశ గడుపులోగా త్వరితగతిన పరిష్కరి%శీ% చాలని జిల్లా కలెక్టర్ ఆయా శాఖల అధికారులను ఆదేశిం చారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించాలనే లక్ష్యంతో వివిధ స్థాయిలలో పిజిఆర్ఎస్ నిర్వహిస్తున్నా మని చెప్పారు. అత్యంత పారదర్శకంగా, జవాబు దారీతనంతో అర్జీలు సమర్పించి న వారికి సంతృప్తికర పరిష్కారం చూపాల్సిన బాధ్యత జిల్లా యంత్రాంగంపై ఉందన్నారు. అర్జీల పరిష్కారంలో అలసత్వం వహించిన అధికారుల పై చర్యలు తప్పవని హెచ్చ రించారు. అర్జీదారుల పట్ల సంయమన%శీ% ఓర్పుతో వ్యవహరించి సావధానంగా సమస్యలను వినాలన్నారు. జిల్లా జాయింట్ కలెక్టర్ నిశాంతి ప్రసంగిస్తూ అర్జీదారులతో సంబంధిత అధికారి మర్యాదగా ప్రవర్తించాలని, ఎండా ర్స్మెంట్ తప్పకుండా ఇవ్వాలని చెప్పారు. వ్యవహారశైలి,పరిష్కార విధానం సరిగ్గా లేవన్న అభిప్రాయం అర్జీదారుల నుంచి ఎట్టిపరిస్థితుల్లోనూ రాకూడదని స్పష్టం చేశారు.ఈ కార్యక్ర మంలో జిల్లా రెవిన్యూ అధికారి కె మాధవి,డ్వామా పిడి ఎస్ మధుసూదన్,సమగ్ర శిక్ష ఏ పి సి జి మమ్మీ,డి ఎల్ డి వో రాజేశ్వరరావు,జిల్లా అధి కారులు,వికాస జిల్లా మేనేజర్ జి రమేష్ సిబ్బంది పాల్గొన్నారు.

## కేరళ తరహాలో లొల్ల లాకుల వద్ద జాతీయ స్థాయి డ్రాగన్ పడవల పోటీలు



**ఆత్రేయపురం, డిసెంబర్, 08,(ప్రభాత వార్త )** పచ్చని కోనసీమను కేరళ తరహాలో టూరిజం పరంగా అభివృద్ధి చెందాలని, అందుకు ప్రభుత్వం విశేషంగా కృషి చేస్తుందని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. సంక్రాంతి సంబరాల్లో భాగంగా లొల్ల లాకుల వద్ద సోమవారం అన్ని శాఖ ల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగాఎమ్మెల్యే బండారు సర్ ఆర్థర్ కాటన్ డ్రాగన్ పడవల పోటీలు, ఈత పోటీలకు సంబంధించిన బ్రోచర్,పోస్టర్, లోగోల ఆవిష్కరణ ఆర్డీవో పి శ్రీకర్, కొత్తపేట డిఎస్పి సుంకర మురళీమోహన్,వాడపల్లి దేవస్థానం ఛైర్మన్ ముదునూరి వెంకటరాజు,ఆకుల రామకృష్ణ, కె వి సత్యనారాయణ రెడ్డి తదితరులతో కల్సి పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లొల్ల లాకుల వద్ద ఆత్రేయపురం తాడిపూడి వంతెన వద్ద గత సంవత్సరం కంటే మిన్నగా డ్రాగన్ పడవల పోటీలు,ఈత పోటీలు, రంగవల్లుల పోటీలు, గాలిపటాల పోటీలు జనవరి 11,12,13, తేదీలలో నిర్వహిస్తామన్నారు.ఈ డ్రాగన్ పడవల పోటీలు నభూతో న భవిష్యత్తు అన్నట్లుగా జరగనున్నాయని తెలిపారు. ఇందుకోసం కంపెనీని సైతం రిజిస్ట్రేషన్ చేయడం జరిగిందన్నారు. గత సంవత్సరం జరిగిన డ్రాగన్ పడవల పోటీలు,ఈత పోటీలు అందరినీ ఆకర్షించాయని, పర్యాటకులను ఆకట్టుకున్నాయన్నారు. వాటిని మించేలా ఈ ఏడాది జాతీయస్థాయిలో డ్రాగన్ పడవల పోటీలు జరపాలని నిర్ణయించుకున్నామని తెలిపారు. సంక్రాంతి పండుగ ముందే వచ్చిందా అన్న రీతిలో, ఈ ప్రాంతం అంతా టూరిజం పరంగా అభివృద్ధి చెందే విధంగా వాడపల్లి వెంకన్న కొలువుదీరిన ఈ ప్రాంతంలో సర్ ఆర్థర్ కాటన్ గోదావరి ట్రోఫీ పేరిట పెద్ద ఎత్తున నిర్వహించడానికి అన్ని రకాల ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా నిధులు అందించడానికి ఆలోచన చేస్తుందన్నారు. జిల్లా కలెక్టర్ మహేశ్ కుమార్ కూడా ప్రత్యేకంగా శ్రద్ధ పెడుతున్నారన్నారు. ప్రభుత్వం, స్పాన్సర్స్ సహకారంతో స్థానికంగా ప్రసిద్ధి పొందిన ఆత్రేయపురం పూతరేకులు, మామిడి తాండ్ర, బొబ్బట్లు కండ్రిగ కోవా, నార్కెడ్ మిల్లి పచ్చళ్ళు మొదలైన వాటితో ఫుడ్ ఫెస్టివల్ ఏర్పాటు జరుగుతుందన్నారు. వాటన్నిటికీ విస్తృతమైన మార్కెటింగ్ లభించడానికి దోహదం చేస్తుందన్నారు. ఈ ప్రాంతం టూరిజం పరంగా కేరళ తరహాలో అభివృద్ధి చెందడానికి ఈ డ్రాగన్ పడవల పోటీలు దోహదం చేస్తాయని తెలియజేశారు. అనంతరం బ్రోచర్, లోగోలను ఆవిష్కరించి, పోస్టర్ విడుదల చేశారు.ఈ కార్యక్రమంలో ఆర్ %ఒ%బి డి ఈ రాజేంద్రప్రసాద్,ఆర్టీసీ డిపో మేనేజర్ వై వి వి వి ఆన్ కుమార్,హెడ్ వర్క్స్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ గంగుమళ్ళ శ్రీనివాస్,కెనాల్స్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కె వెంకటేశ్వరరావు,సిఐ విద్యాసాగర్,ఆత్రేయపురం ఎమ్మార్వో టీఆర్ రాజేశ్వరరావు, ఎస్సై రాము, ఎప్టిఓ దేవిద్రాజు,ముళ్ళపూడి భాస్కరరావు, కాయల జగన్నాథం, కూసంపూడి రామకృష్ణంరాజు, వెచ్చా అనిల్ కుమార్, ఏపుగంటి వెంకటేష్,మైగాపుల గురవయ్య నాయుడు,కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## మత్స్యకారుల జీవన ప్రమాణాలు పెంపుకు ఇతర రాష్ట్రాలలో శిక్షణ



**యు.కొత్తపల్లి, డిసెంబర్ 8(ప్రభాతవార్త):** మత్స్యకారులు జీవన ప్రమాణాలను మెరుగుపరచడానికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని డిసిసిబి చైర్మన్ తుమ్మల రామస్వామి అన్నారు. మండలంలోని ఉప్పాడ లోని 60 మంది మత్స్యకారులను శిక్షణ కోసం రెండు బృందాలుగా సోమవారం కేరళ, తమిళనాడు రాష్ట్రాలకు రెండు బస్సుల్లో రామస్వామి, మాజీ ఎమ్మెల్యే పెండెం దొరబాబులు జెండా ఊపి పంపించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మత్స్యకారుల జీవన ప్రమాణాలను మెరుగుపరచడానికి చేపట్టిన చర్యలలో భాగంగా రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఇచ్చిన హామీ మేరకు పగడపు దిబ్బల పెంపకాన్ని పరిశీలించడానికి వీరిని పంపించడం జరుగుతుందన్నారు. సముద్రపు నాచు పెంపకం, పగడపు దీవుల ఏర్పాటును అధ్యయనం చేస్తారన్నారు. సముద్ర ఆధారిత ప్రత్యామ్నాయ జీవనోపాధి కోసం జరిగిందన్నారు. కార్యక్రమంలో మత్స్యశాఖ అధికారులు, జనసేన నాయకులు పాల్గొన్నారు.

## డిసెంబర్ 14న. గోగన్నమఠంలో హిందూ సమ్మేళనం.



**మామిడికుదురు.డిసెంబర్ 08 ప్రభాతవార్త** ఈ నెల 14వ.తేదీ ఆదివారం మండల పరిధిలోని గోగన్నమఠం గ్రామంలో హిందూ సమ్మేళనం జరుగుతుందని సమ్మేళనం నిర్వాహకులు,సమితి అధ్యక్షులు భూపతిరాజు సత్యనారాయణ రాజు (సత్తిబాబురాజు) తెలిపారు. సమ్మేళనానికి సంబందించిన కరపత్రాలను సోమవారం ఆవిష్కరించారు.14వ.తేదీన ఉదయం 9 గంటల నుంచి శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయం సమీపంలో ఈ సమ్మేళనం జరుగుతుందన్నారు.శృంగవృక్షం పీఠాధిపతులు సాయిదత్త నాగానంద సరస్వతిస్వామీజీ ప్రధాన వక్తగా హాజరు అవుతారన్నారు.గోదావరి విభాగ్ ప్రచారక్ సోమూజీ తోపాటు పలువురు ప్రముఖులు ఈ సమ్మేళనంలో పాల్గొంటారని సత్తిబాబు రాజు తెలిపారు. హిందువులు భారీ సంఖ్యలో ఈ సమ్మేళనానికి తరలి రావాలని కోరారు. కార్యక్రమంలో పలువురు స్థానికులు పాల్గొన్నారు.

## ఉత్తమ ఫిజియోథెరపిస్ట్ గా డాక్టర్ హనుమానాయక్..





**అంబాజీపేట,డిసెంబర్ 8, (ప్రభాతవార్త)..** లేజర్ ఫిజియోథెరపీ ద్వారా అనేక మందికి వైద్య సేవలందించి ఫలితాలు సాధించిన డాక్టర్ హను మానాయక్ ఉత్తమ ఫిజియోథెరపిస్ట్ గా ఎంపిక య్యారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా పరిధిలోని అంబాజీపేటలో డాక్టర్ హనుమనాయక్ గత కొన్నేళ్లుగా శ్రీలక్ష్మి అడ్వాన్స్ లేజర్ ఫిజియోథెరపీ రిహాబిలిటేషన్ హాస్పిటల్ ను స్థాపించి ఎంతో మందికి వైద్య సేవలు అందించి గుర్తింపు తెచ్చుకున్నారు.ఈ సందర్భంగా అమలాపురంలో కిమ్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎస్పిఎఆర్సిసి (సదరన్ ఫిజియో వార్షిక పరిశోధన, సాంస్కృతిక సమావేశం)లో ఉత్తమ వైద్యుడిగా గుర్తించి అవార్డును అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ హనుమానాయక్ మాట్లాడుతూ ఉత్తమ ఫిజియోథెరపిస్ట్ అవార్డు మరింత బాధ్యతను పెంచిందన్నారు.గత 10 ఏళ్లుగా వైజాగ్, రాజమహేంద్రవరం, ఏలూరు, రావులపాలెం,అంబాజీపేట, పి.గన్నవరం ప్రాంతాల్లో ఫిజియోథెరఫి వైద్య సేవలు అందించినట్లు డాక్టర్ నాయక్ తెలిపారు. డాక్టర్ నాయక్ ను పలువురు అభినందించారు.

## 17 మందికి రూ.15.97 లక్షల చెక్కులు పంపిణీ



**రామచంద్రపురం,డిసెంబర్ 8(ప్రభాతవార్త):** వైద్య చికిత్స నిమిత్తం ఆర్థిక సమస్యలతో సతమతమవుతున్న నిరు పేద వర్గాలకు ముఖ్యమంత్రి సహాయనిధి ఆర్థిక భరోసా కల్పిస్తుందని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పేర్కొన్నారు. రామచంద్రపురం నియోజకవర్గ పరిధిలో ముఖ్యమంత్రి సహాయనిధి నుండి మంజూరైన సిఎమ్ఆర్ఎఫ్ సోమవారం మంత్రి క్యాంపు కార్యాలయంలో 17 మందికి రూ.15 లక్షల 97వేల 244 రూపాయలు చెక్కులు బాధిత కుటుంబాలకు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి సుభాష్ మాట్లాడుతూ వైద్య ఖర్చులు భారమైన పేదవారికి కొండంత భరోసాగా, మానవతా దృక్పథంతో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నిలుస్తున్నారని,ప్రజలకు సంక్షేమ పథకాలను అందిస్తూ రాష్ట్రాన్ని అభివృద్ధి వైపు నడిపిస్తూ విద్య,వైద్యానికి పెద్దపీట వేస్తూ ప్రజల ఆరోగ్య పరిరక్షణే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతుందన్నారు.ఎన్టీఆర్ వైద్య సేవలో లేని అనేక రకాల చికిత్సలకు లక్షల రూపాయలు ఖర్చు చేసి ఇబ్బంది పడుతున్న పేద,మధ్యతరగతి కుటుంబాలకు సీఎం సహాయనిధి భరోసాగా నిలుస్తోందని,నియోజకవర్గంలో కోట్లాది రూపాయలు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరు చేయించి బాధిత కుటుంబాలకు అందజేయడం జరుగుతుందన్నారు.ఈ కార్యక్రమంలో జనసేన ఇన్చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్,నియోజకవర్గ పరిశీలకులు కాకినాడ రామారావు,తెలుగుదేశం పార్టీ రామచంద్రపురం రూరల్, కె గంగవరం,కాజులూరు మండలాల అధ్యక్షులు కొత్తపల్లి శ్రీనుబాబు,మేడిశెట్టి రవికుమార్,చవ్వాకుల నారాయణమూర్తి, పార్టీ సీనియర్ నాయకులు గరికపాటి సూర్యనారాయణ, స్వచ్ఛ్ ఆంధ్ర డైరెక్టర్ సలాది రమేష్,మాజీ మున్సిపల్ కౌన్సిలర్ దంగేటి గౌరీ శంకర్, వనుం వీరబ్రహ్మం తదితరులు పాల్గొన్నారు...

## పాస్టర్స్ ఫెలోషిప్ క్రిస్మస్ వేడుకలు



**ఏలేశ్వరం,డిసెంబర్ 8, (ప్రభాతవార్త)** ఏలేశ్వరం వెంకటేశ్వర ఫంక్షన్ హాల్లో మండల పాస్టర్స్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రిస్మస్ వేడుకలకు శాసన సభ్యురాలు వరుపుల సత్య ప్రభ రాజా ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సత్య ప్రభ మాట్లాడుతూ ప్రభువైన యేసుక్రీస్తు ప్రపంచానికి అందించిన ప్రేమ, దయ, కరుణ వంటి శాశ్వత సందేశాలు మానవాళికి మార్గదర్శకం" అన్నారు.క్రీస్తు బోధనలను ఆచరిస్తూ సమాజంలో శాంతి, సౌహార్దాలు మరింత చిగురించాలని పిలుపునిచ్చారు. తన భర్త రాజా జీసస్ భక్తుడిగా సమాజానికి సేవ చేసిన విషయాన్ని గుర్తుచేసిన ఆమె, నియోజకవర్గ ప్రజలందరికీ జీసస్ ఆశీర్వాదాలు కలగాలని అన్నారు. క్రైస్తవ సోదరులకు ఎల్లప్పుడూ అండగా ఉంటామనే హామీ ఇచ్చారు.అనంతరం క్రిస్మస్ కేక్‌ను కట్ చేసి, క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో క్రైస్తవ మతపెద్దలు,పాస్టర్లు,స్థానిక నాయకులు,భక్తులు పెద్ద సంఖ్యలోపాల్గొన్నారు..



# ప్రజలన్నా, దేవుడు అన్నా జగన్‌కు భయం లేదు

### తిరుమలలో మాఫియా రాజ్యం నడిపారని మంత్రి రామానాయుడు ఆరోపణలు

పాలకొల్లు, డిసెంబరు 8 ప్రభాతవార్త: పవిత్ర తిరుమలలో మాఫియా రాజ్యం నడిపిన వ్యక్తి జగన్ అని రాష్ట్ర జలవనర్ల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు ఆరోపించారు. పాలకొల్లులో మీడియాతో మాట్లాడుతూ పరకామణిలో చోరీని చిన్న దొంగతనమని జగన్ మాట్లాడటం భక్తుల నమ్మకాన్ని అవమానించడమేనన్నారు. పరకామణిలో 75 వేలు చిన్నపాటి చోరీకే శిక్ష వేస్తారా అని జగన్ ప్రశ్నిస్తున్నాడని, దేవుడు హుండీ సొమ్ము చిన్నదవుతుందా అని మంత్రి ప్రశ్నించారు. పరకామణిలో చిన్న చోరీ అనడం గజదొంగ, ఇంకో దొంగను సపోర్టు చేసినట్టుగా ఉందన్నారు. దేవుడు హుండీ దొంగతనాన్ని కూడా జగన్ సమర్థించడం సిగుచేటన్నారు. 16చార్జిషీట్లలో ఎ1గా ఉన్న వ్యక్తి, రాష్ట్రంలో స్వేచ్ఛగా తిరుగుతుంటే 75 వేలు చోరీ చిన్నదిగా కనిపిస్తుంది కాబోలన్నారు. జగన్‌కు ప్రజలన్నా, దేవుడు అన్నా భయం లేదన్నారు. దొంగ చేతికి అధికారం ఇస్తే ఏమవుతుందో జగన్ పాలనే నిదర్శనమన్నారు. జగన్‌కు ప్రజల మీద కన్నా, నేరగాళ్ళు, దోపిడీదారులు, బెట్టింగ్ మాఫియా, లిక్కర్ మాఫియా మీదే ప్రేమ ఎక్కువన్నారు. ప్రతిపక్ష హోదా కూడా లేకుండా, ప్రజలు తీర్పిచ్చినా జగన్ వైఖరిలో మార్పు కనిపించడం లేదన్నారు. వైసీపీ బ్రతుకంతా అబద్ధాలు, అసత్య లేనన్నారు. ఒక్క ఛాన్స్ అంటూ అధికారంలోకి వచ్చిన జగన్ రాష్ట్రాన్ని ఇరవై ముప్పై ఏళ్లు వెనక్కి తీసుకెళ్లి రాష్ట్రాన్ని ఆర్థికంగా విచ్ఛిన్నం చేశాడన్నారు.

# ఢిల్లీ విమానాశ్రయంలో రూ.4.8 కోట్ల విదేశీ గంజాయి జప్తు

హైదరాబాద్, డిసెంబరు 8, ప్రభాతవార్త: ఢిల్లీలో ఇందిరాగాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో ఆదివారం రాత్రి బ్యాంకాక్ నుంచి ఢిల్లీ వచ్చిన ఒక ప్రయాణీకుడి వద్ద నుంచి 4.08 కిలోల విదేశీ గంజాయిని కస్టమ్స్ అధికారులు జప్తు చేశారు. సదరు ప్రయాణీకుడి లగేజిని తనిఖీ చేస్తుండగా ఒక బ్యాగుపై అనుమానం వచ్చిన కస్టమ్స్ అధికారులకు దానిని స్కానింగ్ చేయగా విదేశీ గంజాయి ప్యాకెట్లు చక్కగా ప్యాక్ చేసి వుండడం కనిపించింది. చిన్నపాటి సంచుల్లో దీనిని ప్యాక్ చేసి వుండగా పట్టుకున్నారు. దీని విలువ 4.8 కోట్ల రూపాయలుగా కస్టమ్స్ అధికారులు తెలిపారు. పట్టు బడ్డ ప్రయాణీకుడు భారత్‌కు చెందిన వాడుగా తేలింది. అతనిపై ఎన్‌డిపిఎస్ చట్టం కింద కేసు నమోదు చేసి, రిమాండుకు తరలించారు. దేశంలోని అంతర్జాతీయ విమానాశ్రయాలలో విదేశీ గంజాయి పట్టుబడడం ఇటీవల కాలంలో ఎక్కువయ్యింది. శంషాబాద్, ముంబాయి, బెంగళూరు, చెన్నై అంత ర్జాతీయ విమానాశ్రయాలలో పదుల కిలోల విదేశీ గంజాయి పట్టుబడగా పదుల సంఖ్యలో స్మగ్లర్లు అరెస్టయ్యారు. ఇందులో కొందరు విదేశీయులు కూడా ఉన్నారు.

# సికింద్రాబాద్‌లో యువతి హత్య

### పెళ్లికి నిరాకరించిందని కత్తితో పొడిచి చంపిన బావ





పవిత్ర (ఫైల్)

హైదరాబాద్ (సికిందరాబాద్), డిసెంబరు 8, ప్రభాతవార్త: పెళ్లికి నిరాకరి స్తుందన్న కోపంతో ఓ యువకుడు.. యువతిని తల్లి ముందే దారుణంగా కత్తితో పొడిచి చంపాడు. ఈ సంఘటన వారాసిగూడ పోలీస స్టేషన్ పరిధి లోని బాపూజీనగర్‌లో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఇంటర్ మీడియట్ పూర్తిచేసిన పవిత్ర (19) ఇంట్లోనే ఉంటోంది. వరుసకు బావ అయిన రహమత్‌నగర్‌లో నివాసం ఉండే ఉమాశంకర్(25) టైల్స్ పని చేసేవాడు. కాగా తరచుగా బాపూజీనగర్‌లోని పవిత్ర ఇంటికి వచ్చి ఆమె తనను వివాహం చేసుకోవాలని ఒత్తిడి తెచ్చాడు. అతని ప్రవర్తన నచ్చని కారణంగా పెళ్లి చేయడానికి పవిత్రకు, ఆమె తల్లితండ్రులకు ఇష్టం లేదు. సోమవారం కూడా పవిత్ర తల్లిముందే తనను వివాహం చేసుకోవాలని ఒత్తిడి తెచ్చాడు. అంగీకరించకపోవడంతో తనవెంట తెచ్చుకున్న కత్తితో పవిత్ర మెడపైన తీవ్రంగా పొడిచి హత్యచేసి పారిపోయాడు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నారు.

# పిహెచ్‌సి స్థాయిలోనే స్క్రబ్ టైఫస్ నిర్ధారణ పరీక్షలు

- 9 మరణాలు అనుమానిత కేసులు మాత్రమే
- లోతైన పరీక్షల కోసం జీనోమ్ స్వీకెన్సీ చేయిస్తాం
- ప్రభావిత ప్రాంతాలకు ఆర్ఆర్ టీములు పంపుతున్నాం
- రాష్ట్ర వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ వీరపాండియన్ స్పష్టీకరణ



విజయవాడ, డిసెంబరు 8 ప్రభాతవార్త ప్రతినిధి: స్క్రబ్ టైఫస్ జ్వరాల నిర్ధారణ పరీక్షల నమూనాలను జ్వర పీడితుల్లో అవసరమైన వారి నుంచి పీహెచ్‌సీల స్థాయిలోనూ సేకరిస్తున్నట్లు రాష్ట్ర వైద్య, ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ వీరపాండియన్ వెల్లడించారు. స్క్రబ్ టైఫస్ జ్వరాలు సాధారణమైన వాటిల్లో ఒకటని తెలిపారు. స్క్రబ్ టైఫస్ వల్లే మరణాలు జరిగినట్లు ఇప్పటివరకు నిర్ధారణ జరగలేదని స్పష్టంచేశారు. రాష్ట్రంలో ఇప్పటివరకు 1,566 స్క్రబ్ టైఫస్ జ్వరాల కేసులు (పాజిటివ్) నమోదైనట్లు తెలిపారు. ఈ జ్వరం వచ్చి మరణించిన వారిలో తొమ్మిది మంది ఉన్నా, ఇవి దేనివల్ల జరిగాయన్న దానిపై పరిశోధన జరగాల్సి ఉందని వెల్లడించారు. ఇందుకు కనీసం రెండు నెలల నుంచి మూడు నెలల వరకు సమయం పట్టే అవకాశం ఉందని సూత్రప్రాయంగా తెలిపారు. బాధితుల నుంచి సేకరించిన నమూనాలను జీనోమ్ స్వీకెన్సీ (గుంటూరు, తిరుపతి) ద్వారా పరీక్ష చేయించేందుకు కూడా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల్లో కంటే రాష్ట్రంలో స్క్రబ్ టైఫస్ పాజిటివ్ కేసులు తక్కువగా ఉన్నాయన్నారు. పరీక్షలు విస్తృతంగా చేస్తున్నందువల్లే ఇవి ఎక్కువగా బయటపడుతున్నాయని చెప్పారు. గత మూడేళ్లలో నమోదైన కేసులు పరిశీలించినప్పుడు ఈసారి అసాధారణ పరిస్థితులు కనిపించలేదన్నారు. అధికారికంగా మరణాలు జరగలేదని తెలిపారు.

### ఆర్.ఆర్.టీంల ద్వారా లోతైన పరిశీలన!

మంగళగిరిలోని వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ కార్యాలయంలో సోమవారం సాయంత్రం వైద్య నిపుణులు, ఉన్నతాధికారులతో కలిసి ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో కమిషనర్ వీరపాండియన్ మాట్లాడారు. బోధనాసుపత్రుల్లో ఉండే ర్యాపిడ్ రెస్పాన్స్ టీం (ఆర్ఆర్)లు అధిక కేసులు లేదా అసాధారణ మరణాలు సంభవించినచోట పరిశోధన (ఎపిడెమీయలాజికల్ ఇన్వెస్టిగేషన్) చేస్తాయని తెలిపారు. ఈ క్రమంలోనే స్క్రబ్ టైఫస్ బారినపడిన వారి కేసుల వివరాలు, నివాస పరిసరాల ప్రాంతాలను సైతం ఆర్ఆర్టీ టీమ్లు పరిశీలించి ప్రభుత్వానికి తీసుకోవాల్సి న జాగ్రత్తలను తెలియచేయనున్నాయని వెల్లడించారు. రాష్ట్రంలోని 26 జిల్లాల్లో ఆర్ ఆర్ టీంలు ఉన్నాయని తెలిపారు. అన్ని బోధనాసుత్రుల్లో స్క్రబ్ టైఫస్ నిర్ధారణ పరీక్షలు చేస్తున్నామన్నారు. వీటితోపాటు హిందూపురం, టెక్కలి, పాడేరు, తెనాలి జిల్లా ఆసుపత్రుల్లోనూ ఈ పరీక్షలు జరుగుతున్నాయని తెలిపారు. దిగువ స్థాయి ఆసుపత్రుల నుంచి వచ్చే నమూనాలను ఈ ల్యాబ్‌లో పరీక్షిస్తున్నారని తెలిపారు. అధిక కేసులు నమోదైన ప్రాంతాలను గుర్తించి వ్యవసాయ, పంచాయతీరాజ్, ఇతర శాఖలతో కలిపి అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు.

### శరీర భాగంపై నల్లటి మచ్చ కనిపించి... జ్వరం వస్తే జాగ్రత్తపడాలి"

కీటకం కుట్టిన శరీర భాగంపై నల్లటి మచ్చ దద్దురుతో వస్తుంది. ఈ మచ్చ స్క్రబ్ టైఫస్ సంకేతం. దీనికి అనుగుణంగా వైద్యులు రోగుల ఇతర అనారోగ్య వివరాలు పరిగణనలోకి తీసుకుని వైద్యం అందిస్తారు. అవసరమైన రక్త నమూనాలు సేకరించి, పరీక్షలు కూడా చేయిస్తారు.

### కర్ణాటక, తమిళనాడుల్లో కేసులు అత్యధికం!

కర్ణాటకలో 2024లో 1,689, తమిళనాడులో 6,925, తెలంగాణాలో 195 రాగా ఏపీలో 1,613 కేసులు వచ్చాయి. 2025లో ఇప్పటివరకు కర్ణాటకలో 1,870, తమిళనాడులో 7,308, తెలంగాణాలో 309, ఏపీలో ఇప్పటివరకు 1,566 చొప్పున కేసులు వచ్చాయని కమీషనర్ వీరపాండియన్ వివరించారు.

ముఖ్యంగా ఎలీశా పరీక్ష చేయించి, స్క్రబ్ టైఫస్‌అవగాహనకు వస్తారు. గుంటూరు జీజీహెచ్‌లో గడిచిన 38 రోజుల్లో 26 స్క్రబ్ టైఫస్ కేసులు వచ్చాయి. ఇందులో ముగ్గురు ఐసీయూలో ఉన్నారు. ఇతర దీర్ఘకాల వ్యాధులు ఉండి, చనిపోయిన వారిలో న్యూరాలజికల్ సమస్యలు కూడా కనిపించాయి. ఇక్కడికి రాకముందు. సరైన వైద్యాన్ని పొంద కుండా విషమించిన పరిస్థితుల్లో రావడం, ఉన్నత చికిత్స కు శరీరం సహకరించక ప్రాణాలు విడుస్తున్నారు. దీర్ఘకాల వ్యాధులు లేనివారు వెంటనే నాలుగైదురోజుల్లో కోలుకున్నారని గుంటూరు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ రమణ యశస్వీ వెల్లడించారు. "మా వద్దకు ఎన్టీఆర్, బాపట్ల, కృష్ణా, ప్రకాశం, పల్నాడు జిల్లాల నుంచి కేసులు వచ్చాయి. పల్నాడు, బాపట్ల జిల్లాలకు ఆర్ఆర్ టీంలు పంపాం. రొటీన్‌గా రోగులకు ఇచ్చే డాక్సిసైక్లిన్, అజిత్రోమైసిన్ మాత్రలతో స్క్రబ్ టైఫస్ బాధితులు పూర్తిగా కోలుకుంటున్నారు బాధితుల నుంచి సేకరించిన రక్త నమూనాల్లో స్క్రబ్ టైఫస్‌వచ్చిందా? లేదా అన్న దాని గురించి ఎలిశా టెస్టు ద్వారా 24 గంటల్లో తెలిసిపోతుందని డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ డాక్టర్ పద్మావతి, అదనపు సంచాలకులు డాక్టర్ సుబ్రహ్మణ్యేశ్వరి, జాయింటు డైరెక్టర్ మల్లీశ్వరి వెల్లడించారు. ఇన్ఫెక్షియస్ డీసీజెస్ వైద్య నిపుణులు డాక్టర్ కల్యాణచక్రవర్తి మాట్లాడుతూ మరణాలు స్క్రబ్ టైఫస్ ద్వారానే జరిగినట్లు నిర్ధారించాలంటే సదరు వ్యక్తుల నుంచి సేకరించిన రక్త నమూనాలను జీనోమ్ స్వీకెన్సీ ద్వారానే నిర్ధారించాల్సి ఉందన్నారు. భవిష్యత్తు అవసరాలకు ఇది చేయాల్సి న అవసరం ఉందన్నారు. ప్రస్తుత సమాచారంతో 9 మరణాలు స్క్రబ్ టైఫస్ ద్వారా జరిగిందని చెప్పలేమన్నారు. విలేకర్ల సమావేశంలో డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ డాక్టర్ రఘునందన్, ఇతర అధికారులు పాల్గొన్నారు.




# నెల్లూరు జిల్లాలో విభజనను వ్యతిరేకిస్తూ కలెక్టరేట్ ముట్టడి

నెల్లూరు కలెక్టరేట్, డిసెంబరు 8 ప్రభాతవార్త: సోమవారం నెల్లూరు జిల్లాలో విభజనను వ్యతిరేకిస్తూ కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాలో నెల్లూరు నుండి మండలాల విభజనపై ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రజలకు జవాబు చెప్పాలని బిజెపి నేత మిడతల రమేష్ డిమాండ్ చేశారు. కండలేరు జలాశయం విభజన మూలంగా జలవివాదాలు నెలకొంటాయి. కరువు సమయంలో నెల్లూరు జిల్లాలో పొదలకూరు మనుబోలు ఆయ కట్టుదారులు నీటి సమస్యను ఎదుర్కొంటారు.

తిరుపతి నెల్లూరు అధికారుల మధ్య జలవివాదాలు ఏర్పడతాయని రమేష్ తెలిపారు. కండలేరు ముంపు నిరుద్యోగుల ఉద్యోగాల సమస్య జటిలమవుతుందని కలవాయి నుండి నెల్లూరు 60 కిలోమీటర్లు తిరుపతికి 140 కిలో మీటర్లు దూరంలో ఉన్నందున ప్రజలు ప్రయాణ భారాన్ని ఎదుర్కొంటారని వివరించారు. 1882 బ్రిటిష్ కాలం నుండి రాపూర్ అటవీ క్షేత్రం కలువాయి మండలాలు ఒకే డివిజన్లో ఉన్నాయి.

ప్రపంచంలోనే అత్యంత నాణ్యత కలిగిన ఎర్రచందనం నెల్లూరు జిల్లా రాపూర్‌లో మాత్రమే ఉన్నందున ప్రపంచంలోనే నెల్లూరుకు గుర్తింపు ఉందని మిడతల రమేష్ వివరించారు. 44 లక్షల సంవత్సరాల నుండి పెనుశీల లక్ష్మినరసింహస్వామి ఆలయం నెల్లూరు జిల్లాలోనే ఉందని. వీటిని దూరం చేసుకునేందుకు నెల్లూరు జిల్లా ప్రజల సిద్ధంగా లేరని పేర్కొన్నారు. ఎందుకు విభజన చేస్తున్నారో ఎవరి కోసం చేస్తున్నారో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నెల్లూరు ప్రజలకు జవాబు చెప్పాలని రమేష్ డిమాండ్ చేశారు.

చేనేత ఐక్యవేదిక జిల్లా కన్వీనర్ బుధవరపు బాలాజీ మాట్లాడుతూ నెల్లూరు జిల్లా ప్రజలకు అన్యాయం జరుగుతుంటే ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఎందుకు మౌనంగా ఉన్నారు అని ప్రశ్నించారు. ఇద్దరు ముగ్గురు వ్యక్తుల కోసం నెల్లూరు నుండి రాపూరు కలువయి సైదాపురం వేరు చేయడం బ్రిటిష్ పాలన కంటే దుర్మార్గంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి నేతలు కందికట్ల రాజేశ్వరి, బైరి శ్రీనివాస్, నరాల సుబ్బారెడ్డి, బీసీ సంక్షేమ సంఘం అధ్యక్ష ఉపాధ్యక్షులు సమాధి శ్రీనివాసులు, సోమ అనురాధ, బీసీవై పార్టీ నేతలు హజరత్ యాదవ్, సోమ గోపాల్, మనోహర్ హింద్, ఆనందు, నరేష్, చింత గింజల సుబ్రమణ్యం, పూల ప్రశాంత్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# బాలివుడ్ దర్శకుడు విక్రమ్‌భట్ దంపతుల అరెస్టు



జైపూర్, డిసెంబరు 8: ప్రముఖ బాలీవుడ్ ఫిల్మ్‌మేకర్ విక్రమ్ భట్, ఆయన భార్య శ్వేతాంబరి భట్‌ను రాజస్థాన్ పోలీసులు అరెస్ట్ చేశారు. సుమారు రూ. 30 కోట్ల మోసం కేసుకు సంబంధించి వారిని అదుపులోకి తీసుకున్నారు. ఉదయ్‌పూర్‌కు చెందిన ఇందిరా గ్రూప్ ఆఫ్ కంపెనీస్ యజమాని డాక్టర్ అజయ్ ముర్డియా చేసిన ఫిర్యాదు మేరకు ఈ చర్యలు తీసుకున్నారు. విక్రమ్ భట్ దంపతులను కస్టడీలోకి తీసుకున్న పోలీసులు, వారికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ట్రాన్సిట్ రిమాండ్ పొందిన తర్వాత వారిని ఉదయ్‌పూర్‌కు తరలించారు. ఈ కేసులో ఆరుగురు నిందితులకు పోలీసులు గతంలోనే నోటీసులు జారీ చేసారు. డాక్టర్ అజయ్ ముర్డియా దివంగత భార్య జీవితంపై బయోపిక్ తీస్తామని విక్రమ్ భట్, ఆయన బృందం నమ్మించారని ఎఫ్ఐఆర్‌లో పేర్కొన్నారు. ఈ సినిమా ద్వారా రూ. 200 కోట్ల లాభాలు వస్తాయని చెప్పి, తన నుంచి రూ. 30 కోట్లు తీసుకుని మోసం చేశారని అజయ్ ముర్డియా ఆరోపించారు. ఈ మేరకు ఉదయ్ పూర్‌లోని భూపాల్‌పురా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ ఆరోపణలపై విక్రమ్ భట్ స్పందించారు. మీడి యాతో మాట్లాడుతూ, తనపై నమోదైన ఎఫ్ఐఆర్ తప్పుదారి పట్టించేలా ఉందని, అందులోని ఆరోపణలు పూర్తిగా అవాస్తవమని కొట్టిపారేశారు. పోలీసులను నమ్మించడానికి నకిలీ పత్రాలు సృష్టించి ఉండవచ్చని ఆయన అనుమానం వ్యక్తం చేశారు. విరాట్ అనే సినిమాను డాక్టర్ అజయ్ ముర్డియానే మధ్యలో ఆపేశారని, టెక్నీషియన్లకు ఇంకా రూ.250 కోట్లు చెల్లించాల్సి ఉందని విక్రమ్ ఆరోపించారు. ఆ బకాయిలు ఎగ్గొట్టేందుకే ఈ ఎఫ్ఐఆర్ నమోదు చేయించారని ఆయన అన్నారు. తాను విచారణకు పూర్తిగా సహకరిస్తానని, తన వద్ద ఉన్న అన్ని ఆధారాలను పోలీసులకు చూపిస్తానని, అప్పుడు నిజానిజాలు బయట పడతాయని విక్రమ్ భట్ తెలిపారు

# తెలంగాణలో అనూహ్యంగా పడిపోయిన ఉష్ణోగ్రతలు

### 12 జిల్లాల్లో సింగిల్ డిజిట్‌కు దిగజారిన వైనం

**హైదరాబాద్, డిసెంబరు 8, ప్రభాతవార్త:** తెలంగాణలో చలి తీవ్రత మరింత పెరిగింది. ఒక్కరోజులోనే అనూహ్యంగా పలు జిల్లాలలో నాలుగు డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు పడిపోయాయి. 12 జిల్లాలలో అత్యల్ప ఉష్ణోగ్రతలు నమోదవడంతో పాటు సింగిల్ డిజిట్‌కు పడిపోయాయి. సంగారెడ్డిలో అత్యల్పంగా 7.2 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు కాగా వికారాబాద్‌లో 7.8, ఆదిలాబాద్ లో 7.9 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. జోగుళాంబ గద్వాల్ జిల్లాలోనే అత్యధికంగా 14.7 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదయ్యింది. వచ్చే వారం రోజుల్లో ఉష్ణోగ్రతలు మరింతగా పడిపోయే అవకాశం వుందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. రాష్ట్రంలో చలి పులి వణికిస్తోంది. శనివారంతో పోలిస్తే ఆదివారం రాత్రి, సోమవారం ఉదయం 12 జిల్లాలలో ఉష్ణోగ్రతలు మరింత తగ్గాయి. ఉత్తరాది రాష్ట్రాల నుంచి చలిగాలుల తీవ్రత పెరగడంతో పాటు హిమాలయాల నుంచి శీతలగాలుల ప్రభావం కారణంగా తెలంగాణలో చలి తీవ్రత పెరిగిందని వాతావరణ శాఖ అధికారులు చెబుతున్నారు. చలి తీవ్రత పెరగడం వల్ల చాలాచోట్ల ప్రజలు చలి మంటలను ఆశ్రయించాల్సి వస్తోంది. గ్రామీణ ప్రాంతాలలో చలి ప్రభావం ఎక్కువగా వుంది. ఇదే సమయంలో పొగమంచు రహదారులను కమ్మేస్తుండడంతో వాహనదారులు రహదారులపై వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నారు. ఆదివారం రాత్రి ఆయా జిల్లాలలో నమోదైన ఉష్ణోగ్రతల వివరాలు ఇలావున్నాయి. సంగారెడ్డిలలో శని వారం రాత్రి 11.1 డిగ్రీలుగా వున్న ఉష్ణోగ్రత ఆదివారం రాత్రి ఒక్కసారిగా 3.9 డిగ్రీలు తగ్గి 7.2 డిగ్రీలకు పడిపోయింది. వికారాబాద్‌లో శనివారం రాత్రి 11.8 డిగ్రీల ఉష్ణోగ్రత వుండగా ఆదివారం రాత్రి నాలుగు డిగ్రీలు తగ్గి 7.8 డిగ్రీలకు పడిపోయింది. ఆదిలాబాద్‌లో శనివారం రాత్రి ఎని మిది డిగ్రీల ఉష్ణోగ్రత వుండగా ఆదివారం రాత్రి 7.9 డిగ్రీలుగా వుంది. కామారెడ్డిలో శనివారం రాత్రి 11.2 డిగ్రీల ఉష్ణోగ్రత వుండగా ఆదివారం రాత్రి మూడు డిగ్రీలు తగ్గి 8.2 డిగ్రీలుగా వుంది. కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలో 9.1 డిగ్రీల నుంచి 8.2 డిగ్రీలకు, మెదక్‌లో 11.5 డిగ్రీల నుంచి 8.5 డిగ్రీలకు, నిజామాబాద్‌లో 11.3 నుంచి 8.4 డిగ్రీలకు, రంగారెడ్డి జిల్లాలో 12.2 డిగ్రీల నుంచి 8.4 డిగ్రీలకు, సిద్దిపేటలో 11.3 డిగ్రీల నుంచి 8.9 డిగ్రీలకు ఉష్ణోగ్రతలు పడిపోయాయి. నిర్మల్‌లో 10.5 డిగ్రీల నుంచి 9 డిగ్రీలకు, సిరిసిల్లాలో 10.9 డిగ్రీల నుంచి 9.2 డిగ్రీలకు, జగిత్యాలలో 11.4 డిగ్రీల నుంచి 9.9 డిగ్రీలకు, పెద్దపల్లిలో 11.8 డిగ్రీల నుంచి 10.1 డిగ్రీలకు, మేడ్చల్ 12.9 డిగ్రీల నుంచి 10.2 డి గ్రీలకు, భూపాల పల్లిలో 12.1 డిగ్రీల నుంచి 10.3 డిగ్రీలకు, భువనగిరిలో 13.2 డిగ్రీల నుంచి 10.4 డిగ్రీలకు, మంచిర్యాలలో 11.4 డిగ్రీల నుంచి 10.4 డిగ్రీలకు, కరీంనగర్ 12.2 డిగ్రీల నుంచి 10.4 డిగ్రీలకు, ములుగులో 12 డిగ్రీల నుంచి 10.5 డిగ్రీలకు, జనగాంలో 12.4 డిగ్రీల నుంచి 10.7 డిగ్రీలకు, హనుమకొండలో 12.1 డిగ్రీల నుంచి 11.2 డిగ్రీలకు, మహబూబ్‌నగర్‌లో 15.2 డిగ్రీల నుంచి 11.4 డిగ్రీలకు, వరంగల్‌లో 12.5 డిగ్రీల నుంచి 11.7 డిగ్రీలకు ఉష్ణోగ్రతలు పడిపోయాయి.నారాయణ్‌పేట్‌లో 14.3 డిగ్రీల నుంచి 11.8 డిగ్రీలకు, మహబూబాబాద్‌లో 13.1 డిగ్రీల నుంచి 11.8 డిగ్రీలుగా నమోదైంది.

# 'ఫీనిక్స్' పక్షి స్ఫూర్తితోనే 'తెలంగాణ రైజింగ్'కు శ్రీకారం




### ప్రతి అడుగు, ఆలోచన భావితరాల కోసమే.. ఫ్యూచర్ సిటీలో ఎఐ యూనివర్సిటీ

### గ్లోబల్ సమ్మిట్‌లో మంత్రి శ్రీధర్‌బాబు ప్రసంగం

హైదరాబాద్, డిసెంబరు 8, ప్రభాతవార్త: 'ఫీనిక్స్' పక్షి స్ఫూర్తితోనే 'తెలంగాణ రైజింగ్'కు శ్రీకారం చుడతామని మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. 3 ట్రిలియన్ డాలర్లకు చేర్చేలా దార్శనికతతో కూడిన అడుగులు వేస్తామన్నారు. 'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్-2047 ప్రారంభోత్స వంలో మంత్రి శ్రీధర్ బాబు భవిష్యత్తు కోసం ఎదురు చూడకుండా... దానిని మనం నిర్మించాలన్నదే తమ ప్రభుత్వ సంకల్పమని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు స్పష్టం చేశారు. మేం వేసే ప్రతి అడుగు... చేసే ఆలోచన భావితరాల ఆశయాలు, అవసరాలకు అనుగుణంగా 'రేపటి తెలంగాణ' కోసమేనని వివరించారు.

'ఫీనిక్స్' పక్షిస్ఫూర్తితో ఇన్నోవేషన్, హ్యూమన్ క్యాపిటల్, సస్టైనబులిటీ, గ్లోబల్ ఇన్వెస్ట్మెంట్ డెస్టినేషన్‌గా తెలంగాణను మార్చాలనే లక్ష్యంతోనే "తెలంగాణ రైజింగ్"కు శ్రీకారం చుట్టామన్నారు. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా ఎదురవుతున్న ఎకనామిక్ రీ అలైన్‌మెంట్స్, టెక్నలాజికల్ డిస్రప్షన్, క్లైమేట్ అన్‌సెర్టైనిటీ లాంటి సవాళ్లను అవకాశాలుగా మార్చుకొని 2047 నాటికి తెలంగాణ ఆర్థిక వ్యవస్థను 3 ట్రిలియన్ డాలర్లకు చేర్చేందుకు దార్శనికతతో కూడిన అడుగులు వేస్తున్నామన్నారు.

ఈ ప్రయాణంలో తెలంగాణ ప్రజల ఆశీర్వాదంతో తమ ప్రభుత్వం వేసిన తొలి అడుగు "తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ 2025" అన్నారు. భౌగోళిక విస్తీర్ణం, జనాభాలో ఇతర రాష్ట్రాలతో పోలిస్తే తెలంగాణ చిన్నదే అయినప్పటికీ దేశ జీడీపీలో మాత్రం 5 శాతం వాటాను కలిగి ఉందన్నారు. 2024-25లో రాష్ట్ర జీఎస్డీపీ వృద్ధి రేటు 10.1 శాతం కాగా, జాతీయ సగటు 9.9 శాతంగా నమోదు అయ్యిందన్నారు. రాష్ట్ర తలసరి ఆదాయం రూ.3.79 లక్షలు, జాతీయ సగటు కంటే 1.8 రెట్లు ఎక్కువ అని వివరించారు.

రాష్ట్ర ఇండస్ట్రియల్, మాన్యుఫ్యాక్చరింగ్ ఎకానమీ వృద్ధి రేటు 7.6 శాతం కాగా, జాతీయ సగటు 6.6 శాతం మాత్రమే అన్నారు. రాష్ట్ర సేవల రంగం వృద్ధి రేటు 11.9 శాతంగా కాగా, అదే జాతీయ సగటు 10.7 శాతంగా ఉందన్నారు. రాష్ట్ర ఇండస్ట్రియల్ జీఎస్ వీఏ 12.6 శాతం వృద్ధి రేటుతో రూ.2.46 లక్షల కోట్ల నుంచి రూ.2.77 లక్షల కోట్లకు పెరిగిందన్నారు. మాన్యుఫ్యాక్చరింగ్, కన్ స్ట్రక్షన్, మైనింగ్, క్వారీయింగ్, ఎలెక్ట్రిసిటీ, గ్యాస్, వాటర్, ఇతర యుటిలిటీస్ లాంటి ఇండస్ట్రియల్ సబ్ సెక్టార్లలోనూ తెలంగాణ వృద్ధి రేటు జాతీయ సగటు కంటే ఎక్కువగా నమోదు కావడం తమ ప్రభుత్వ పనితీరుకు నిలువెత్తు నిదర్శనమన్నారు. దేశంలోనే తొలి ఏఐ పవర్డ్ విలేజ్‌గా మారిన మంథని నియోజకవర్గంలోని ఒక మారుమూల గ్రామం "రేపటి తెలంగాణ"కు మార్గదర్శిగా నిలిచిందని మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు.

భారత్ ఫ్యూచర్ సిటీ, తెలంగాణ ఏఐ ఇన్నోవేషన్ హబ్, ఏఐ ఆధారిత తెలంగాణ డేటా ఎక్స్ఛేంజ్, ఏఐ యూనివర్సిటీ, స్కిల్ యూనివర్సిటీ, అడ్వాన్స్డ్ ఐటీఐలు, ఏఐ ఆధారిత అకడమిక్ కరిక్యులం, యంగ్ ఇండియా ఇంటర్నేషనల్ స్కూల్స్, లైఫ్ సైన్సెస్ హబ్ "వన్ బయో", సెంటర్ ఆఫ్ ఎక్సెలెన్స్ ఇన్ క్వాంటం టెక్నాలజీ లాంటి విప్లవాత్మక అడుగులు ప్రపంచపటంలో "తెలంగాణ"ను ప్రత్యేకంగా నిలుపుతాయన్నారు. రేపటి కోసం, భవిష్యత్ తరాలకు భరోసాగా తెలంగాణతో కలిసి భవిష్యత్తును నిర్మించేందుకు ముందుకు రావాలని పారిశ్రామికవేత్తలు, ఆవిష్కర్తలు, నిపుణులకు మంత్రి శ్రీధర్ బాబు ఆహ్వానం పలికారు.

## రావులపాలెం అరటి మార్కెట్ యార్డు అభివృద్ధికి కృషి.



**రావులపాలెం, డిసెంబరు 08 (ప్రభాతవార్త) :** రావులపాలెం అరటి మార్కెట్ యార్డ్ అభివృద్ధికి అన్ని విధాల కృషి చేస్తానని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు తెలిపారు. సోమవారం రాష్ట్ర తెలుగు రైతు ప్రధాన కార్యదర్శి ఆకుల రామకృష్ణ తో కలిసి మార్కెట్ యార్డును పరిశీలించారు. రైతులతో మాట్లాడారు. మార్కెట్ యార్డులో ఉన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మార్కెట్ యార్డు అభివృద్ధికి చర్యలు తీసుకుంటామన్నారు. మార్కెట్ యార్డుకు ఉత్తరం వైపున ఏఎంసి ఆధ్వర్యంలో సిసి రోడ్డు నిర్మాణం చేపడతామన్నారు. మార్కెట్ యార్డ్ బయట రావులపాలెం వెదిరేశ్వరం కాలువవైపు డ్రైనేజీ నిర్మాణం చేపడతామన్నారు, నూతనంగా షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం చేస్తామన్నారు. వే బ్రిడ్జి నిర్మాణం పనులు చేపడతామని తెలిపారు. ఆయా పనులకు సంబంధించి త్వరలోనే ప్రతిపాదనలు రూపొందిస్తామన్నారు. ఎమ్మెల్యే బండారుకు రైతులు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో కె.వి. సత్యనారాయణ రెడ్డి, కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## డిమాండ్ ఆధారిత పంటల సాగుపై రైతులు దృష్టి పెట్టాలి



**రావులపాలెం, డిసెంబరు 08 (ప్రభాతవార్త) :** రైతు నిలదొక్కుకోవాలి, రైతులకు ఆదాయం రావాలనేదే ప్రభుత్వ ఉద్దేశ్యమని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. రావులపాలెం మార్కెట్ యార్డులో రైతుల కోసం రావులపాలెం సొసైటీ అధ్యక్షులు కె.వి.సత్యనారాయణ రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఎరువుల దుకాణం ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఎరువుల దుకాణాన్ని ప్రారంభించిన అనంతరం ఆయన ఆయన ప్రసంగిస్తూ వ్యవసాయంలో నానాటికీ పెరిగిపోతున్న ఖర్చులను తగ్గించడానికి సాంకేతికతను వినియోగించాల్సిన అవసరం ఉందని వ్యాఖ్యానించారు. అందుకోసమే ప్రభుత్వం రైతన్నా మీకోసం కార్యక్రమం నిర్వహించిందని తెలిపారు. తక్కువ ఖర్చుతో పంటలను పండించడం, దిగుబడులు ఎలా పెంచాలి, విత్తనశుద్ధి, రుణ సౌకర్యం, మార్కెటింగ్ మొదలైన అంశాల్లో ప్రభుత్వం రైతులకు అవగాహన కల్పిస్తుందని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, ప్రభుత్వ అధికారులు వ్యవసాయం గురించి మనకి చెప్పాలా? మనకి తెలియని వ్యవసాయమా? అని కొందరు రైతులు అనుకోవచ్చున్నారు. ప్రభుత్వం చెబుతున్న పంచ సూత్రాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. మారిన కాలం బట్టి ముందస్తు అంచనాలతో వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చుకోవాల్సిన అవసరం ఉందన్నారు. డిమాండ్ ఆధారిత పంటలు పండించడం ఎలా? ఏ పంటకు రేటు వస్తుంది అనేది తెలుసుకుని పండించడం, పంట మార్పిడి మొదలైన వాటిపై అవగాహన పెంచుకోవాలన్నారు. పంటలకు విలువ పెంచేందుకు ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు పెట్టుకుంటే సబ్సిడీ కూడా ప్రభుత్వం ఇస్తుందన్నారు. పసుపు పండించడమే కాకుండా, గ్రైండ్ చేసి విక్రయించడం చేయవచ్చున్నారు. అరటి నుంచి 20 వరకూ ఉప ఉత్పత్తులను తయారుచేయచ్చన్నారు. కొబ్బరి ఆధారిత పరిశ్రమలు స్థాపించవచ్చన్నారు. నానో యూరియా వాడటం ద్వారా, డ్రోన్ల ద్వారా పురుగుమందులు చల్లడం ద్వారా శ్రమ, ఖర్చు తగ్గుతాయని అన్నారు. యూరియా వాడకాన్ని తగ్గించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఆకుల రామకృష్ణ, గుత్తుల రాంబాబు,చిలువూరి సతీష్ రాజు, కేతా శ్రీను,జక్కంపూడి బాలాజీ, కొప్పిశెట్టి ప్రసాద్ మరియు కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## డిమాండ్ల పరిష్కారం కోరుతూ ఉద్యగుల ధర్నా




**మామిడికుదురు.డిసెంబర్ 08 (ప్రభాతవార్త)** డిమాండ్ల పరిష్కారం కోరుతూ సహకారశాఖ ఉద్యోగులు సోమవారం స్థానిక డీసీసీబీ బ్రాంచ్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. జీఓ36అమలు చేయాలని,2019,2024 వేతన సవరణ వెంటనే చేపట్టాలని,గ్రాట్యుటీ యాక్ట్ ప్రకారం దీనిని అమలు చేయాలని, డ్యూటీలో పెట్టిన జీతాలను రద్దు చేయాలని,ఉద్యోగుల రిటైర్మెంట్ వయస్సు ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా 62 సం.లకు పెంచాలని,2019 తరువాత చేరిన ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని,సంఘాలకు షేరు ధనం పై ఇవ్వవలసిన డివిడెంట్ వడ్డీ చెల్లింపుతో పాటు ఇతర డిమాండ్లు పరిష్కరించాలని నినాదాలు చేశారు.అనంతరం డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని డీసీసీబీ బ్యాంకు మేనేజర్ కు అందజేశారు.ఈ ధర్నాలో మండల పరిధిలో పనిచేస్తున్న సహకారశాఖ ఉద్యోగులు పాల్గొన్నారు.

## జీసస్ ప్రవచనాలు ఆచరణాత్మకాలు



**కొత్తపేట,డిసెంబర్ 08(ప్రభాతవార్త):** జీసస్ ప్రబోధించిన ప్రవచనాలు సమస్త మానవాళికి ఆచరణాత్మకాలని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు అలాగే పాస్టర్స్ ఫెలోషిప్ భవన నిర్మాణానికి కృషి చేస్తానని అన్నారు ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రభువు విశ్వాసపాత్రులందరూ జరుపుకునే పండుగ క్రిస్మస్ అని ఎమ్మెల్యే సత్యానందరావు అన్నారు వాడపాలెం సీడబ్ల్యూఏ గ్రౌండ్ లో జరిగిన కొత్తపేట మండల పాస్టర్స్ ఐక్య గ్లోరియస్ క్రిస్మస్ వేడుకల్లో ఆయన పాల్గొన్నారు పేదప్రజల కోసం కష్టపడుతున్న ప్రతీ ఒక్కరికీ ప్రభువు ఆశీస్సులు ఉంటాయన్నారు పాస్టర్స్ ఫెలోషిప్ భవన నిర్మాణానికి తప్పక కృషి చేస్తానని తెలిపారు ఆలమూరులో సైతం పాస్టర్స్ ఫెలోషిప్ భవన నిర్మాణానికి ఈ మధ్యే శంకుస్థాపన చెయ్యడం జరిగిందన్నారు

## సహకార సంఘాల ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



**యు.కొత్తపల్లి, డిసెంబర్ 8 (ప్రభాతవార్త):** సహకార సంఘాల ఉద్యోగుల దీర్ఘకాల సమస్యలు పరిష్కరించాలని స్థానిక డీసీసీ బ్యాంకు వద్ద ధర్నా నిర్వహించారు. మండలంలో ఉన్న 5 పీఏసీఎస్ ల సిబ్బంది ఈ ఆందోళనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎండపల్లి పీఏసీఎస్ కార్యనిర్వహణాధికారి గుండ్ర కామేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్త వ్యవసాయ సహకార సంఘాల ఉద్యోగుల యూనియన్ల ఐక్య వేదిక పిలుపు మేరకు ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోరుతూ పలు ఆందోళన కార్యక్రమాలు చేపట్టడం జరిగిందన్నారు. జీఓ నెంబర్ 36 వెంటనే అమలు చేయాలని, 2019, 2024 వేతన సవరణ చేయాలని, గ్రాట్యుటీ చట్ట ప్రకారం అమలుచేయాలని, డ్యూ టూలో పెట్టిన జీతాలను రద్దుచేయాలని, ఉద్యోగుల రిటైర్మెంట్ ను 62 సంవత్సరాలకు పెంచాలని, 2019 తరువాత చేరిన ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని వంటి పలు డిమాండ్లతో ఆందోళన చేపట్టడం జరిగిందన్నారు. వాటిలో భాగంగా 6న నల్ల బ్యాడ్జీలతో విధులకు హాజరు, 8న రాష్ట్ర వ్యాప్తంగా అన్ని డీసీసీబీ బ్రాంచ్ ల వద్ద ధర్నా, 16న జిల్లా సహకార కార్యాలయాల వద్ద ధర్నా, వినతిపత్రం అందజేయడం, 22న అన్ని డీసీసీబీ ప్రధాన కార్యాలయాల వద్ద ధర్నా, వినతిపత్రం అందజేయడం, 29న రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న సహకార సంఘాల ఉద్యోగులతో విజయవాడ లో ధర్నా చౌక్ మహా ధర్నా, ఉన్నతాధికారులకు వినతిపత్రం అందజేయడం, 2026 జనవరి 5న విజయవాడ ధర్నా చౌక్ వద్ద రిలే నిరాహార దీక్షలు చేపట్టడం జరుగుతుందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి తమ సమస్యలు పరిష్కరిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సహకార సంఘాల సిబ్బంది పాల్గొన్నారు.

## అన్నవరంలో చెలరేగిపోతున్న బైక్ దొంగలు

### చోద్యం చూస్తున్న పోలీసులు - ఇటీవల వరుస చోరీలు



**అన్నవరం, డిసెంబర్ 8, (ప్రభాత వార్త).** అన్నవరంలో బైక్ దొంగతనాలు రోజురోజుకి పెరుగుతున్నాయి. విలువైన కొత్త బైక్ లే టార్గెట్ గా చోరీలు జరుగుతున్నాయి. దొంగలు ముందుగా ఆయా ఏరియాలలో సంచరించి అప్రాంత స్థితిగతులు అంచనా వేసుకుని అందరూ నిద్రలోకి జారుకున్నాక అర్ధరాత్రి సమయాలలో బైక్ చోరీలకు పాల్పడుచున్నారు. లేటెస్ట్ గా కొన్న వాహనాలనే ఎంచుకుని మరీ కొట్టేస్తున్నారు.ఒక్క అన్నవరం గ్రామంలోనే ఇటీవల పదుల సంఖ్యలో బైక్ లు చోరీకి గురయ్యాయి.వరుస దొంగతనాలు జరుగుచున్నా,ఫిర్యాదు చేయడానికి స్థానిక పోలీస్ స్టేషన్ కు వెళ్ళినప్పటికీ వారు పట్టించుకోవటంలేదని, జాగ్రత్తగా చూసుకుంటే ఎందుకు పోతాయని పోలీసులు నిర్లక్ష్యంగా మాట్లాడుతున్నారని, ఫిర్యాదులు కూడా తీసుకోవటంలేదని వాహనాలు పోగొట్టుకున్నవారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రతి రోజు రాత్రి పెట్రోలింగ్ పోలీసులు ప్రతీరోజూ నైట్ పెట్రోలింగ్ నిర్వహించాలి. గతంలో రాత్రి వేళల్లో సైరన్ తో పోలీసు పెట్రోలింగ్ వాహనం గ్రామ వీధుల గూండా తిరిగేది. దీంతో దొంగలు నియంత్రణలో ఉండేవి. ప్రస్తుతం పోలీసులు శాంతిభద్రతలు గాలికొదిలేసారని గ్రామస్తులు విమర్శిస్తున్నారు.అన్నవరంలో పోలీస్ స్టేషన్ ఉంది... అన్నట్లుగా పరిస్థితి ఉందని వాహనాలు పోగొట్టుకున్న బాధితులు ఆక్రోశం వ్యక్తం చేస్తున్నారు.

## అంతర్జాతీయ క్రీడాన్యాయ నిర్ణేతగా పాయసం



**అమలాపురం,డిసెంబర్8,ప్రభాతవార్త** ఒడిస్సా మాస్టర్స్ 2025 బ్యాడ్మింటన్ వరల్డ్ ఫెడరేషన్ టూర్ సూపర్ 100 అంతర్జాతీయ టోర్నమెంట్ కు కోనసీమకు చెందిన పాయసం శ్రీనివాసరావుకు అవకాశం దక్కింది.బాడ్మింటన్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా నుంచి ఈమేరకు నియామక ఉత్తర్వులు అందాయని ఆయన తెలిపారు.ఈ టోర్నమెంటును ఒడిస్సా బ్యాట్మెంటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరుగుతుంది అని ఈ అంతర్జాతీయ టోర్నమెంట్ లో వివిధ దేశాలకు చెందిన క్రీడాకారులు పాల్గొంటారని తెలిపారు.అమలాపురం కొంకాపల్లి చెందిన పాయసం శ్రీనివాసరావు బాడ్మింటన్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా గ్రేడ్ వన్ నేషనల్ అంపైర్.నల్లచెరువు హైస్కూల్ పిడి గా విధులు నిర్వహిస్తున్నారు.ఎంతో ప్రతిష్టాత్మకమైన ఒడిస్సా మాస్టర్స్ 2025 బ్యాడ్మింటన్ వరల్డ్ ఫెడరేషన్ టూర్ సూపర్ 100 అంతర్జాతీయ టోర్నమెంట్ కు న్యాయనిర్ణేతగా బాడ్మింటన్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా నియమించిదని తెలిపారు. పాయసం గతంలో పలు జాతీయ అంతర్జాతీయ టోర్నమెంట్ లకు న్యాయ నిర్నేతగా విధులు నిర్వహించారు.ఈటోర్నమెంట్ ఈనెల 9 వ తేదీ నుండి14 తేదీ వరకు కటక్ జవహర్ లాల్ నెహ్రూ స్టేడియంలో జరుగునని తెలిపారు.పాయసం శ్రీనివాస రావు ను అభినందించిన వారిలో ఆంధ్రప్రదేశ్ బాడ్మింటన్ అసోసియేషన్ సెక్రటరీ అంకమ్మ చౌదరి,ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అసోసియేషన్ సెక్రటరీ బాలు,కె. ఎస్.బి. ఎ. అధ్యక్షులు మెట్ల రమణ బాబు, సీనియర్ వైస్ ప్రెసిడెంట్ అల్లాడ శరత్, బీవీసి విద్యా సంస్థల అధినేత బోనం కనకయ్య,రాష్ట్ర టిడిపి నాయకులు గంధం పళ్లంరాజు, మాజీ మున్సిపల్ చైర్మన్ యాళ్ళ సతీష్, జనసేన నాయకులు కల్వకొలను తాతాజీ తదితరులు అభినందించారు

## ఘనంగా భారతీయ భాషా ఉత్సవం



**గోపాలపురం డిసెంబర్ 08, (ప్రభాతవార్త):** గోపాలపురం మండలంలోని జగన్నాధపురం హై స్కూల్ నందు మహాకవి సుబ్రహ్మణ్య భారతి జయంతిని ఘనంగా నిర్వహించారు. భారతి చిత్రపటానికి ఉపాధ్యాయులందరు పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఇన్చార్జ్ హెచ్ఎం ఆనంద్ ఇస్సాక్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో తెలుగు ఉపాధ్యాయులు బుర్రా ప్రసాద్ మాట్లాడుతూ.. భాషలు వేరైనా భావం ఒకటేనని, భారతి వారి సాహిత్య సంపదను పురస్కరించుకుని 'భారతీయ భాష ఉత్సవం' నిర్వహిస్తున్నామని అన్నారు. భారతికి 32 భాషల్లో ప్రావీణ్యం ఉందని, తన 11వ ఏటనే మహాకవిగా గుర్తింపు పొందాడని అన్నారు. ఈ కార్యక్రమంలో నేడు సామెతల్లో ఏకతా-భాషా మిత్ర అనే అంశం నిర్వహించారు. భాష దేశ వైవిధ్యాన్ని, సంస్కృతిని తెలియజేస్తుందని మరియు భాషలు వేరైనా సామెతలు అంతర్లీనం ఒకటేనని సామెతలు గొప్పతనం గురించి తెలియజేశారు. ప్రజల అనుభవాల నుంచే సామెతలు పుడతాయని అన్నారు. సామెతలలో భాషా సౌందర్యం, అనుభవ సారం, నీతి సూచన, హాస్యం కలగలిపి ఉంటాయన్నారు. సామెతలు ఆ భాష మాట్లాడే ప్రజల సంస్కృతిని, సాంప్రదాయాలను ప్రతిబింబిస్తాయి అని అన్నారు. సామెతలు ప్రసంగానికి దీపాలాంటివని, సంభాషణకు కాంతినిస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పద్మజ, చంద్రశేఖర్, గంగరాజు, నర్సశ్రీ, సిఆర్పి కొయ్య నాగరాజు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## మాదిగల ఆత్మీయ కలయిక" విజయవంతం చేయాలి ...



**అమలాపురం,డిసెంబర్8,ప్రభాతవార్త** ఈనెల 11వ తేది అమలాపురం కొంకాపల్లి సత్తెమ్మ తల్లి ఆలయ ప్రాంగణంలో జరగబోవు "మాదిగల ఆత్మీయ కలయిక" కార్యక్రమం విజయవంతం చేయాలని ఆంధ్రప్రదేశ్ శాసన మండలి సభ్యులు బొమ్మి ఇజ్రాయిల్ కోరారు.ఈ సందర్భంగా మీడియా సమావేశం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఎంఎల్సీ ఇజ్రాయిల్ మాట్లాడుతూ మాదిగ సోదరులు, ఆడపడుచులు అందరూ మాదిగల ఆత్మీయ కలయిక"కు పార్టీలకు అతీతంగా తరలి రావాలని పిలుపునిచ్చారు.డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామాల నుండి భారీ ఎత్తున తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేసి ఐక్యతకు నిరూపించుకొని తద్వారా రాజకీయంగా, సామాజికంగా ఎదుగుదలకు అందరూ కృషి చేయాలని ఈ సందర్భంగా ఉద్బోధిఃచారు.ఈ కార్యక్రమంలో యార్లగడ్డ రవీంద్ర, మడికి శ్రీరాములు,బడుగు శ్రీను, పలివెల మోహన్ రావు, పలివెల నాగేంద్రప్రసాద్,ఆకుమర్తి దుర్గారావు,ఆనంద్ శేఖర్, మల్లవరపు శ్రీను, ఉందుర్తి ప్రసాద్, ఆకుమర్తి సత్యనారాయణ, ఎమ్మార్పీఎస్ ఇంచార్జ్ దంసూరి,ఎంఆర్పిఎస్ ప్రెసిడెంట్ సవరపు భైరవమూర్తి,ఎంఎస్పి డిస్టిక్ రిప్రజెంటేటివ్ ఎన్. సత్యనారాయణ,ఎం పి ఎస్ డిస్ట్రిక్ట్ రిప్రజెంటేటివ్ ఆకుమర్తి మోహన్,గంపల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ఎఫ్ఐ మహాసభ గోడపత్రిక ఆవిష్కరణ



**పిఠాపురం నవంబర్ 8 (ప్రభాతవార్త) :** ఎస్ఎఫ్ఐ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ నాయకులు సోమవారం నాడు స్థానిక పిఠాపురం ఆర్ ఆర్ బి హెచ్ ఆర్ గవర్నమెంట్ జూనియర్ కళాశాలలో గోడపత్రికను ఆవిష్కరించారు. ఈనెల డిసెంబర్ 12, 13, 14 తేదీలలో తిరుపతిలో నిర్వహిస్తున్న రాష్ట్ర మహాసభల్లో విద్యార్థులందరూ పాల్గొని జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు సిద్దు మరియు శ్రీకాంత్ కోరారు. అలాగే ఈ సందర్భంగా సిద్దు శ్రీకాంత్ లు మాట్లాడుతూ రాష్ట్రంలో అనేక విద్యా సమస్యలు ఉన్నాయని ఈ కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన (ఎన్ ఈ పి) నూతన విద్యా విధానం వల్ల చాలామంది విద్యార్థులు నష్టపోయారని అన్నారు. అలాగే జీవో నెంబర్ 77 రద్దు చేసి పీజీ విద్యార్థులకు ఫీజు రీయింబర్స్మెంట్ వెయ్యాలని, మెడికల్ విద్యార్థులకు గవర్నమెంట్ మెడికల్ కళాశాల ప్రైవేటీకరణ ఆపాలని, హాస్టల్లో చదువుకుంటున్న విద్యార్థులకు మెస్ అండ్ కాస్మోటిక్ చార్జీలను పెంచాలని నిరుద్యోగ యువతలకు ఉద్యోగాలు కల్పించాలని ఇంకా మరెన్నో సమస్యలు మీద రేపు జరగబోయే రాష్ట్ర మహాసభల్లో జిల్లాల వారీగా చర్చలు జరిపి విద్యా వ్యవస్థలో వస్తున్న మార్పులకు అలాగే విద్యా సమస్యలపైన ఒక నివేదిక తీసుకువచ్చి ఈ కేంద్ర ప్రభుత్వంపై అలాగే రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి విద్యా సమస్యల పరిష్కారానికై ఎస్ఎఫ్ఐ ఎప్పుడు పోరాడుతూనే ఉంటుందని అన్నారు. ఈ రాష్ట్ర మహాసభలను విద్యార్థులందరూ ఐక్యంగా కలిసి జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ పిఠాపురం మండల నాయకులు జాన్, రాము, సాయి లక్ష్మి, సిరి మరియు జిల్లా ఎస్ఎఫ్ఐమెంబర్ వడ్డీ కాసులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## గ్రామీణ పారిశ్రామిక అభివృద్ధి, యువతకు ఉపాధి అవకాశం కల్పించాలి



**కాకినాడ రూరల్, డిసెంబర్ 8(ప్రభాత వార్త):** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో గ్రామీణ, పట్టణ పారిశ్రామిక అభివృద్ధి, యువతకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించాలంటూ రాజ్యసభలో ఎంపీ సానా సతీష్ బాబు ప్రశ్నించారు. గత ఐదేళ్లలో ప్రధాన మంత్రి ఉపాధి సృష్టి అమలు వివరాలను కేంద్రాన్ని ఆయన కోరారు. దీనికి రాజ్యసభలో స్పందించిన కేంద్ర సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల శాఖ సహాయ మంత్రి సుష్రీ శోభా కరండ్లాజే ఒక కేంద్ర పథకం కావడంతో రాష్ట్రాల వారీగా బడ్జెట్ కేటాయింపులు ఉండవని, డిమాండ్ ఆధారంగా నిధులు విడుదల చేస్తామని తెలిపారు. 2020%-%నవంబర్ 2025 మధ్య కాలంలో ఆంధ్రప్రదేశ్‌కు రూ.614 కోట్ల మార్జిన్ మనీ సబ్సిడీ విడుదల చేసినట్లు ఆమె వివరించారు. ఈ ఐదేళ్లలో రాష్ట్రవ్యాప్తంగా 16,053 సూక్ష్మ పరిశ్రమలు స్థాపించబడ్డాయని, వాటి ద్వారా సుమారు 1.28 లక్షల ఉద్యోగాలు సృష్టించబడ్డాయని చెప్పారు. ఈ పథకం ద్వారా ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలకు అధిక ప్రాధాన్యం లభించిందని, అలాగే ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, మహిళా లబ్ధిదారులకు గణనీయమైన భాగస్వామ్యం ఉన్నట్లు మంత్రి స్పష్టం చేశారు. తయారీ రంగంతో పాటు సేవల రంగంలోనూ పెద్ద ఎత్తున యూనిట్లు ఏర్పడినట్లు తెలిపారు. కాకినాడ జిల్లా విషయమై ప్రత్యేకంగా అడిగిన ప్రశ్నకు సమాధానంగా, 2022%-%23లో జిల్లా ఏర్పడినప్పటి నుంచి ఇప్పటివరకు 319 సూక్ష్మ పరిశ్రమలకు పీఎంఈజీపి ద్వారా సహాయం అందించామని, అవి తయారీ మరియు సేవల రంగాలకు సంబంధించినవని కేంద్ర మంత్రి వెల్లడించారు.

## ఆదిత్య కళాశాల ఇసిఇ విభాగంలో అటల్ ఫాకల్టీ డెవలప్మెంట్




**గండేపల్లి డిసెంబర్ 8(ప్రభాతవార్త)** గండేపల్లి మండలం సూరంపాలెం, ఆదిత్య కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ లో అఖిల భారత సాంకేతిక విద్యా మండలి ఏఐసీటీఈ సౌజన్యం తో నిర్వహిస్తున్న అటల్ ఫాకల్టీ డెవలప్మెంట్ ప్రోగ్రాం ఆఫ్ లైన్ శిక్షణ కార్యక్రమం "6జి వైర్‌లెస్ కమ్యూనికేషన్స్ కోసం బహుళ క్యారియర్ మాడ్యులేషన్ టెక్నిక్‌లు"అనే అంశంపై డిసెంబర్ 8 నుంచి 13 వరకు కొనసాగుతుందని ప్రో వైస్ చాన్సలర్ ఇంజనీరింగ్, సైన్స్ డాక్టర్.పి రమేష్ తెలిపారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ విద్యాసంస్థలు, ఎన్.ఐ.టి.,ఐ.ఐ.ఐ.టి, విశ్వ విద్యాలయాల ప్రొఫెసర్లు పారిశ్రామిక నిపుణులు వక్తలు గా వ్యవహరించనున్నారు. ఆదిత్య యూనివర్సిటీ డిప్యూటీ ప్రో చాన్సలర్ డా.ఎమ్ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ,"6జి విభాగంలో పరిశోధనకు ప్రపంచవ్యాప్తంగా డిమాండ్ పెరుగుతుంది అని అధ్యాపకులు, పరిశోధకులు దీన్ని ఉపయోగించుకోవాలి" అని తెలిపారు. ప్రోగ్రాం కోఆర్డినేటర్ డా. ఆర్.వి.వి. కృష్ణ మాట్లాడుతూ,"6జి టెక్నాలజీ రాబోయే దశాబ్దంలో ప్రపంచాన్ని మార్చే కీలక పరిశోధన రంగం. అధ్యాపకులు పరిశోధకులు ఇందులో కొత్త అంశాలను అన్వేషించడానికి ఈ ప్రోగ్రామ్ ఎంతో ఉపయోగపడుతుంది" అని పేర్కొన్నారు.డీన్ అడ్మినిస్ట్రేషన్ డా. వై కె ఎస్ సుబ్బారావు, డీన్ అకాడమిక్ డా. పి ఎస్ వి వి ఎస్ రవికుమార్, ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ డా. ఆర్ అనిల్ కుమార్ మాట్లాడుతూ,"ఆదిత్యా సంస్థ లో జాతీయ స్థాయి ఫ్యాకల్టీ డెవలప్మెంట్ ప్రోగ్రామ్ నిర్వహించడం గర్వకారణం. నూతన సాంకేతికతపై అధ్యాపకులు అవగాహన పెంపొందించుకునేందుకు ఇది అద్భుత వేదిక" అని అన్నారు.ఈ కార్యక్రమంలో రాష్ట్రం నలుమూలల నుంచి అనేకమంది అధ్యాపకులు పాల్గొంటున్నారు. నిపుణులు, అతిథి వక్తలు ప్రతిరోజూ లెక్చర్లు, హ్యాండ్స్-ఆన్ సెషన్లు, రీసెర్చ్ ఇంటరాక్షన్‌లు నిర్వహించనున్నారు.

## కిమ్స్ లో 3వ ప్రపంచ తెలుగు మహాసభలు.... : చైర్మన్ చైతన్య రాజు



**అమలాపురం, డిసెంబర్8, ప్రభాతవార్త** చైతన్య విద్యా సంస్థల ఆధ్వర్యంలో అమలాపురం కిమ్స్ ప్రాంగణం లో 3వ ప్రపంచ తెలుగు మహా సభలు నిర్వహిస్తున్నామని చైతన్య, కిమ్స్ విద్యా సంస్థల స్థాపకులు,కిమ్స్ చైర్మన్ కె.వి.వి. సత్యనారాయణ (చైతన్య రాజు) పేర్కొన్నారు.వచ్చే ఏడాది ఫిబ్రవరి 28 వతేది శనివారం, మార్చి1 (ఆదివారం) తేదీలలో రెండు రోజుల పాటు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం కిమ్స్ లో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సదస్సులో చైతన్య రాజు మాట్లాడుతూ ఈ ప్రపంచ తెలుగు మహా సభలు మన తెలుగు ప్రజలందరి పండుగగా భావించి ప్రతి ఒక్కరు ఈ మహా సభలు ఘనంగా జరిపేందుకు తమ వంతు తోడ్పడాలని కోరారు. ఈ సభల గోడ పత్రికను ఆవిష్కరించామని తెలిపారు. గత రెండు ప్రపంచ తెలుగు మహా సభలను రాజమహేంద్రవరం లో ఘనంగా నిర్వహించామన్నారు. వాటికి తెలుగు ప్రజల నుండి వచ్చిన విశేష స్పందన, ఆదరణలతో చాలా సంతోషం కలిగిందని, ఈ 3 వ ప్రపంచ తెలుగు మహా సభలను కూడా మరింత ఘనంగా అమలాపురం కిమ్స్ ప్రాంగణంలో నిర్వహిస్తామని చైతన్య రాజు తెలిపారు.అనేక మంది కవులు, సాహితీవేత్తలు,కళాకారులు, రాజకీయ ప్రముఖులను ఈ కార్యక్రమాలకు ఆహ్వానిస్తున్నామని, విద్యా సాహితీ సమావేశాలు జరుగుతాయని,తెలుగు భాష వికాసానికి పాటుపడిన అనేక మంది ప్రముఖ పండితులను మరియు కళాకారులను సన్మానించడం జరుగుతుందని ఆయన తెలిపారు.రెండు రోజుల పాటు నాలుగు వేదికలపై జరిగే ఈ మహా సభలకు పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేస్తున్నామని, తెలుగు సాంప్రదాయ కళలు, సాంప్రదాయ పిండి వంటలు గురించి తెలిపే ప్రదర్శనలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నామని, షుమారు లక్ష మందికి పైగా ప్రతి రోజు ఈ కార్యక్రమాలలో పాల్గొంటారని అంచనా అని ఆయన తెలిపారు. ఈ మహా సభలలో విద్యార్థులకు తెలుగు భాష ప్రావీణ్యం లో అనేక అంశాలలో పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేయడం ద్వారా చిన్నారులలో తెలుగు భాషాభిమానాన్ని పెంపొందించి భావితరాలకు తెలుగు భాష తియ్యదనాన్ని అందించి తెలుగు భాషాభివృద్ధికి కృషి చేయడం జరుగుతుందని తెలిపారు.ఈ ప్రపంచ తెలుగు మహా సభలు అత్యంత వైభవంగా, ఎప్పటికీ చరిత్రలో నిలిచి పోయేలా నిర్వహించాలని తమ ఆకాంక్ష అని, ఈ మహా యజ్ఞానికి తెలుగు వారందరు తెలుగు వారి పండుగగా భావించి, పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

## నిడదవోలు ఎస్.వి.ఆర్ కె లో జాబ్ మేళా




**నిడదవోలు, డిసెంబర్ 8(ప్రభాత వార్త):** నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు జిల్లా ఉపాధి కార్యాలయం మరియు నైపుణ్యాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో, నేషనల్ కెరీర్ సర్వీస్ సహకారంతో, నిడదవోలు పట్టణంలోని ఎస్.వి.ఆర్ కె ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో సోమవారం జాబ్ మేళా నిర్వహించారు. ప్రముఖ ఆరు కంపెనీలలో ఖాళీలకు ఇంటర్వ్యూలు నిర్వహించగా, మొత్తం 67 మంది అభ్యర్థులు పాల్గొని, 41 మంది ఎంపికైనట్లు జిల్లా ఉపాధి అధికారి హరీష్ చంద్ర ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు కళాశాల ప్రిన్సిపాల్ డా. కే. జ్యోతి నియామక పత్రాలు అందజేశారు.

## ఇది ఆరంభం.. త్వరలోనే ఉంటుంది ప్రభంజనం..



**అంబాజీపేట (పి. గన్నవరం),డిసెంబర్ 8, (ప్రభాతవార్త)..** రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన 17 నెలల కాలంలో నియోజకవర్గాన్ని ఎంతో అభివృద్ధి చేశామని,జనసేన పార్టీ సిద్ధాంతాలు,డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఆశయాలు, నియోజవర్గ అభివృద్ధిని చూసిన ఎంతోమంది జనసేన వైపు మగ్గు చూపుతున్నారని పి. గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అన్నారు. పి.గన్నవరంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో సోమవారం అంబాజీపేట, అయినవిల్లి మండలాల నుండి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి చెందిన వారితో పాటు పలువురు సుమారు 80 మంది జనసేన పార్టీ తీర్థం పుచ్చుకున్నారు.పార్టీలో చేరేందుకు వచ్చిన వారిని ఎమ్మెల్యే సత్యనారాయణ సాదరంగా ఆహ్వానించి పార్టీ కండువాలు వేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుండి నియోజవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తున్నా, కళ్ళుండి చూడలేని వైసిపి నాయకులు లేనిపోని ఆరోపణలు చేస్తుంటే వాళ్ళ పార్టీకి చెందిన నాయకులు, కార్యకర్తలే సహించలేకపోతున్నారన్నారు. ఐదేళ్లు అధికారంలో ఉండి ఏమాత్రం అభివృద్ధి పనులు చేయని వైసిపి ప్రభుత్వంలో నియోజకవర్గం వెనకబడిపోయిందని గ్రహించిన వైసీపీ శ్రేణులు జనసేన పార్టీలోకి వచ్చేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. పార్టీలో చేర్చుకునేందుకు చిన్న తెరను తొలగించామని, ఇది ఆరంభం మాత్రమేనని, త్వరలోనే ప్రభంజనం ఉంటుందన్నారు.జనసేన పార్టీ కులమతాలకు అతీతంగా అందరికీ అందుబాటులో ఉన్న పార్టీ అని, పలు కులాలకు చెందిన వైసిపి నాయకులు పార్టీలోకి రావడం శుభ సూచకమన్నారు. జనసేన పార్టీ క్రమశిక్షణకు పెద్దపీట వేస్తోందని, నూతనంగా పార్టీ లోకి వచ్చిన వారు పార్టీ విధానాలను పాటిస్తూ, సీనియర్ నాయకుల ఆదేశాలను పాటించాలని సూచించారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో నూరు శాతం ఫలితాలు సాధించడం పైనే దిష్టి సారించాలని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ జన సైనికులకు సూచించారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఇరిగేషన్ డైరెక్టర్ శిరిగినీడి వెంకటేశ్వరరావు, ఏఎంసీ చైర్ పర్సన్ పెనుమాల లక్ష్మి, జాలెం శ్రీనివాసరాజా,అరిగెల సూరిబాబు, సాధనాల శ్రీ వెంకటేశ్వరరావు, దొమ్మేటి సాయికృష్ణ, తందూరి బుజ్జి, కొర్లపాటి ఢిల్లీ, మైపాల తాతాజీ, కొర్లపాటి గోపి, మట్ట పార్వతి, ఉందుర్తి నాగబాబు, మట్టా వెంకటేశ్వరరావు, ఆదిమూలం సూరయ్య కాపు తదితరులు పాల్గొన్నారు.

## సత్యదేవుని నిత్యాన్నదాన ప్రధకానికి రూ.1,01,116/- విరాళం



**అన్నవరం, డిసెంబర్ 8, (ప్రభాత వార్త).** కాకినాడ జిల్లా ప్రముఖ పుణ్యక్షేత్రమైన అన్నవరం శ్రీ వీరవెంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానంలో ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి హైదరాబాద్ నగరానికి చెందిన చింతా గోవింద్, విశ్వేశ్ 1,01,116/- రూపాయలు విరాళమును సోమవారం దేవస్థానం కార్యనిర్వాహనాధికారి వీర్ల సుబ్బారావుకు అందజేసారు. ప్రతీ సంవత్సరం డిసెంబర్ 17వ తేధీన తమ పేరున అన్నదానం జరిపించవలసిందిగా దాతలు అధికారులను కోరారు.ఈ సందర్భంగా దాతలను ఈవో సుబ్బారావు అభినందించారు.

## మాజీ ఎంపీటీసీ కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే



**శంఖవరం, డిసెంబర్ 08 (ప్రభాతవార్త) :** మాజీ ఎంపీటీసీ యూనిట్ ఇన్‌చార్జి సాధనాల లక్ష్మీ బాబు కుటుంబాన్ని ప్రతిపాడు శాసన సభ్యురాలు వరుపుల సత్య ప్రభ పరామర్శించారు .ఇటీవల అనారోగ్యంతో లక్ష్మీ బాబు మనవడు మృతి చెందడంతో సోమవారం మండలంలోని కత్తిపూడిలో గల లక్ష్మీ బాబు స్వగృహానికి వెళ్లి పరామర్శించారు. మృతుని కుటుంబాన్ని పరామర్శించి , ప్రగాఢ సానుభూతి తెలిపారు.. కుటుంబ సభ్యులకు ధైర్యం చెబుతూ, ఈ కష్టకాలంలో ధైర్యంగా ఉండాలని ఆమె సూచించారు. ఆమె వెంట రాష్ట్ర రోడ్డు డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ వెన్న శివ సొసైటీ చైర్మన్ గాబు కృష్ణ గ్రామ టిడిపి అధ్యక్షులు కేలంగి జనార్ధన్ నక్క శ్రీను ఉన్నారు

## గంగవరంలో ఘనంగా హనుమాన్ జయంతి మహోత్సవాలు



**కె.గంగవరం, డిసెంబర్ 8, (ప్రభాతవార్త):** గంగవరంలో వేంచేసి ఉన్నటువంటి భక్తాంజనేయ స్వామి వారి 63 వ జయంతి మహొూత్సవాలు ఐదు రోజులపాటు అంగరంగ వైభవంగా నిర్వహించినట్లు కమిటీ వారు తెలియజేశారు. ముగింపు సందర్భంగా సోమవారం నిర్వహించిన భారీ అన్నదాన కార్యక్రమంలో సుమారు 5 వేల మందికి పైగా భక్తులు వచ్చి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. సాయంత్రం చిన్నారులచే కోలాటం, కూచిపూడి నృత్యాలను నిర్వహించగా, ప్రజలు, గ్రామ పెద్దలు నిర్వహణ కమిటీకి, నృత్య గురువు లను సత్కరించి,చిన్నారులకు బహుమతులు అందజేశారు.

Print and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at 11-37, Morampudi, Rajamahendravaram-533 103. Phone : 2469407, 2469408. RNI No.64863/96, Editor : Damerla Sai Baba, Responsible for s election of News-under the PRB Act. Regd.: No.H/SD/337/09-11 Air Surcharge: Delhi : 40Ps

# సూపర్ కప్ ఛాంపియన్‌గా గోవా



**న్యూఢిల్లీ:** ఎఐఎఫ్ఎఫ్ సూపర్ కప్ ఛాంపియన్‌గా గోవా ఫుట్‌బాల్ జట్టు నిలిచింది. పెనాల్టీ షూటౌట్‌లో ఈస్ట్ బెంగాల్ ఎఫ్‌సిని 6-5 తేడాతో ఓడించి, ఎఫ్‌సి గోవా రికార్డు స్థాయిలో మూడోసారి ఎఐఎఫ్ఎఫ్ సూపర్ కప్ ఛాంపియన్‌గా అవతరించింది. రెండు జట్లు గోల్ చేయడంలో విఫలమవడంతో పెనాల్టీ షూటౌట్‌కు వెళ్లింది. సూపర్ కప్ ఫైనల్‌లో ఇలా జరగడం ఇదే మొదటిసారి. గోవా కెప్టెన్ బోర్జా హెర్రెరా, మొహమ్మద్ బాసిమ్ రషీద్ రెగ్యులేషన్ పెనాల్టీలలో తమ స్పాట్‌కిక్‌లను మిస్ చేసుకున్నారు. కెవిన్ సిబిల్లే, కెప్టెన్ సౌల్ క్రెస్పో, మిగ్యుల్ ఫెర్రీరా మరియు అన్వర్ అలీ తూర్పు బెంగాల్ తరపున తమ పెనాల్టీలను గోల్ చేయగా, జేవియర్ సివేరియో, డెజాన్ డ్రాజిక్, ముహమ్మద్ నెమిల్, డేవిడ్ టిమోర్ నీది గోవా తరపున గోల్ చేయడంతో మ్యాచ్ సడన్ డెత్‌కు చేరుకుంది. ఉదంత కుమామ్ మరియు సాహిల్ తవోరా ఆతిథ్య జట్టు తరపున తమ పెనాల్టీలను గోల్స్‌గా మార్చగా, తూర్పు బెంగాల్ తరపున హమీద్ అహదద్ గోల్స్ చేశారు, కానీ విష్ణు గోల్స్ చేయడంలో విఫలమయ్యాడు. తూర్పు బెంగాల్‌కు మొదటి అవకాశం 12వ ఆటలో వచ్చింది. మొదటి అర్ధభాగం చివరిలో మహేష్ కు మరో రెండు క్లోజ్ అవకాశాలు వచ్చాయి. 43వ ఆటలో బిపిన్ తో కలిసి రెండోసారి గోల్ చేశాడు. ఆయుష్ ఛెత్రి లాంగ్ రేంజ్ నుండి తన అదృష్టాన్ని ప్రయత్నించినా ఫలించలేదు. 49వ నిమిషంలో తైమూర్ డ్రాజిక్‌ను గోల్ గా మార్చింది. రెండోది ఆఫ్‌సైడ్‌గా మారింది. 81వ నిమిషంలో గౌర్స్ డిఫెండర్ పోల్ మోరెనో దాదాపు గోల్ చేశాడు. సివేరియో రీబౌండ్ నుండి చేసిన ప్రయత్నాన్ని 107వ నిమిషంలో గిల్ పాయింట్‌బ్లాంక్ రేంజ్‌లో సేవ్ చేశాడు. ఈస్ట్ బెంగాల్ గోల్ కీపర్ 114వ నిమిషంలో తైమూర్ హెడర్‌ను పట్టుకుని తన జట్టును పోటీలో నిలుపుకున్నాడు.

## మహిళల ప్రపంచ కప్

# భారత్ ఘన విజయం



**న్యూఢిల్లీ:** ఎఫ్ఐహెచ్ జూనియర్ మహిళల ప్రపంచ కప్ 2025 ప్లేఆఫ్స్‌లో వేల్స్‌ను భారత్ ఓడించింది. సోమవారం శాంటియాగోలోని ఎస్టాడియో నేషనల్‌లోని సెంట్రో డిపోర్టివో డి హాకీ సెస్పెడ్‌లో జరిగిన టోర్నీలో భారత జూనియర్ మహిళల హాకీ జట్టు తన ప్లేఆఫ్‌లో వేల్స్‌పై 3-1 తేడాతో ఘన విజయం సాధించింది. దూకుడుగా ఆడిన భారత్, తొలి 30 సెకన్లలోనే పెనాల్టీ కార్నర్‌ను సంపాదించింది. గోల్‌ను నియంత్రించుకుని, లైన్ల మధ్య ఆడి రెగ్యులర్ ఓపెనింగ్స్‌ను సృష్టించింది. కానీ ప్రారంభంలోనే స్ట్రైక్ చేయలేకపోయింది. వేల్స్‌కు పెనాల్టీ స్ట్రోక్ ద్వారా ఆధిక్యంలోకి వెళ్లే అవకాశం లభించి గోల్ కీపర్ నిధి పదునైన సేవ్ చేసి స్కోర్‌లను సమం చేశాడు. సాక్షి రాణా రాణించడంతో, 14వ నిమిషంలో హినా బానో ట్యాప్‌ఇన్ ద్వారా తొలి క్వార్టర్ చివరిలో భారత్ ప్రతిష్టంభనను ఛేదించింది. రెండవ క్వార్టర్ వరకు ఒత్తిడి కొనసాగింది. సాక్షి ప్రారంభ ప్రయత్నం సునెలిటా టోప్పో (24)కు దగ్గరగా ముగిసింది. బ్రేక్ తర్వాత వెంటనే వెల్ష్ గోల్ కీపర్ షాట్‌ను పట్టుకోవడంలో విఫలమైన తర్వాత ఇషికా (31) రీబౌండ్‌ను గోల్‌గా మార్చడంతో ఆధిక్యం పెరిగింది. 52వ నిమిషంలో ఎలోయిస్ మోట్ ద్వారా వేల్స్ ఒక గోల్ చేసింది, కానీ భారత్ చివరి దశలను బాగా నిర్వహించి విజయాన్ని ఖాయం చేసింది.




## ప్రపంచ కప్ ఫైనల్..

# సిమ్రాన్‌కు స్వర్ణం

**న్యూఢిల్లీ:** ఐఎస్ఎస్ఎఫ్ ప్రపంచ కప్ ఫైనల్‌లో ఒలింపిక్ ఛాంపియన్‌ను ఓడించి సిమ్రాన్‌ప్రీత్ బ్రార్ స్వర్ణంతో మెరిసింది. ఖతార్‌లోని దోహాలో జరిగిన ప్రపంచ కప్ ఫైనల్ 2025లో 21 ఏళ్ల సిమ్రాన్‌ప్రీత్ కౌర్ బ్రార్ మహిళల 25 మీటర్ల స్పోర్ట్స్ పిస్టల్ విభాగంలో బంగారు పతకాన్ని గెలుచుకుంది. ఆమె 50 షాట్లలో 41 హిట్‌లతో పారిస్ ఒలింపిక్స్ ఛాంపియన్ దక్షిణ కొరియాకు చెందిన యాంగ్ జిఇన్ జూనియర్ ప్రపంచ రికార్డును కూడా సమం చేసింది. ఫైనల్‌లో, ఆమె తన తొలి మేజర్ సీనియర్ అంతర్జాతీయ బంగారు పతకాన్ని సాధించే మార్గంలో ఎయిర్ పిస్టల్‌లో పారిస్ ఒలింపిక్ ఛాంపియన్ యాంగ్ మరియు ఓహ్ యేజిన్‌లను అధిగమించింది. మరోవైపు, ఈ ఈవెంట్‌లో భారత్ తరపున పోటీ పడిన మరో ఫైనలిస్ట్ ఈషా సింగ్ 25 షాట్‌లలో 15 హిట్‌లతో 7వ స్థానానికి పరిమితమైంది. దీంతో ఐశ్వరీ ప్రతాప్ సింగ్ తోమర్ రజతం గెలుచుకుంది. ఇక ఈ సీజన్ ఫైనల్‌లో పురుషుల 50 మీటర్ల 3 పొజిషన్స్ ఈవెంట్‌లో రజత పతకంతో అనుభవజ్ఞురాలైన క్రీడాకారిణి ఐశ్వరీ తోమర్ భారత్‌కు మొట్టమొదటి, ఏకైక రైఫిల్ పతకాన్ని గెలుచుకుంది. అతను కొత్తగా ప్రవేశపెట్టిన 50 ఎం 3 పి ఫైనల్స్ ఫార్మాట్‌లో 413.3 స్కోర్‌చేశాడు.ఇంతలో, ఆసియా క్రీడల ఛాంపియన్ సిఫ్ట్‌కౌర్ సమ్రా మరోసారి నిరాశపరిచింది, మహిళల 50 మీటర్ల 3 పాయింట్‌లో 10వ స్థానంలో నిలిచి ఫైనల్‌కు చేరుకోలేకపోయింది.

## డబ్ల్యూటిసి పాయింట్లలో..

# అగ్రస్థానంలో ఆస్ట్రేలియా

### టీమిండియా ఔట్..?



**న్యూఢిల్లీ:** యాషెస్ సిరీస్‌లో భాగంగా ఇంగ్లండ్‌తో జరిగిన రెండో టెస్టులో ఆస్ట్రేలియా ఘన విజయం సాధించడంతో ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్ (డబ్ల్యూటిసి) పాయింట్ల పట్టికలో పెను మార్పులు చోటుచేసుకుని భారత జట్టు ర్యాంకింగ్స్‌లో కిందకు పడిపోయింది. బ్రిస్బేన్‌లో జరిగిన ఈ మ్యాచ్‌లో ఆస్ట్రేలియా ఇంగ్లాండ్‌ను ఎనిమిది వికెట్ల తేడాతో ఓడించి యాషెస్ సిరీస్‌లో 2-0 ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. ఈ విజయంతో ఆస్ట్రేలియా ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్‌లో అగ్రస్థానంలో కొనసాగుతుండగా, ఇంగ్లాండ్ ఏడో స్థానానికి పడిపోయింది. ఈ నిర్ణయాత్మక విజయం ప్రస్తుత డబ్ల్యూటిసి ర్యాంకింగ్స్‌లో ఆస్ట్రేలియా అగ్రస్థానాన్ని మరింత పటిష్టం చేసింది. ఆస్ట్రేలియా 2025-27 డబ్ల్యూటిసి స్టాండింగ్స్‌లో 100 శాతం పాయింట్లతో అగ్రస్థానంలో కొనసాగుతోంది. వారి ఐదు మ్యాచ్‌ల్లోనూ విజయం సాధించింది.

ఇంతలో, ఇంగ్లాండ్ ఈ ఓటమితో గణనీయమైన ఓటమిని చవిచూసింది, వారి మునుపటి ఆరవ స్థానం నుండి ఏడవ స్థానానికి పడిపోయింది. మరోపక్క ఆస్ట్రేలియా విజయంతో భారత జట్టుకు పాయింట్ల పట్టికలో భారీ నష్టం వాటిల్లింది. దాయాది దేశం పాకిస్తాన్ జట్టు తర్వాత భారత జట్టు ఏకంగా ఐదోస్థానానికి పడిపోయింది. ఈ సైకిల్‌లో భారత్ ఇప్పటివరకు 9 టెస్టులు ఆడగా, అందులో 4 గెలిచి, 4 ఓడిపోయింది. ఫలితంగా ర్యాంకింగ్స్‌లో వెనుకబడింది. ప్రస్తుత సమీకరణాలను బట్టి చూస్తే, ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా జట్లు జూగిది ఫైనల్ చేరే అవకాశాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. ఆస్ట్రేలియా అద్భుతమైన ఫామ్‌లో ఉండగా, దక్షిణాఫ్రికా కూడా నిలకడగా రాణిస్తోంది. భారత్ ఫైనల్ రేసులో నిలవాలంటే రాబోయే టెస్టుల్లో అద్భుత ప్రదర్శన చేయాల్సి ఉంటుంది. స్వదేశంలో భారత్‌కు దారుణమైన ఓటమిని చవిచూసింది. గౌహతి టెస్టును దక్షిణాఫ్రికా 408 పరుగుల తేడాతో గెలిచింది. రెండు మ్యాచుల టెస్ట్ సిరీస్‌లో భారత్‌ను వైట్‌వాష్ చేసింది. కోల్‌కతా టెస్టును దక్షిణాఫ్రికా 30 పరుగుల తేడాతో గెలిచిన బావుమా నేతృత్వంలోని ప్రొటీస్ జట్టు గౌహతి టెస్టులో భారత్‌కు 549 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించింది. ప్రపంచ టెస్ట్ ఛాంపియన్ దక్షిణాఫ్రికా రెండో ఇన్నింగ్స్‌లో భారత్‌ను 140 పరుగులకు ఆలౌట్ చేసి 408 పరుగుల తేడాతో సిరీస్‌ను గెలిచింది. ఇది టెస్ట్ క్రికెట్‌లో, స్వదేశంలో పరుగుల పరంగా భారత్‌కు అతిపెద్ద ఓటమి. ఇక శ్రీలంక పాయింట్ల పట్టికలో మూడోస్థానంలో కొనసాగుతున్నది. డబ్ల్యూటీసీ పాయింట్ల పట్టికలో తొలి రెండు స్థానాల్లో నిలిచిన జట్లు ఫైనల్‌కు అర్హత సాధిస్తాయి.

# మూడోసారి చైనాకు వరల్డ్ కప్ టైటిల్

**న్యూఢిల్లీ:** వరుసగా మూడోసారి ఐటీటీఎఫ్ మిక్స్‌డ్ టీమ్ ప్రపంచ కప్ టైటిల్-2025ను చైనా గెలుచుకుంది. అంతర్జాతీయ టేబుల్ టెన్నిస్ సమాఖ్య మిక్స్‌డ్ టీమ్ ప్రపంచ కప్‌లో చైనా 8-1 తేడాతో జపాన్‌ను ఓడించి వరుసగా మూడోసారి టైటిల్‌ను గెలుచుకుంది. అంతకుముందు జరిగిన సెమీఫైనల్లో దక్షిణ కొరియా, జర్మనీలను ఓడించిన తర్వాత చైనా, జపాన్ తుది పోరుకు సిద్ధమైంది. బెస్ట్‌ఆఫ్ 15 ఫైనల్లో, చైనా జంట వాంగ్ చుకిన్-సన్ యింగ్షా మిక్స్‌డ్ డబుల్స్‌లో సోరా మట్సుషిమా-సత్సుకి ఓడోపై 11-4, 11-4, 11-6 తేడాతో విజయం సాధించారు. ఆ తర్వాత మహిళల సింగిల్స్‌లో వాంగ్ మాన్యు 11-6, 11-7, 11-6 తేడాతో మివా హారిమోటోను ఓడించి చైనా ఆధిక్యాన్ని 6-0కి పెంచడంలో సహాయపడింది. ఆ తర్వాత పురుషుల సింగిల్స్‌లో చైనాకు చెందిన లిన్ షిడోంగ్ 6-11, 11-5, 11-6 తేడాతో టోమోకాజు హారిమోటోను ఓడించి జట్టు విజయాన్ని ఖాయం చేశాడు.

# ఐబిపిఎల్ విన్నర్ ముంబై స్మాషర్స్

### ఫైనల్‌లో 5-1తేడాతో హైదరాబాద్ రాయల్స్ ఓటమి




**హైదరాబాద్, డిసెంబరు 8,ప్రభాతవార్త:** ఇండియన్ పికిల్‌బాల్ లీగ్ (ఐబీపీఎల్)లో ముంబై స్మాషర్స్ విజేతగా నిలిచింది. గ్రాండ్ ఫైనల్‌లో స్మాషర్స్ అద్భుత విజయాన్ని నమోదు చేసింది. భారత యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ గుర్తింపుతో జరిగిన ఈ లీగ్ టైటిల్ పోరులో ముంబై జట్టు 5-1 తేడాతో హైదరాబాద్ రాయల్స్‌ను చిత్తు చేసింది. లీగ్ దశలో ఆరో స్థానంలో నిలిచి, చివరి మ్యాచ్ వరకు ఒక్క విజయం కూడా లేని ముంబై, నాకౌట్ దశలో వరుస విజయాలతో అనూహ్యంగా ఫైనల్ చేరి ఛాంపియన్‌గా నిలవడం విశేషం. పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు సమక్షంలో కేడీ జాదవ్ ఇండోర్ హాల్‌లో ఆదివారం రాత్రి జరిగిన ఈ మ్యాచ్‌లో ముంబై తమ సత్తా చాటింది. ముంబై స్టార్ ప్లేయర్ క్వాంగ్ దుయోంగ్ సింగిల్స్‌లో తేజస్ గులాటిని, డబుల్స్‌లో అమోల్ రామ్‌చందానీతో కలిసి హైదరాబాద్ జోడీని ఓడించి జట్టుకు 20 ఆధిక్యాన్ని అందించారు. నిర్ణయాత్మకమైన గ్రాండ్ ర్యాలీలో కూడా ముంబై 21-14 స్కోరుతో గెలిచి ట్రోఫీని కైవసం చేసుకుంది. లీగ్ ఆద్యంతం అద్భుతంగా రాణించిన క్వాంగ్ దుయోంగ్ పురుషుల విభాగంలో మోస్ట్ వాల్యుబుల్ ప్లేయర్ (ఎంవీపీ) బెస్ట్ సింగిల్స్ ప్లేయర్‌గా నిలవగా, మేగన్ ఫడ్జ్ మహిళల ఎంవీపీ అవార్డును దక్కించుకున్నారు.

# మార్కెట్లకు ఫెడ్‌రిజర్వు భయాలు!

### ఒక్కరోజే బిఎస్ఇలో రూ.7 లక్షలకోట్లు నష్టం

### భారీ నష్టాలతో ముగిసిన సెన్సెక్స్ నిఫ్టీ




**ముంబయి, డిసెంబరు 8:** ఫెడ్‌రిజర్వు వడ్డీరేట్ల భయాలతో ఇన్వెస్టర్లు తమ పెట్టుబడులు భారీగా విత్‌డ్రా చేయడంతో దేశీయ స్టాక్ మార్కెట్లు సోమవారం భారీ నష్టాలను చవిచూశాయి. ఈ వారం వెలువడనున్న అమెరికా ఫెడరల్ రిజర్వ్ పాలసీ నిర్ణయంపై ఇన్వెస్టర్లు అప్రమత్తత వహించడం, విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్లు అమ్మకాలు కొనసాగించడంతో అన్ని రంగాల్లో అమ్మకాల ఒత్తిడి పెరగడంతో సూచీలు భారీగా పతనమయ్యాయి. ఒక్కరోజులోనే బిఎస్ఇలో లిస్ట్ అయిన కంపెనీలవిలువ సుమారు రూ.7 లక్షలకోట్లు ఆవిరి అయింది. రూ.463 లక్షలకోట్లకు క్షీణించింది. ట్రేడింగ్ ముగిసే సమయానికి, బిఎస్ఇ సెన్సెక్స్ 609.68 పాయింట్లు నష్టపోయి 85,102.69 వద్ద స్థిరపడింది. ట్రేడింగ్ సమయంలో ఒక దశలో 84,875.59 కనిష్ఠ స్థాయిని కూడా తాకింది. ఇక నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ నిఫ్టీ 225.90 పాయింట్లు క్షీణించి 25,960.55 వద్ద ముగిసింది. ఈ వారం యూఎస్ ఫెడ్ పాలసీ నిర్ణయం ఉండటంతో ఇన్వెస్టర్లు ఆచితూచి వ్యవహరించారు. దేశీయ వృద్ధి గణాంకాలు బలంగా ఉన్నప్పటికీ, ఆర్బీఐ వడ్డీ రేట్లు తగ్గించినా.. అంతర్జాతీయ ద్రవ్య విధాన ఆందోళనలు, ఎడతెరిపిలేని ఎఫ్ఐఐల అమ్మకాలు, రూపాయి బలహీనత వంటివి మార్కెట్ సెంటిమెంట్‌ను దెబ్బతీశాయని జియోజిత్ ఇన్వెస్ట్‌మెంట్స్ రీసెర్చ్ హెడ్ వినోద్ నాయర్ విశ్లేషించారు. జపాన్ బాండ్ల అంశం కూడా ఆందోళనను మరింత పెంచిందన్నారు. సెన్సెక్స్30 షేర్లలో టెక్ మహీంద్రా మినహా మిగిలినవన్నీ నష్టాల్లోనే ముగిశాయి. టాటా స్టీల్, బజాజ్ ఫైనాన్స్, పవర్‌గ్రిడ్, ఏషియన్ పెయింట్స్, టాటా మోటార్స్, టైటాన్, ఎన్‌టిపిసి, కోటక్ బ్యాంక్ వంటివి ప్రధానంగా నష్టపోయాయి. రంగాల వారీగా చూస్తే నిఫ్టీ ఫైనాన్షియల్ సర్వీసెస్, బ్యాంక్, ఆటో, ఎఫ్ఎంసిజి, ఐటి సూచీలన్నీ పతనమయ్యాయి. బ్రాడర్ మార్కెట్‌లోనూ అమ్మకాల ఒత్తిడి కనిపించింది. నిఫ్టీ స్మాల్‌క్యాప్ 100 సూచీ 2.61 శాతం, నిఫ్టీ మిడ్‌క్యాప్ 100 సూచీ 1.83 శాతం మేర పడిపోయాయి. మరోవైపు, డాలర్‌తో రూపాయి మారకం విలువ 13 పైసలు క్షీణించి 90.06 వద్ద స్థిరపడింది. ఈ వారంలో వెలువడనున్న ఫెడ్ పాలసీ, భారత ద్రవ్యోల్బణ గణాంకాల నేపథ్యంలో మార్కెట్లలో అస్థిరత కొనసాగే అవకాశం ఉందని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. బిఎస్ఇ మిడ్‌క్యాప్‌సూచీ 1.73శాతం, స్మాల్‌క్యాప్ సూచీలు 2.20శాతం చొప్పున క్షీణించాయి. బిఎస్ఇలో 950 షేర్లు లాభాలతో ముగిస్తే 3348 కంపెనీలషేర్లు పతనం అయ్యాయి. మరో 198 కంపెనీలషేర్లు స్థిరంగా కొనసాగాయి. ఇక ఎంసిఎక్స్‌లో బంగారం ఫ్యూచర్స్ రూ.1.30, 584వద్ద స్థిరపడింది. బ్రెంట్‌ముడిచమురు బ్యారెల్ ఒక్కింటికి 8 సెంట్లు పెరిగి 63.83 డాలర్లుగా కొనసాగాయి.

# స్టార్‌లింక్ సేవలు షురూ!

### నెలవారీ చందా రూ.8600 మాత్రమే!




**న్యూఢిల్లీ, డిసెంబరు 8:** ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్‌కు చెందిన స్టార్‌లింక్ సంస్థ శాటిలైట్ వ్యవస్థ ద్వారా ఇంటర్నెట్ సేవలు అందించేందుకు భారత్‌లో రంగం సిద్ధమైంది. ఇప్పటికే మన దేశానికి చెందిన జియో, ఎయిర్‌టెల్‌తో స్టార్‌లింక్ సంస్థ ఒప్పందం కుదుర్చుకున్న విషయం తెలి సిందే. త్వరలో ఇండియాలో కమర్షియల్ సేవలు అందించేందుకు సంస్థ సిద్ధమవుతోంది.ఇందులో భాగంగానేనెలవారీ సబ్‌స్క్రిప్షన్ ప్లాన్ ధరలను సంస్థ తాజాగా వెల్లడించింది. స్టార్‌లింగ్ ఇండియా వెబ్‌సైట్ వెల్లడించిన వివరాల ప్రకారం ఈ సేవలు పొందాలంటే రెసిడెన్షియల్ కస్టమర్లు నెలకు రూ.8,600 చెల్లించాల్సి ఉంటుంది. హార్డ్‌వేర్ కిట్‌కు అదనంగా రూ.34వేలు చెల్లించాలి. ఈప్యాకేజీలో సాటిలైట్ డిష్, వైఫై రౌటర్, మౌంటింగ్ స్టాండ్, కేబుల్స్, పవర్ అడాప్టర్‌తో కూడిన ప్లగ్‌అండ్‌ప్లే కిట్ వినియోగదారులకు ఇవ్వనున్నారు. ఈప్లాన్‌లో అపరిమిత డేటాతోపాటు 30 రోజులపాటుఫ్రీ ట్రయల్‌ను ఆస్వాదించొచ్చు. 99.9 శాతం కంటే ఎక్కువ నెట్‌వర్క్ అప్‌టైమ్‌తో ఎలాంటి ప్రతికూల వాతావరణ పరిస్థితుల్లోనైనా నిర్విరామంగా ఇంటర్నెట్‌సేవలు అందుబాటులో ఉంటాయి. వినియోగదారులు దీన్ని కొనుగోలు చేసిన వెంటనే ప్లగ్‌ఇన్ చేసి సేవలను ప్రారంభిం చొచ్చు.అయితే బిజినెస్‌కేటగిరీ చందాలు వివరాలు వెల్లడించలేదు. బంగ్లాదేశ్, భూటాన్, శ్రీలంకల్లో ఈ సేవలు అందుబాటులో ఉన్నట్లు వెబ్‌సైట్‌లో చూపుతోంది. ముందుగా హైదరాబాద్, చండీగఢ్, కోల్‌కత్తా, లక్నో, ముంబయి, నోయిడా వంటినగరాల్లో గేట్‌వే ఎర్త్‌స్టేషన్లను స్పేస్ ఎక్స్ ఏర్పాటుచేస్తున్నట్లు ప్రకటించింది.

# ఆనాణేలన్నీ చెల్లుబాటవుతాయ్

### వీడియో విడుదలచేసిన ఆర్బీఐ



**ముంబయి, డిసెంబరు 8:** 50 పైసల నాణేంతో సహా వివిధ విలువలు కలిగిన నాణేలు,నోట్లు చలామణిలోఉన్నాయని భారత రిజర్వుబ్యాంకు స్పష్టం చేసింది. నకిలీ నోట్ల గుర్తింపు, కరెన్సీకి సంబంధించిన అపోహల గురించి ప్రజలకు ఆర్బీఐ ఎప్పటికప్పుడు అవగాహన కల్పిస్తూ ఉంటుంది. తాజాగా, నాణేలపై ప్రజల నెలకొన్న అనుమానాలను నివృత్తి చేసే ప్రయత్నం చేసింది. ఇందులో భాగంగా వాట్సాప్‌ద్వారా వ్యక్తిగతసందేశాలు పంపుతోంది. నాణేలపై అవగాహన కల్పిస్తూ ఒక వీడియోను రూపొందించింది. ఈ వీడియో ప్రకారం, ఒక కొనుగోలుదారు రూ.10నాణేన్ని తీసుకువస్తే, దుకాణదారు అది చెల్లదని చెబుతాడు. అయితే ఆనాణేలు చెల్లుబాటు అవుతాయని కొనుగోలుదారుడు దుకాణదారుకు సమాధానమిస్తాడు. చివరగా, అన్నీ నాణేలు చెల్లుబాటు అవుతాయని రూ.10నాణేంతో మాట్లాడిస్తున్నట్లుగా ఈ వీడియో ఉంటుంది. నాణేలు వేర్వేరు డిజైన్‌లతో ఉన్నప్పటికీ అవన్నీ చలామణిలో ఉన్నాయని ఆర్బీఐ ఈ వీడియో ద్వారా స్పష్టం చేసింది. 50పైసలు, రూ.1, రూ.2, రూ.5, రూ.10, రూ.20 నాణేలు అన్నీ చెల్లుబాటు అవుతాయని ఆర్బీఐ తెలిపింది. నాణేల గురించి తప్పుదోవపట్టించే సమాచారంలేదా వదంతులను నమ్మవద్దని సూచించింది.

# రిజర్వేషన్ వ్యవస్థలో ఎయిరిండియా మార్పులు




**న్యూఢిల్లీ, డిసెంబరు 8:** విమానయాన సంస్థ ఇండిగోలో కార్యకలాపాలు నిలిచిపోయి, విమానాలు రద్దు కావడంతో టికెట్ ధరలు అమాంతం పెరిగాయి. ఈ పరిణామంపై స్పందించిన పౌర విమానయాన మంత్రిత్వ శాఖ ఎకానమీ క్లాస్ టికెట్ ధరలపై పరిమితులు విధిస్తూ 6న ఆదేశాలు జారీ చేసింది. ఈ ఆదేశాలకు అనుగుణంగా ఎయిర్ ఇండియా గ్రూప్ తమ రిజర్వేషన్ సిస్టమ్స్‌లో కొత్త ధరల విధానాన్ని అమలు చేయడం ప్రారంభించింది. ఇప్పటికే ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ ఈ మార్పులను పూర్తి చేయగా, ఎయిర్ ఇండియా విమానాల్లో కూడా అన్ని బుకింగ్ ఛానళ్లలో కొత్త ధరలను క్రమంగా అందుబాటులోకి తెస్తున్నట్లు వెల్లడించింది. మరికొన్ని గంటల్లో ఈ మార్పులు అన్ని సిస్టమ్స్‌లో కనిపిస్తాయని తెలిపింది. థర్డ్‌పార్టీ రిజర్వేషన్ ప్లాట్‌ఫామ్‌లతో సమన్వయం చేసుకోవాల్సి ఉన్నందున, ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా దశలవారీగా ఈ ప్రక్రియను అమలు చేస్తున్నామని ఎయిర్ ఇండియా వివరించింది. ఈ మార్పుల సమయంలో, ప్రభుత్వం నిర్దేశించిన పరిమితి కంటే ఎక్కువ బేస్ ఫేర్‌తో టికెట్లు బుక్ చేసుకున్న ప్రయాణికులకు అదనంగా చెల్లించిన మొత్తాన్ని తిరిగి చెల్లిస్తామని కూడా ఎయిర్ ఇండియా స్పష్టం చేసింది. ఇండిగో సంక్షోభం తర్వాత విమానయాన సంస్థల ధరలపై ప్రభుత్వం నిఘా పెట్టింది. పరిస్థితి సాధారణ స్థితికి వచ్చే వరకు టికెట్ ధరలను అదుపులో ఉంచాలని అన్ని సంస్థలకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది.

# నిలకడగా పసిడి, వెండి ధరలు

**ముంబయి, డిసెంబరు 8:** కొంతకాలంగా పెరుగుతున్న బంగారం ధరలకు సోమవారం స్వస్తి పలికింది. దేశీయ మార్కెట్లో పసిడి ధరలు స్థిరంగా కొనసాగుతుండగా, వెండి ధర స్వల్పంగా పెరిగింది. అంతర్జాతీయంగా నెలకొన్న భౌగోళిక, రాజకీయ అనిశ్చితుల నేపథ్యంలో పెట్టుబడిదారులు బంగారాన్ని సురక్షితమైన పెట్టుబడిగా భావిస్తున్నారు. దీనికి తోడు డాలర్‌తో రూపాయి మారకం విలువ క్షీణించడం కూడా పసిడి ధరలు అధిక స్థాయిలో నిలకడగా ఉండటానికి కారణంగా భావిస్తు న్నారు. సోమవారం ఉదయం మార్కెట్ ధరప్రకారం హైదరాబాద్, విజయవాడ మార్కెట్లలో 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర రూ.1,30,140 వద్ద స్థిరంగా ఉంది. అదేవిధంగా, 10 గ్రాముల 22 క్యారెట్ల బంగారం ధర రూ. 1,19,300గా కొనసాగుతోంది. దేశ రాజధాని ఢిల్లీలో 10 గ్రాముల 24 క్యారెట్ల పసిడి రూ. 1,30,290 పలుకుతుండగా, 22క్యారెట్ల బంగారం రూ.1,19,440 వద్ద ఉంది. ముంబై, చెన్నై, బెంగళూరు వంటి ప్రధాన నగరాల్లో కూడా దాదాపు ఇవేధరలు కొనసాగుతున్నాయి. మరోవైపు వెండిధరలో స్వల్ప పెరుగుదల కనిపించింది. నిన్నటితోపోలిస్తే కేజీ వెండిపై రూ.100 పెరిగింది. దీంతో హైదరాబాద్, విజయవాడలలో కేజీ వెండిధరరూ.1,95,800కి చేరింది. అయితే ఢిల్లీ, ముంబైలలో దీని ధర రూ. 1,89,900గా ఉంది. బంగారం, వెండి ధరలు ప్రాంతాన్ని బట్టి, పన్నులను బట్టి మారుతుంటాయి. కొనుగోలుదారులు గమనించి, తాజా ధరలను తెలుసుకున్న తర్వాతే కొనుగోలు చేయడం మంచిది.

# ఐటి రిఫండ్‌లపై అపోహలు వద్దు

### సిబిడిటి చీఫ్ రవి అగర్వాల్




**న్యూఢిల్లీ, డిసెంబరు 8:** ఐటీ రిటర్న్ ఫైల్ చేసి నెలలు గడుస్తున్నా ఇప్పటికీ చాలామందికి రిఫండ్ రాలేదు. నిత్యం కొన్ని వేల మంది ఇంకా రిఫండ్ కోసం ఎదురుచూస్తూనే ఉన్నారు. ఐటీ రిటర్న్ కోసం దాఖలు చేసిన వివరాలను సరిచూసుకుని అధికంగా కట్టిన మొత్తాన్ని పన్నుదారుడికి తిరిగివ్వడం చాలా పెద్ద ప్రక్రియ అని సిబిటిడి చీఫ్ రవి అగర్వాల్ తెలిపారు. రిటర్న్ ఫైలింగ్‌లో పేర్కొన్న లావాదేవీలను పరిశీలించడం, సరిచూసుకోవడానికి కొంత ఆలస్యం జరగడం సాధారణమేనని చెప్పారు. పెద్ద మొత్తంలో రిటర్న్ కోసం దాఖలు చేసిన వాటిని, అనుమానిత వ్యవహారాలను మరింత నిశితంగా పరిశీలించాల్సి వస్తుందన్నారు. అయితే, ఈ నెలాఖరులోగా అందరికీ టాక్స్ రిఫండ్ చేస్తామని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. రిటర్న్ కోసం ఫైలింగ్ చేసినప్పుడు పన్నుదారుడు చేసే ఐదు పొరపాట్ల కారణంగా కూడా రిఫండ్ ఆలస్యం కావొచ్చని ఆయన చెప్పారు. రిఫండ్ కోసం ఎదురుచూస్తుండడం కాకుండా పొరపాట్లు ఉన్నాయా అనేది చెక్ చేసుకోవాలని, ఐటీ శాఖనుంచి వచ్చే మెయిల్స్‌ను ఎప్పటికప్పుడు చెక్ చేసుకోవాలని సూచించారు. ఐటీఆర్ ఫైలింగ్‌లో చాలామంది చేసే సాధారణ పొరపాటు బ్యాంకు ఖాతా వివరాల్లో తప్పులు.

ఖాతా నెంబర్ కానీ, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ తప్పుగా ఎంటర్ చేయడం వల్ల కానీ రిఫండ్ ఆలస్యమవుతుంది. బ్యాంకు ఖాతాలోని పేరుకు, పాన్ కార్డు మీద ఉన్న పేరు సరిగ్గా మ్యాచ్ కాకపోతే రిఫండ్ ఆలస్యమవుతుంది. ఇన్ కంటాక్స్ పోర్టల్‌లో ప్రి వాలిడేట్ అయిన బ్యాంకు ఖాతాల్లోనే రిఫండ్ జమవుతుంది. ప్రి వాలిడేట్ కాని ఖాతాల విషయంలో రిఫండ్ ఆగిపోతుంది. పాన్ కార్డ్‌ను ఆధార్ కార్డుతో లింక్ చేసుకోవడం తప్పనిసరి. కార్డులను లింక్ చేయని ఖాతాదారులకు చెల్లించాల్సిన రిఫండ్‌ను ఐటీ శాఖ విత్ హోల్డ్ చేస్తుంది. రిఫండ్ కోసం దాఖలు చేసిన మొత్తాన్ని లెక్కించడంలో పొరపాటు చేసినా, మినహాయింపు కోరిన లావాదేవీలు వాలిడ్ కాకపోయినా రిఫండ్‌ను ఆపేసి అధికారులు విచారణ చేపడతారు. ఇన్ కం టాక్స్ ఇ ఫైలింగ్ పోర్టల్‌లోకి వెళ్లి యూజర్ ఐడీ, పాస్ వర్డ్‌తో లాగిన్ కావాలి. ఇ ఫైల్ సెక్షన్‌లో ఇన్‌కంటాక్స్ రిటర్న్‌పై క్లిక్ చేసి వ్యూ ఫైల్డ్ రిటర్న్‌ను సెలక్ట్ చేయాలి. అక్కడ అసెస్‌మెంట్ ఇయర్ ఆధారంగా రిఫండ్ స్టేటస్ చెక్ చేసుకోవచ్చు.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.